విజయవాడ
ఆదివారం,
15 ఫిబ్రవరి 2026
సంపుటి: 22, సంచిక: 46
వెల : 3/- పేజీలు : 12

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

Published From Vijayawada, Visakhpatnam, Tirupati    Editor : Devendra Venappagari



# సంక్షేమంతో పాటు అభివృద్ధి

## 3,32,205 కోట్ల అంచనాతో రాష్ట్ర బడ్జెట్.. ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

పేదలకు వివిధ రూపాల్లో లబ్ధి రూ.51,883 కోట్లు

పింఛన్లు, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, దీపం... తదితరాలు

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళలకు రూ.91,527 కోట్లు


సాగునీటి రంగానికి రూ.18,223 కోట్లు

ఒకటీ ఒకటీ కలిస్తే ప్రతిసారీ రెండే కానక్కర్లేదు.. ఒక్కోసారి అనూహ్యంగా ఎన్నో రెట్ల బలం సమకూరొచ్చు... 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే కూటమి రాష్ట్రంలో అఖండ విజయం సాధించడం తోపాటు అటు కేంద్రంలోనూ కీలక భాగస్వామిగా మారడం అలాంటిదే. ఆ పరపతితో.. మన సత్తువకు కేంద్ర బలాన్ని జోడించి, పీకల్లోతు అప్పుల్లో ఉన్న ఆర్థిక నావను గట్టెక్కించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శతథా ప్రయత్నిస్తోంది. సంక్షేమంతోపాటు అభివృద్ధిలోనూ సొంత వనరులతోపాటు కేంద్ర పథకాలు చేదోడుగా ముందుకెళుతోంది. ఈ క్రమంలో కేంద్ర బడ్జెట్ కన్నా ముందే ప్రణాళికలు రూపొందించుకుంది. మన ఆకాంక్షలు, అవసరాలపై ఢిల్లీ పెద్దలతో నిరంతరం సంప్రదిస్తోంది. తాజా కేంద్ర బడ్జెట్‌లో ప్రస్తావించిన పథకాలను రాష్ట్రానికి ఎలా తెచ్చుకోవాలో, ఛాలెంజ్ మోడ్‌లో ఎక్కువ నిధులు ఎలా సాధించుకోవాలో ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

**అమరావతి, ఫిబ్రవరి 14**

వీటన్నింటినీ శనివారం శాసనసభలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో ప్రభుత్వం పదేపదే నొక్కిచెప్పింది. 'కేంద్ర బడ్జెట్ ఆంధ్రప్రదేశ్‌కు ఆశాకిరణంలా ఉంది' అని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సూటిగా చెప్పేశారు. 2026–27 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ శాసనసభలో శనివారం ప్రవేశపెట్టారు. రూ. 3,32,205.34 కోట్ల అంచనా వ్యయంతో పద్దును సమర్పించారు. రెవెన్యూ లోటును రూ. 22,002 కోట్లకే పరిమితం చేస్తామని పేర్కొన్నారు. ద్రవ్య లోటు రూ. 75,868.09 కోట్లుగా ఉంటుందని అంచనా

- మిగతా 2వ పేజీలో





## అప్పులు తగ్గించుకుని.. ప్రగతి దిశగా

రూ.30 వేల కోట్లతో అంతర్జాతీయ ఉద్యానహబ్‌గా రాయలసీమ

- రూ.100 కోట్ల సీడ్‌కార్పస్‌తో ఏపీ వెల్త్‌ఫండ్ ఏర్పాటు
- ఆర్థికంగా బలహీనవర్గాలకు 25 లక్షల ఇళ్ల పట్టాలు, ఇళ్లు

-2లో

### చాలా మెరుగైన బడ్జెట్

వైకాపా సృష్టించిన విధ్వంసం నుంచి కోలుకుంటూ.. ప్రస్తుతమున్న పరిస్థితుల్లో చాలా మెరుగైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టాం. ఇప్పుడిప్పుడే ఇబ్బందులు అధిగమించి ట్రాక్ ఎక్కుతున్నాం. రానున్న రెండు మూడేళ్లలో మరింత మెరుగైన బడ్జెట్ వస్తుంది, అమరావతికి ఒక రూపు వస్తుంది. రాబోయే కాలంలో రాష్ట్రం అభివృద్ధి విషయంలో పరుగులు పెడుతుంది. అప్పుడు సంక్షేమం మరింత పెరుగుతుంది.

**– ముఖ్యమంత్రి చంద్రబాబు**

### సమగ్రాభివృద్ధికి బలమైన పునాది


స్వర్ణాంధ్ర సాధన దిశగా రాష్ట్ర సమగ్రాభివృద్ధికి బలమైన పునాది వేసేలా రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టాం. విద్య, ఆరోగ్యం, పరిశ్రమలు, మౌలిక సదుపాయాల కల్పన, యువత, మహిళా సాధికారత, సాంకేతికత ఇలా అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లే గ్రోత్ మోడల్‌గా ఈ బడ్జెట్ ఉంది.

**– ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్**

# విధ్వంసం నుంచి ఇప్పుడిప్పుడే గాడిలోకి!

## కేంద్ర సహకారంతో మెరుగైన బడ్జెట్: సీఎం

- ప్రస్తుత పరిస్థితుల్లో సమతౌల్యం
- అన్ని రంగాలకూ న్యాయం
- ఆదాయం తక్కువ.. ఖర్చులు ఎక్కువ
- సమస్యలు ఇంకా చాలా ఉన్నాయ్
- వ్యవసాయం నుంచి రాబడి పెరగాలి
- సేవల ఆదాయమూ పెరగాలి
- 2-3 ఏళ్లలో అమరావతికో రూపు
- రాజధాని దారుల్ని హైవేకు సంధానిస్తున్నాం
- సీమ ముఖచిత్రం మార్చింది మేమే: సీఎం



కేంద్ర సహకారంతో మెరుగైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టామని, ప్రస్తుత పరిస్థితుల్లో అన్ని రంగాలకు న్యాయం చేస్తూ సమతుల్యమైన బడ్జెట్ ప్రవేశపెట్టినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. అసెంబ్లీ లాబీలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు.

**అమరావతి, ఫిబ్రవరి 14 (భారత్ న్యూస్)**

వైసీపీ విధ్వంసం నుంచి కోలుకోవాలంటే ఇంకా సమయం పడుతుందని, ఇప్పుడిప్పుడే ట్రాక్ ఎక్కుతున్నామని అన్నారు. సమస్యలు ఇంకా చాలా ఉన్నాయని, ఆదాయం తక్కువ.. ఖర్చులు ఎక్కువ.. ఇది వారసత్వంగా వచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో మేనేజ్ చేసుకుంటూ వస్తున్నామని తెలిపారు. 'వ్యవసాయం నుంచి ఎక్కువ ఆదాయం రావాలి. సేవల రంగంలోనూ ఆదాయం పెరగాలి. వచ్చే 2–3 ఏళ్లలో మరింత మెరుగైన బడ్జెట్ ప్రవేశాపెడతాం' అని చెప్పారు. ఒంగోలు పాలకు.. అనంతపురం పండుకు.. ఎంతో డిమాండ్ ఉందని. ఈ రెండింటి రుచీ

- మిగతా 2వ పేజీలో



# ఈఎల్‌ఎఫ్‌పై ల్యాండైన మోదీ

## లాంఛనంగా జాతికి అంకితం

ఈశాన్యంలో తొలి హైవేరన్‌వే..గర్వించదగ్గ క్షణాలివి: ప్రధాని

ఈశాన్య భారతదేశంలో నిర్మితమైన తొలి హైవేరన్‌వేను ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ప్రారంభించారు. అస్సాంలోని దిబ్రూగఢ్ జిల్లాలో మోరాన్ సమీపంలో నేషనల్ హైవే 37పై సిద్ధం చేసిన ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ (ఈఎల్‌ఎఫ్)పై వాయుసేనకు చెందిన సీ130జె రవాణా విమానంలో ప్రధాని దిగారు.

-2లో



# పట్టణాలకు మహర్దశ

## లక్ష కోట్లతో అర్బన్ చాలెంజ్ ఫండ్

కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర పట్టణ ప్రగతికి భారీ ఊతం

- ప్రాజెక్టు వ్యయంలో 25% కేంద్ర సాయం
- కనీసం 50% మార్కెట్ సమీకరణలు

-6లో



# గ్రామం నుంచి గ్లోబల్‌కు

## 360 డిగ్రీల గ్రోత్ మోడల్ బడ్జెట్

అన్ని వర్గాలకూ సమ ప్రాధాన్యం

-2లో

సంక్షేమంతో కూడిన అభివృద్ధి ఫలాలు: పవన్ కల్యాణ్

గ్రామం నుంచి గ్లోబల్ స్థాయి వరకూ.. విద్య, ఆరోగ్యం, పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, యువత, మహిళా సాధికారత, సాంకేతికత.. ఇలా అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లే 360 డిగ్రీల సమతుల్య గ్రోత్ మోడల్‌గా రాష్ట్ర బడ్జెట్ రూపుదిద్దుకుందని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు.

# రేపు రాష్ట్రానికి బిల్‌గేట్స్

## సచివాలయంలో సీఎం, మంత్రులతో భేటీ!

ఆర్టీజీఎస్ ఫలితాలను ఆయనకు వివరించనున్న చంద్రబాబు

ఉండవల్లిలో వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించనున్న గేట్స్ బృందం

మిలిందా గేట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ బిల్ గేట్స్ నేతృత్వంలో ఫౌండేషన్ ప్రతినిధుల బృందం సోమవారం రాష్ట్రంలో పర్యటించనుంది. సోమవారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర సచివాలయానికి రానున్న ఈ బృందంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, ఐటీ మంత్రి లోకేశ్‌తో పాటు మంత్రులు, వివిధ శాఖల అధికారులు సమావేశమవుతారు.



-2లో

# సంక్షేమంతో పాటు అభివృద్ధి



(మొదటి పేజీ తరువాయి)

వేశారు. ఆర్థిక మంత్రిగా కేశవ్‌కు ఇది వరుసగా మూడో బడ్జెట్. పేదలకు నేరుగా రూ.వేల కోట్ల నిధులిస్తున్న సంక్షేమ పథకాలకు ఆర్థిక మంత్రి ఈ బడ్జెట్లో పెద్ద పీట వేశారు. సామాజిక పింఛన్లకు పెద్ద మొత్తంలో నిధులిచ్చారు. మహిళలు, బీసీలు, ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి గణనీయమైన కేటాయింపులు చూపారు. సాగునీటి ప్రాజెక్టులు, రోడ్లు, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం వంటి రంగా లకు ఎంతో ప్రాధాన్యమిచ్చారు. మరోవైపు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు కేంద్ర సహకారం తీసుకుంటామని ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్రానికి ఎలా ఉపయుక్తమయ్యే ఆస్కారం ఉందో కూడా ఈ బడ్జెట్‌లో విశదీకరించారు. ఐదేళ్ల వైకాపా అస్తవ్యస్త విధానాల నుంచి రాష్ట్రాన్ని ఎలా గట్టెక్కిస్తున్నామో వెల్లడించారు.

### కొత్త నిర్ణయాలు, ప్రాజెక్టుల దిశగా అడుగులు

రాయలసీమలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు ఏర్పాట్లు. కేంద్ర సాయం, ప్రైవేట్ భాగస్వామ్యం, బ్యాంకు రుణాలతో ఈ ప్రాజెక్టుకు రూపకల్పన

విశాఖ, అమరావతి, తిరుపతి ఆర్థిక జోన్ల అభివృద్ధి.. కేంద్ర సాయం పొందడం ఇందులో ముఖ్యం.

వచ్చే ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్తు అమలు

రూ.100 కోట్లతో ఏపీ సంపద నిధి ఏర్పాటు. ప్రైవేట్ భాగస్వాములను కూడా కలిపి ఆ నిధులతో ఇతరచోట్ల ప్రధాన ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెడతారు. ఆ ఫలితాల నుంచి రాష్ట్ర ఆర్థికశక్తిని పెంచుకోవాలనేది ఆలోచన.

దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభం

'సూపర్ సిక్స్' పేరిట అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు పెద్దపీట వేశారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లకు రూ.27,719 కోట్లు కేటాయించారు. తల్లికి వందనం కింద రూ.9,668 కోట్లు ఇచ్చారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు సాయం చేసేందుకు రూ.6,600 కోట్లు కేటాయించారు. ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు ఇచ్చేందుకు దీపం 2.0 పథకం కింద రూ.2,601 కోట్లు కేటాయించారు. మహిళలు, యువతులు, తదితరులకు ఉచిత బస్సు ప్రయాణం కోసం రూ.1,420 కోట్లు, బలహీనవర్గాల వారికి ఉచిత విద్యుత్తు, రాయితీపై విద్యుత్తు ఇచ్చేందుకు రూ.600 కోట్లు బడ్జెట్‌లో చూపారు. వివిధ సామాజికవర్గాల వారికి ఆర్థిక సాయం చేసేందుకు రూ.2,320 కోట్లు కేటాయించారు. ఆటోడ్రైవర్లకు సేవలో కార్యక్రమానికి రూ.450 కోట్లు, మత్స్యకార సేవలో కార్యక్రమానికి రూ.260 కోట్లు, ఉపకార వేతనాలకు రూ.3,836 కోట్లు, మధ్యాహ్న భోజనానికి రూ.2,161 కోట్లు నిధులిచ్చారు. పోలవరం ప్రాజెక్టును వచ్చే ఏడాదికి పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్న ప్రభుత్వం రూ.6,105 కోట్లు కేటాయించింది. ఇది కాక ఇతర భారీ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేసేందుకు రూ.9,906 కోట్లు కేటాయించింది. సాగునీటి రంగానికి మొత్తం రూ.18,223 కోట్లు కేటాయించారు. వ్యవసాయ, అనుబంధ శాఖలకు రూ.53,752 కోట్లు కేటాయించారు. రైతుల కోసం రూ.500 కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ధరల స్థిరీకరణకు రూ.300 కోట్లు బడ్జెట్‌లో చూపినా ఒక్క ఏడాదిలోనే రైతులకు రూ.1,200 కోట్లకు పైగా ఖర్చు చేశామని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు. పేదల కోసం ఆరు లక్షల కొత్త ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తామని ప్రకటించారు. కొత్తగా 100 కోర్టులకు ఆమోదం తెలియజేశారు. ప్రతి జిల్లాలో ప్రత్యేక సైబర్‌క్రైమ్ పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేయబోతున్నారు. పోలీసు వ్యవస్థను ఆధునికీకరిస్తామని ప్రకటించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి, పాఠశాల విద్య, వైద్యం, పట్టణాభివృద్ధి, గ్రామీణాభివృద్ధికి అధిక కేటాయింపులు చూపారు. ఆర్థిక మంత్రి బడ్జెట్‌లో చక్కని వ్యూహాలు ప్రతిపాదించినా వాటిని సాకారం చేయడమే పెద్ద సవాల్. 2026-27 ఆర్థిక సంవత్సరంలో రూ.2,34,140.14 కోట్ల రెవెన్యూ రాబడి వస్తుందని ఆర్థిక మంత్రి అంచనా వేశారు. కిందటి ఆర్థిక సంవత్సరంలో రూ.2,17,976 కోట్లు రెవెన్యూ రాబడిని ఆశిస్తే జనవరి నెలాఖరు వరకు వచ్చింది రూ.1,40,000 కోట్లే. సవరించిన అంచనాల ప్రకారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ రాబడి రూ.1,96,903 కోట్లు ఉంటుందని పేర్కొంటున్నారు. గత బడ్జెట్ (2025-26)ను రూ.3,22,359.34 కోట్లతో ప్రవేశపెట్టినా సవరించిన అంచనాల్లో దాన్ని రూ.3,00,534.67 కోట్లకే పరిమితం చేశారు. తుది లెక్కలు తేలేసరికి ఇంకా తగ్గిపోయే అవకాశాలే ఎక్కువ. మరో వైపు రెవెన్యూ లోటును రూ.22,002.50 కోట్లకే పరిమితం చేస్తామని హామీ ఇచ్చారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్ ప్రతిపాదనల్లో రూ.33,185.97 కోట్లు రెవెన్యూ లోటు ఉంటుందని అంచనా వేస్తే సవరించిన అంచనాల్లో అది రూ.41,118.36 కోట్లకు పెరగడం గమనార్హం.

# ఈఎల్‌ఎఫ్‌పై ల్యాండైన మోదీ

**గువాహటి/మోరాన్, ఫిబ్రవరి 14**

అనంతరం దాన్ని లాంఛనంగా జాతికి అంకితం చేశారు. ఈశాన్య భారతదేశానికి తొలి ఈఎల్ఎఫ్ సదుపాయం అందుబాటులోకి రావడం నిజంగా గర్వించదగ్గ విషయమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ప్రాకృతిక విపత్తులు తదితర సమయాల్లో ఈ సదుపాయం ఎంతగానో ఉపయోగపడుతుందని హర్షం వెలిబుచ్చారు. మోదీ ఒక రోజు పర్యటన నిమిత్తం శనివారం అస్సాం చేరుకున్నారు. ఉదయం ఢిల్లీ నుంచి ఆయన చబువా ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌కు చేరుకున్నారు. గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య, ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ, కేంద్ర మంత్రి శర్బానంద సోనోవాల్, ఎయిర్ చీఫ్ మార్షల్ ఎ.పి.సింగ్, రాష్ట్ర మంత్రులు తదితరులు ప్రధానికి స్వాగతం పలికారు. అనంతరం సీ130జె హెర్క్యులస్ విమానంలో ఆయన ఈఎల్ఎఫ్‌కు చేరుకున్నారు. రన్‌వేపై దిగాక సమీపంలో సిద్ధం చేసిన వేదికకు చేరుకున్నారు. అనంతరం ఈఎల్ఎఫ్‌పై వాయుసేన నిర్వహించిన ప్రత్యేక ఏరియల్ షోను వీక్షించారు. 20 నిమిషాలకు పైగా సాగిన ఈ షో ఆహూతులకు కనువిందు చేసింది. యుద్ధ విమానాలు, రవాణా విమానాలు, హెలికాప్టర్ల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పైలట్లు ఈఎల్ఎఫ్‌పై కచ్చితత్వంతో ల్యాండింగ్, టేకాఫ్‌తో పాటు పలు విన్యాసాలు నిర్వహించారు. స్థానికులు భారీ సంఖ్యలో వాటిని వీక్షించారు. తొలుత సుఖోయ్ 30 ఎంకేఐ, దాని వెనకే రఫేల్ ఈఎల్ఎఫ్ నుంచి టేకాఫ్ అయ్యాయి. తర్వాత ఏఎన్32 హెలికాప్టర్ టచ్ అండ్ గో విన్యాసాలు ప్రదర్శించింది. తర్వాత మూడేసి చొప్పున తొలుత సుఖోయ్, తర్వాత రఫేల్ యుద్ధ విమానాలు ప్రత్యేక విన్యాసాలతో అలరించాయి. విపత్తుల వేళ చేపట్టే సహాయక చర్యల సన్నద్ధతను ప్రత్యేకంగా తయారు చేసిన అధునాతన దేశీయ హెలికాప్టర్లు (ఏఎల్‌హెచ్) కళ్లకు కట్టాయి. అనంతరం ప్రధాని గువాహటి చేరుకున్నారు. అస్సాంలోని డిబ్రూగఢ్ జిల్లాలో నిర్మించిన ఈఎల్ఎఫ్ వ్యూహాత్మకంగా ఎన్నోవిధాలుగా అత్యంత కీలకమైనది. ఈ ఈఎల్ఎఫ్ చైనాకు 300 కి.మీ., మయన్మార్‌కు కేవలం 200 కి.మీ. దూరంలో ఉంటుంది. 4.2 కి.మీ. పొడవైన ఈ హైవేరన్‌వేను రూ.100 కోట్ల వ్యయంతో నిర్మించారు. సైనిక, పౌర అవసరాలు రెండింటికీ పూర్తిస్థాయిలో ఉపయోగపడేలా వాయుసేన సహకారంతో దీన్ని ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. పొరుగు దేశాలతో ఘర్షణల వేళ ప్రత్యర్థులు సమీపంలోని వైమానిక స్థావరాలపై దాడులు చేస్తే బలగాల తరలింపు తదితరాలకు తక్షణ సదుపాయంగా ఈఎల్ఎఫ్ కీలకపాత్ర పోషిస్తుంది. విపత్తులు, ఎమర్జెన్సీ సమయాల్లో డిబ్రూగఢ్ విమానాశ్రయానికి ప్రత్యామ్నాయంగా కూడా పని చేస్తుంది. డిబ్రూగఢ్‌మోరాన్ జాతీయ రహదారి37పై నిర్మించిన ఈఎల్ఎఫ్‌పై అన్నిరకాల యుద్ధ, రవాణా విమానాలనూ సులువుగా దించవచ్చు. రఫేల్, సుఖోయ్‌తో పాటు పలు భారీ రవాణా విమానాలు కూడా దీనిపై విజయవంతంగా ట్రయల్ రన్స్ నిర్వహించాయి. 40 టన్నుల బరువైన యుద్ధ విమానాలతో పాటు ఏకంగా 74 టన్నుల రవాణా విమానాలు కూడా దీనిపై సునాయాసంగా దిగవచ్చు. భారత్‌లో తొలి ఈఎల్ఎఫ్ రాజస్తాన్‌లోని బార్మేర్ జిల్లాలో 2021లో నిర్మితమైంది. అనంతరం మధ్య, ఉత్తర భారతంలో కూడా పలు ఈఎల్ఎఫ్‌లు అందుబాటులోకి వచ్చాయి.

# అప్పులు తగ్గించుకుని.. ప్రగతి దిశగా

- గ్రోత్ ఇంజిన్లుగా విశాఖపట్నం, అమరావతి, తిరుపతి రీజియన్లు
- బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి

అప్పులు తగ్గించుకుంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపించేలా బడ్జెట్‌ను రూపొందించినట్లు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ.. గత ప్రభుత్వం అడ్డగోలుగా చేసిన అప్పులపై వడ్డీరేట్లు తగ్గించేందుకు చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. శాసనసభలో శనివారం రాష్ట్ర బడ్జెట్‌ను పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టారు. 'వైకాపా ప్రభుత్వం ఏకంగా 12.3% వడ్డీ వరకు అప్పులు తెచ్చింది. రాష్ట్రానికి ఆర్థికభారంగా పరిణమించిన ఈ రుణాలను 9% లేదా అంతకంటే తక్కువకు తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నాం. ఇప్పటి వరకు రూ.43,298 కోట్ల రుణాలకు వడ్డీని తగ్గించి, సంవత్సరానికి రూ.327 కోట్లు ఆదా చేశాం' అని తెలిపారు.

'రాయలసీమ రీజియన్‌ను రూ.30వేల కోట్లతో అంతర్జాతీయ ఉద్యానహబ్‌గా అభివృద్ధి చేయనున్నాం. రాయలసీమతో పాటు ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లోని 303 మండలాల్లో 200 పైగా క్లస్టర్లు ఏర్పాటు చేస్తాం. ఉద్యాన ఉత్పత్తులకు మంచి మార్కెట్ కల్పించడం వల్ల లక్ష మంది రైతులకు లబ్ధి చేకూరుతుంది. వ్యవసాయ, వ్యవసాయేతర రంగాల్లో ప్రత్యక్షంగా 9 లక్షల ఉద్యోగాలు లభిస్తాయి. దీంతో రాయలసీమపై వెనుకబడిన ప్రాంతమన్న ముద్ర తొలగిపోతుంది. రాయలసీమ పేరు చెబితే 'మిగులు' తప్ప, కొరత అన్నమాట వినపడదు' అని వెల్లడించారు. 'గత ప్రభుత్వ విధ్వంసకర పాలన చేసిన లోతైన గాయాలు, మిగిల్చిన చేదు అనుభవాలు మనం ఏం చేయకూడదో నిరంతరం గుర్తుచేస్తున్నాయి. రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని జోడెద్దుల బండిలా పరుగులు పెట్టించాలన్న దృఢ సంకల్పానికి ఈ బడ్జెట్ నిదర్శనం. రాష్ట్రాన్ని పునర్నిర్మాణం దిశగా నడిపించేం దుకు 2024 బడ్జెట్ బలమైన పునాది వేసింది. రైతుల కలలు నెరవేర్చేలా, యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేలా, తన బిడ్డలను చక్కగా పెంచాలనే తల్లికి భరోసా ఇచ్చేలా ఈ బడ్జెట్ రూపొందించాం. ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించే ప్రతి రూపాయీ రాష్ట్ర ప్రజల ఆశలు, ఆకాంక్షల్ని సాకారం చేస్తుంది. విధ్వంసం నుంచి వికాసం దిశగా ఇప్పటి వరకు సాగిన అభివృద్ధి ప్రయాణం అద్భుతం. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టాం. రాష్ట్రానికి విభజనతో జరిగిన నష్టంతో పాటు గత ప్రభుత్వ పాలన తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. చాలా సవాళ్లున్నా రాష్ట్రం చెప్పుకోదగ్గ స్థాయిలో అభివృద్ధి చెందిందని చెప్పడానికి గర్వపడుతున్నాం.

163 కేంద్ర ప్రాయోజిత పథకాలకు రూ.18,701 కోట్లు విడుదల చేసి, వాటిలో 85 పథకాలు మళ్లీ అమలయ్యేలా చేస్తున్నాం. రూ.100 కోట్ల సీడ్‌కార్పస్‌తో ఏపీ వెల్త్‌ఫండ్ ఏర్పాటు. ప్రైవేటు ఈక్విటీ పెట్టుబడిదారులను ఆహ్వానించి రాష్ట్రానికి సంపద సృష్టించే దిశగా ముందుకు సాగుతున్నాం.

విశాఖపట్నం, అమరావతి, తిరుపతి రీజియన్లను రాష్ట్రానికి కీలకమైన గ్రోత్ ఇంజిన్లుగా గుర్తించాం.

నీతి ఆయోగ్‌తో కలిసి విశాఖపట్నం ఎకనమిక్ రీజియన్‌కి ఎకనమిక్ మాస్టర్‌ప్లాన్. విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, పోలవరం, కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో ఉత్పత్తి, సేవలు, మౌలిక వసతులు, పట్టణీకరణ, వ్యవసాయ రంగాల్లో 41 అత్యంత ప్రభావం చూపే ప్రాజెక్టులు ఏర్పాటు కానున్నాయి.

ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ఎన్టీఆర్ నగర్స్ కింద ఆర్థికంగా బలహీనవర్గాలకు చెందిన కుటుంబాలకు 25 లక్షల ఇళ్ల పట్టాలు, సొంతింటి కలను నెరవేర్చడం లక్ష్యంగా పెట్టుకున్నాం.

### పోలీసు వ్యవస్థ గౌరవం పునరుద్ధరణ

గత ప్రభుత్వంలో దెబ్బతిన్న పోలీసు వ్యవస్థ గౌరవం పునరుద్ధరణ. పోలీసుశాఖకు త్వరలో 3 వేల కొత్త వాహనాలు కొనుగోలు చేయనున్నాం.

డిజిటల్ అరెస్టులు, ఆన్‌లైన్ మోసాల్లాంటి ఆధునిక నేరాలను అరికట్టేందుకు ప్రతి జిల్లాలో సైబర్‌క్రైమ్ పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నాం

జిల్లా న్యాయవ్యవస్థకు కోర్టు భవనాలు, నివాసగృహాల నిర్మాణం. 2026-27లో తొలి దశలో కొత్తగా 100 కోర్టులు ఏర్పాటు చేయనున్నాం.

దివ్యాంగుల సమగ్రాభివృద్ధి కోసం 'ఇంద్రధనస్సు' కార్యక్రమం. ఇందులో భాగంగా ఉచిత బస్సు ప్రయాణం, రాయితీ పథకాల పునరుద్ధరణ, క్రీడా శిక్షణ, గృహనిర్మాణం, వినికిడి లోపం ఉన్నవారికి ప్రత్యేక డిగ్రీ కళాశాల, దివ్యాంగుల భవనాలు ఏర్పాటు చేస్తాం. ఉద్యోగి ప్రమాదవశాత్తు మరణిస్తే ప్రభుత్వ నిబంధనలకు మించి బీమా ప్రయోజనాలు అందించేందుకు బ్యాంకులతో ఒప్పందం.

కార్మికుల సంక్షేమాన్ని మరింత బలోపేతం చేసేందుకు కొత్త ఈఎస్ఐ వైద్య సదుపాయాలు. విజయనగరం, గుంటూరు, నెల్లూరు జిల్లాల్లో వంద పడకల ఆస్పత్రుల నిర్మాణం. కర్నూలు, శ్రీసిటీ, అచ్యుతాపురం, శ్రీకాకుళం ప్రాంతాల్లో 30 పడకల ఆస్పత్రులు ఏర్పాటు చేయనున్నాం.

గోదావరి పుష్కరాల సందర్భంగా యాత్రికులకు భద్రతతో కూడిన ఆధ్యాత్మికత అందించేందుకు సమగ్ర ఏర్పాట్లు. దీనికి ప్రారంభంగా రూ.60 కోట్లు కేటాయించాలని ప్రతిపాదిస్తున్నా. సాగునీరు, రహదారులు, ఇతర పనులకు రూ.37,030 కోట్లు చెల్లించి ఆర్థిక కార్యకలాపాల పునరుద్ధరణ చేపట్టాం. విశాఖపట్నం, విజయవాడ ప్రజలకు మెట్రోరైలు ప్రయాణ కలను తర్వలో సాకారం చేయనున్నాం. ప్రజల రాజధాని అమరావతిని నిర్మించాలనే నిబద్ధతతో ప్రభుత్వం పనిచేస్తోంది. వివిధ ఆర్థిక సంస్థల ద్వారా స్వయంసమృద్ధి నమూనాలో నిధులను సమీకరించి రాజధాని పనులను వేగంగా ముందుకు తీసుకెళ్తున్నాం. రూ.57,868 కోట్ల విలువైన 97 పనులకు పరిపాలన అనుమతులు జారీ చేశాం.




# జీఎస్టీ ద్వారా 17,603 కోట్ల రాబడి

## ఐజీఎస్టీ నుంచి 18,893 కోట్లు

## రిజిస్ట్రేషన్లు, ఎక్సైజ్ నుంచి భారీగా ఆదాయం

**అమరావతి, ఫిబ్రవరి 14**

వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఆదాయార్జన పెరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలో జీఎస్టీ వసూళ్లు రూ. 17,603 కోట్లుగా ఉంటుందని బడ్జెట్‌లో అంచనా వేసింది. గత బడ్జెట్ సవరించిన అంచనాల ప్రకారం 2025-26 ఆర్థిక సంవత్సరం ముగింపు సమయానికి రూ. 15,889.37 కోట్లు జీఎస్టీ వసూలవుతుందని భావిస్తున్నారు. 2024-25లో రూ. 15,210 కోట్లు జీఎస్టీ వసూలైంది. ఇక 2026-27లో ఐజీఎస్టీ రూ. 18,893.64 కోట్లుగా అంచనా వేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.16,755 కోట్లు వస్తుందని భావిస్తున్నారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ఆదాయం భారీగా పెరుగుతుందని ప్రభుత్వం లెక్కలు వేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ. 18,701.35 కోట్లు వస్తుందని అంచనా వేస్తున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరం పూర్తయ్యే నాటికి రూ. 11,024.60 కోట్లు వస్తాయని భావిస్తున్నారు. 2024-25లో రిజిస్ట్రేషన్ల శాఖకు రూ. 8,837 కోట్ల ఆదాయం వచ్చింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఎక్సైజ్ శాఖ నుంచి రూ. 30,066 కోట్ల ఆదాయం వస్తుందని బడ్జెట్‌లో అంచనా వేశారు. 2025-26 ముగిసే నాటికి రూ. 23,648 కోట్లు వస్తాయని భావిస్తున్నారు. అమ్మకాలు, వాణిజ్య పన్నుల ద్వారా రూ. 24,125 కోట్లు వస్తాయని బడ్జెట్‌లో అంచనాలు వేయగా, 2025-26లో రూ. 18,006 కోట్లు వచ్చాయి. ఇక విద్యుత్ పన్నుల ద్వారా వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ. 512 కోట్లు వస్తాయని భావిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2026-27 బడ్జెట్‌లో మైనార్టీల సంక్షేమానికి రూ.6,090 కోట్లు కేటాయించింది. గతేడాది బడ్జెట్‌లో రూ.5,434 కోట్లు కేటాయించగా.. ఈ ఏడాది 6,090 కోట్లు కేటాయించింది. గత ఏడాది కన్నా రూ.656 కోట్లు అదనంగా కేటాయించారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మాట్లాడుతూ మైనార్టీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు. మైనార్టీ సబ్‌ప్లాన్ ద్వారా ఇతర శాఖల ద్వారా మైనార్టీలు లబ్ధి పొందేందుకు వీలుగా సబ్‌ప్లాన్‌కు రూ.3,133 కోట్లు కేటాయించిందని తెలిపారు. మైనార్టీల సంక్షేమానికి బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇచ్చిన సీఎం చంద్రబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# రేపు రాష్ట్రానికి బిల్‌గేట్స్

**అమరావతి, ఫిబ్రవరి 14**

గేట్స్ ఫౌండేషన్ సహకారంతో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులను మరింత విస్తరించే అంశంపై ఈ సమావేశంలో చర్చిస్తారు. అనంతరం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రానికి వెళ్లి పాలనలో సాంకేతికత వినియోగాన్ని పరిశీలిస్తారు. రియల్ టైమ్ గవర్నెన్స్ విధానాలు, ఫలితాలను బిల్‌గేట్స్‌కు చంద్రబాబు వివరిస్తారు. స్వర్ణాంధ్ర విజన్-2047 లక్ష్యాలు, ప్రజారోగ్యం, వ్యవసాయం, విద్య తదితర రంగాల్లో చేపట్టిన సంస్కరణలపై కూడా సీఎం ప్రజంటేషన్ ఇస్తారు. మెడ్‌టెక్, డయాగ్నోస్టిక్స్ సేవలు, సంజీవని తదితర ప్రాజెక్టుల వివరాలను ఆయనకు తెలియజేస్తారు. అనంతరం బిల్‌గేట్స్ బృందం అమరావతిలోని ఉండవల్లి గ్రామంలో ఉన్న ఒక వ్యవసాయ కేంద్రానికి వెళ్లనుంది. వ్యవసాయ క్షేత్రంలో డ్రోన్లు, ఏఐ టెక్నాలజీ సహకారంతో చేపట్టే సాగువిధానాన్ని బృందం పరిశీలిస్తుంది.

# గ్రామం నుంచి గ్లోబల్‌కు

**అమరావతి, ఫిబ్రవరి 14**

రాష్ట్ర బడ్జెట్‌పై 'ఎక్స్' వేదికగా ఆయన స్పందించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ.. అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యం, సంక్షేమంతో కూడిన అభివృద్ధి ఫలాలు అందిస్తున్నామన్నారు. 'చంద్రబాబు నేతృత్వంలో 360 డిగ్రీల్లో రాష్ట్ర సమగ్రాభివృద్ధికి బలమైన పునాది వేసేలా.. రూ.3.22 లక్షల కోట్ల వ్యయంతో బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు రూ.22,942 కోట్ల కేటాయింపులు జరపడం ద్వారా రాష్ట్రాభివృద్ధిలో గ్రామాల పాత్ర కీలకమనే విషయాన్ని ఎన్డీఏ ప్రభుత్వం పునరుద్ఘాటించింది. పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖలకు 714 కోట్లు కేటాయించింది' అని చెప్పారు.

# విధ్వంసం నుంచి ఇప్పుడిప్పుడే గాడిలోకి!

(మొదటి పేజీ తరువాయి)

మరెక్కడా రాదన్నారు. రెండు మూడేళ్లలో అమరావతికి ఒక రూపం వస్తుందని, రాజధాని దారులను జాతీయ రహదారికి అనుసంధానిస్తున్నామని.. అమరావతికి రాకపోకలు పెరిగి రాబడి కూడా వస్తుందని చెప్పారు. 'రాయలసీమ ముఖచిత్రం మార్చింది మేమే.. సీమ ఉద్యాన హబ్‌కు బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యం ఇవ్వడంపై ఎమ్మెల్యేలు సంతోషంగా ఉన్నారు. ఈ ప్రాంతంలో ఒకప్పుడు పశువులకు నీరు కూడా దొరికే పరిస్థితి లేదు. 2014-19 మధ్య కూడా రెయిన్ గన్స్‌తో పంటలను కాపాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అప్పుడే హంద్రీ-నీవా సుజల స్రవంతిని సీరియస్‌గా తీసుకున్నాం. ఆ ఫలితాలు ఇప్పుడు చూస్తున్నాం' అని వివరించారు.

బిల్ గేట్స్ సోమవారం అమరావతికి వస్తున్నారని సీఎం చెప్పారు. ఆయన్ను రాష్ట్రానికి మూడుసార్లు తీసుకొచ్చిన ఘనత తనదేనన్నారు. 'తొలిసారి హైటెక్ సిటీ, రెండోసారి విశాఖ అగ్రిటెక్ కోసం వచ్చారు. ఇప్పుడు సంజీవని పథకం కోసం వస్తున్నారు. దీనికి సంబంధించి ఆర్టీజీఎస్‌లో కార్యక్రమం రూపొందించాం' అని తెలిపారు. 'హైదరాబాద్‌లో ఒకప్పుడు జూబ్లీహిల్స్ దాటితే మొత్తం అడవిలా ఉండేది. 1982లో జూబ్లీహిల్స్‌లో ఇప్పుడు బాలకృష్ణ ఉంటున్న ఇంటి స్థలంలో నాకు ఇల్లు కట్టిస్తానని ఎన్టీఆర్ చెప్పారు. అప్పుడు నేను స్థలం చూడడానికి వెళ్తే.. మొత్తం అడవిలా ఉంది.. అక్కడకు ఆటోలు కూడా రావని.. పెద్దాయనతో సున్నితంగా వద్దని చెప్పా. ఆ తర్వాత అక్కడ బాలకృష్ణకు ఇల్లు కట్టించి ఇచ్చారు. నాలుగేళ్లలోనే అక్కడి పరిస్థితులు మారిపోయాయి. బాలకృష్ణ చెన్నైలో ఉంటే నేను 4 ఏళ్లు అదే ఇంట్లో ఉన్నా. జూబ్లీహిల్స్‌లోనే అక్కడకు సమీపంలో నా ఇల్లు పూర్తయ్యాక అక్కడకు మారాను. అమరావతి అభివృద్ధిలోనూ ఇలాంటి గణనీయ మార్పులే ఉంటాయి' అని సీఎం స్పష్టంచేశారు. ఎమ్మెల్యేలకు సీల్డ్ కవర్‌లో ఇచ్చే నివేదిక ద్వారా వారిని వారికి అద్దంలో చూపిస్తున్నానని చంద్రబాబు తెలిపారు. 1995-96లో మాదిరిగానే ఇప్పుడూ నిక్కచ్చిగా ఉంటానని.. మారకపోతే వాళ్లకే నష్టమని స్పష్టంచేశారు. 'మొత్తం 9 పారామీటర్లలో సర్వే చేయించి నివేదిక ఇస్తున్నా. వారికి తెలియని ఇంకొన్ని పారామీటర్లు కూడా నా వద్ద ఉన్నాయి. లోకేశ్ పని లోకేశ్ చేస్తున్నారు. నా పని నేను చేస్తున్నా. నేతలతో మానం సంబంధం, మోటివేషన్.. రెండూ భయం-భక్తిలా ఉండాలి' అని వ్యాఖ్యానించారు.

ఫారం నెం. 14
(రెగ్యులేషన్ 33(2) చూడుము)
రిజిస్టర్డ్ ఎ/డి, దస్తీ ద్వారా విఫలమైనచో ప్రచురణ ద్వారా

**రికవరీ ఆఫీసర్ - I/II వారి కార్యాలయం**
**డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ హైదరాబాద్ (DRT 1)**
3వ అంతస్తు, త్రివేణి కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్-500001

**డిమాండ్ నోటీసు**

రికవరీ ఆఫ్ డెట్స్ & బ్యాంక్రప్టసీ యాక్ట్, 1993లోని సెక్షన్‌లు 25 నుండి 28 మరియు ఆదాయపు పన్ను చట్టం, 1961లోని రెండవ షెడ్యూల్ యొక్క రూల్ 2 క్రింద నోటీసు

ఆర్‌సి/205/2025 03.02.2026

**కెనరా బ్యాంక్**
**వర్సెస్**
**మెస్సర్స్ శ్రీ నిహార్ ఇండస్ట్రీస్**

దిగువ వారికి

(CD 1) మెస్సర్స్ శ్రీ నిహార్ ఇండస్ట్రీస్ మెస్సర్స్ శ్రీ నిహార్ ఇండస్ట్రీస్ ప్రతినిధి దాని ప్రొప్రైటర్ శ్రీమతి యమునా యార్లగడ్డ ప్రతినిధిగా ప్రొప్రైటర్ శ్రీమతి యమునా యార్లగడ్డ ఇ.నెం. 7-2-6 /డి0/10, ఫ్లాట్ నెం., 405, శ్రీ సాయి జగపత్‌టవర్స్ దుర్గానగర్, హైదరాబాద్ - 500079. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్, తెలంగాణ-501505
మరియు మెస్సర్స్ శ్రీ నిహార్ ఇండస్ట్రీస్, ప్రతినిధిగా ప్రొప్రైటర్ శ్రీమతి యమునా యార్లగడ్డ, షెడ్ నెం. IV, సర్వే నం.17 కవాడిపల్లి గ్రామం, బాల్‌ఫగూడ రోడ్ అబ్దుల్లాపూర్‌మెట్ మండల్, టిఎస్-501505.

(CD 2) శ్రీమతి యమునా యార్లగడ్డ భర్త శ్రీ వెంకట సుబ్రమణేశ్వర రావు, వయస్సు 33 సంవత్సరాలు, వృత్తి: వ్యాపారం, నివాసం: 11-76, మచిలీపట్నం రోడ్, పామర్రు కృష్ణ, ఆంధ్ర ప్రదేశ్ -500001

OA/288/2023 ప్రిసైడింగ్ ఆఫీసర్, డెట్స్ రికవరీ ట్రిబ్యూనల్, హైదరాబాద్ (డిఆర్‌టి-1) ద్వారా జారీచేసిన ఉత్తర్వులు అనుసరిస్తూ రికవరీ సర్టిఫికేట్ ప్రకారం రూ. 8762761.45 (రూపాయలు ఎనభై ఏడు లక్షల అరవై రెండు వేల ఏడు వందల అరవై ఒకటి మరియు పైసలు నలభై ఐదు మాత్రమే) 01.08.2023 నుండి చెల్లింపు వరకు పెండెంటెలైట్ మరియు సాలుకు సాధారణ వడ్డీ వంతున భవిష్య వడ్డీ (రికవరీ సర్టిఫికెట్ ప్రకారం) ఖర్చులు రూ. 148000 (రూపాయలు ఒక లక్షా నలభై ఎనిమిది వేలు మాత్రమే) మీరు (ఉమ్మడిగా మరియు విడివిడిగా మరియు పూర్తిగా/ పరిమితంగా చెల్లించవలసి ఉన్నది)

2) కావున ఈ నోటీసు స్వీకరణ నుండి 15 రోజులలోగా పైన తెలిపిన మొత్తమును చెల్లించవలసిందిగా ఆదేశిస్తూ, విఫలమైనచో రికవరీ ఆఫ్ డెట్స్ డ్యూ టూ బ్యాంక్స్ మరియు ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్ యాక్ట్, 1993 మరియు అందులోని రూల్స్‌కు అనుగుణంగా వసూలు చేయబడును.

3) కావున తదుపరి విచారణ తేదిలోగా మీ ఆస్తులపై పూర్తి వివరములతో ఒక అఫిడవిట్ దాఖలు చేస్తూ ప్రకటించవలసిందిగా మిమ్మల్ని ఆదేశించడమైనది.

4) కావున తదుపరి ప్రొసీడింగ్స్ కొరకు తేది: 17.03.2026న ఉ॥ 10.30గం॥లకు ఈ క్రింది సంతకందారు సమక్షమునకు హాజరు కావలసిందిగా మిమ్మల్ని ఆదేశించడమైనది.

5) పైన తెలిపిన మొత్తమునకు అదనముగా మీరు చెల్లించవలసిన మొత్తము:

ఎ) సర్టిఫికెట్/ అమలుచేయు ప్రొసీడింగ్స్ యొక్క ఈ నోటీసు తరువాత వెంటనే ప్రారంభమగు కాలమునకు అట్టి వడ్డీలు చెల్లించవలెను.

బి) బకాయి మొత్తము వసూలు చేసుకొనుటకు అన్ని ఇతర ప్రొసీడింగ్స్ చేపట్టుటకు మరియు ఇతర ప్రొసెస్‌లు, వారెంట్లు మరియు ఈ నోటీసు సేవలకు సంబంధించి అన్ని ఛార్జీలు, ధరలు మరియు వ్యయములతో చెల్లించవలెను.

తేది: 03.02.2026న నాచే సంతకం చేసి మరియు ట్రిబ్యునల్ సీలు వేసి జారీచేయడమైనది.

రికవరీ ఆఫీసర్
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్, హైదరాబాద్ (DRT-1)


# మహాశివరాత్రి ఆధ్యాత్మిక వైభవం నిర్వహణకు ఏర్పాట్లు

- తి.తి.దే. హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో విజయవాడ, పామర్రులో భక్తి కార్యక్రమాలు




**విజయవాడ, ఫిబ్రవరి 14** (మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకునితిరుమల తిరుపతి దేవస్థానములుకు చెందిన హిందూధర్మప్రచార పరిషత్, ఎన్టీఆర్ జిల్లా ఆధ్వర్యంలో ఫిబ్రవరి 15 (ఆదివారం) సాయంత్రం ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజయవాడ లబ్బీపేటలోని శ్రీ శ్రీ శ్రీ కంచి కామకోటి పీఠస్థ శ్రీ వెంకటేశ్వర స్వామి శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ధార్మిక కార్యక్రమాలు జరుగనున్నాయి. అలాగే పామర్రు మండలంలోని శ్రీ సోమేశ్వర స్వామి దేవస్థానంలో సాయంత్రం 5 గంటలకు భక్తి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మహాశివరాత్రి నాడు ఉపవాసం, జాగరణ, భగవన్నామ శ్రవణం ద్వారా ఆత్మశుద్ధి, ఆధ్యాత్మికోద్ధరణ లభిస్తాయని నిర్వాహకులు తెలిపారు. పూర్వం పల్లెల నుంచి పట్టణాల వరకు భక్తులు రాత్రంతా భజనలు, హరికథలు నిర్వహిస్తూ శివారాధన చేసేవారని, ఆ సంస్కృతిని పునరుద్ధరించే దిశగా ఈ కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విజయవాడ వేదికలో శ్రీ గుడిపాటి సుధాకర్ భాగవతులచే "భక్త మార్కండేయ" హరికథా కాలక్షేపం నిర్వహించ బడుతుంది. పామర్రులో శ్రీమతి లక్ష్మీలీలా భాగవతులచే "పార్వతీ కళ్యాణం" హరికథ కార్యక్రమం జరుగుతుంది. కార్యక్రమానికి సంబంధించిన బ్యానర్‌ను శనివారం సాయంత్రం ఆలయ ధర్మకర్త చిలుకూరు రామ్మోహన్ రావు, అర్చక స్వామి పవన్ కుమార్, హిందూ ధర్మప్రచార పరిషత్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ సివికే ప్రసాద్ ఆవిష్కరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి కార్యక్రమాలను వీక్షించి పరమశివ అనుగ్రహం పొందాలని నిర్వాహకులు కోరారు.

# ఘనంగా రవీంద్రభారతి పబ్లిక్ స్కూల్ కన్వొకేషన్ సంబరాలు







**కృష్ణలంక, ఫిబ్రవరి 14**

కృష్ణలంక, బాలాజీనగర్‌లోని రవీంద్రభారతి పబ్లిక్ స్కూల్లో చిన్నారుల కన్వొకేషన్ కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమక్షంలో వేడుకలు సంబరంగా సాగాయి. ఈ కార్యక్రమానికి రవీంద్రభారతి విద్యాసంస్థల ఛైర్మన్ వీరమాచనేని వంశీ కృష్ణ, వీరమాచనేని శాంతి, జోనల్ హెడ్ సరళాదేవి, సోషల్ హెచ్.ఒ.డి సాయి సుందరి, జాబిల్లి హెచ్.ఒ.డి కిరణమయ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి పాఠశాల ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు. చదువుతో పాటు నైపుణ్యాలు, విలువలు, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలకు కూడా ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. చిన్నారుల నృత్య ప్రదర్శనలు, నాటి-నేటి సమాజంలోని మార్పులపై చిన్నారులు చెప్పిన కథానికలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమాన్ని ఎంతో ఆనందంగా ఆస్వాదించిన తల్లిదండ్రులు పాఠశాల నిర్వహణను అభినందించారు. ఈ కన్వొకేషన్ వేడుక విద్యార్థుల జీవితంలో మధుర జ్ఞాపకంగా నిలిచిపోతుందని నిర్వాహకులు తెలిపారు.

# కేజీబీవీ పాఠశాల వసతి గృహాన్ని పూర్తిగా ప్రక్షాలన చేస్తున్నాం

- కేజీబీవీ వసతి గృహ ప్రత్యేక అధికారిణిని ప్రభుత్వానికి సరెండర్ చేశాం
- విద్య ఆరోగ్యం సంక్షేమం పట్ల అలసత్వం వహిస్తే వేటు తప్పదు
- హస్టల్ విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టిపెట్టండి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, ఫిబ్రవరి 14**

విద్యార్థుల విద్య, అరోగ్యం, సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నప్పటికీ కొందరి అధికారుల అలసత్వం, నిర్వహణలోపం కారణంగా దురదృష్టకర సంఘటనలు ఎదురవుతున్నాయని ఇటీవల ఎ. కొండూరు కేజీబీవీ పాఠశాల డార్మెటరిలలో ఎలుకల దాడి సంఘటనపై పూర్తి విచారణ జరిపి సంబంధిత అధికారిపై చర్యలు తీసుకుంటున్నామని భవిష్యత్లో ఇటీవంటి సమస్యలు పునరావృతం కాకుండా పటిష్టమైన ఏర్పాటు చేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. ఎ. కొండూరు మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని శనివారం జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తనిఖీ చేసి విద్యార్థులు, సిబ్బంది నుండి సంఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేజీబీవీ పాఠశాల డార్మెట్లలో 12 మంది విద్యార్థులు ఎలుకల దాడికి గురి కవాడం బాధాకరమన్నారు. సంఘటన జరిగిన వెంటనే స్పందించడం జరిగిందని ఇందుకు గల కారణాలపై పూర్తి విచారణ చేయడం జరిగిందన్నారు.. ఎలుకల వలన గాయపడిన విద్యార్థులకు యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్ వేయించడం జరిగిందన్నారు. పాఠశాల డార్మెటరీ వెనక బావి ఎలుకలకు నివాసంగా మారిందని రాత్రి సమయాలలో ఎలుకలు డార్మెటరీలో ప్రవేశించి విద్యార్థుల పై దాడి చేయడం జరిగిందని .. ఈ పరిస్థితిని నివారించడంలో గత జనవరి 31 వరకు ప్రత్యేక అధికారిణిగా పనిచేసిన ఎం.శ్యామల అలసత్వాన్ని గుర్తించి ఆమెను విధుల నుంచి తప్పించి, ప్రభుత్వానికి సరెండర్ చేసినట్లు తెలిపారు. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. పూడికపడిన డ్రైనేజి వ్యవస్థను సరిచేసేందుకు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఎలుక బోన్లులను ఏర్పాటు చేశామని ఎలుకలు లోపలకు ప్రవేశించకుండా మెష్ ఏర్పాటు చేయడంతో పాటు గోడను నిర్మించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయ పర్యవేక్షణ బాధ్యతలను స్థానిక ఎంపిడివోకు అప్పగించడం జరిగిందన్నారు. విద్యార్థుల విద్య, ఆరోగ్య, సంక్షేమం పట్ల అలసత్వం వహించే అధికారులు సిబ్బందిపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడేది లేదని జిల్లా కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా సంక్షేమ అధికారులు వసతి గృహ విద్యార్థుల ఆరోగ్యం పట్ల మరింత బాధ్యతతో వ్యవహరించాలన్నారు. హాస్టల్ సంక్షేమ అధికారి విద్యార్థుల భవిష్యత్ పట్ల ప్రత్యేక శ్రద్ధ కనపరచాలన్నారు. ముఖ్యంగా ఆరోగ్యం, క్రమశిక్షణకు ప్రాధాన్యతనిస్తూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులను ఎప్పటికప్పుడు చైతన్యంతులను చేసి పట్టుదలతో మంచి విద్యను అభ్యశించేందుకు కృషి చేయాలన్నారు. హస్టల్ నిర్వహణలో లోపాలను గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, కాచి చలార్చిన నీటిని వినియోగించాలన్నారు. హస్టల్స్ కు సరఫరా చేసే మినరల్ వాటర్ ప్లాంట్లను వాటర్ను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలన్నారు. వసతి గృహ నిర్వహణలో పచ్చదనం, పరిశుభ్రత, పారిశుధ్యానికి అత్యంత ప్రాదాన్యతనిచ్చి నిర్వహించినప్పుడు విద్యార్థులలో మానసిక ఉల్లాసం పెరిగి ఆరోగ్యంతో పాటు మెరుగైన విద్యను అభ్యశించేందుకు ఎంతో దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ప్రస్తుతం కేజీబీవీ ప్రిన్సిపల్ విజయసుందరిని అప్రమత్తంగా ఉండాలని ఆదేశించినట్లు వెల్లడించారు. పాఠశాల తనిఖీలో జిల్లా కలెక్టర్ వెంట ఎ కొండూరు తహాశీల్దార్ ఎన్ అరవింద్, ఎంఇవో కేశవరావు, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయ ప్రిన్సిపల్ ఎన్. విజయసుందరి సిబ్బంది ఉన్నారు.

# ప్రత్యేక రైలులో కాశ్మీర్ లోయ, వైష్ణో దేవి యాత్ర

- 33 శాతం రైల్వే రాయితీ, దక్షిణ భారత భోజనంతో..




**హైదరాబాద్, ఫిబ్రవరి 14** కాశ్మీర్ లోయ అందాల వీక్షణతో పాటు వైష్ణో దేవిపుణ్యక్షేత్రాన్ని దరి్శంచాలనుకునే భక్తులకు సౌత్ స్టార్‌రైల్ తీపి కబురు అందించింది. ఇండియన్ రైల్వేస్‘భారత్ గౌరవ్’ పథకంలో భాగంగా ఏప్రిల్ 11వ తేదీనుంచి ఈ ప్రత్యేక పర్యాటక రైళ్లు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా సౌత సెంట్రల్ రైల్వే విజయవాడ డివిజన్ పీఆర్ఓ నుస్రత్ ఎం మందరూప్కర్‌మాట్లాడుతూ ఈ ప్రత్యేక పర్యాటక రైలులో పెనుకొండ,ధర్మవరం, అనంతపురం, గుత్తి, దోనె, కర్నూల్,గద్వాల్, మహబూబ్‌నగర్, సికింద్రాబాద్ నుంచి ప్రయాణికులు ఎక్కడానికి వీలు కల్పిస్తున్నామని చెప్పారు.దక్షిణ భారత భోజనం, సెక్యూరిటీ, వసతి సౌకర్యాలతోకూడిన ఈ యాత్రలో కేంద్ర ప్రభుత్వం 33 శాతంరాయితీ కల్పిస్తోందన్నారు. ఈ యాత్రను ఇండియన్‌రైల్వేస్ భారత్ గౌరవ్ రైలు సౌత్ స్టార్ రైల్ ను టూరిజం మంత్రిత్వ శాఖ గుర్తింపు పొందిన ఆపరేటర్, దేశంలో అత్యుత్తమ రైలు టూరిజం ఆపరేటర్- టూర్ టైమ్స్ నిర్వహించనున్నారని తెలిపారు. ఈ ప్రత్యేక పర్యాటక

ఆగ్రా, మధుర, శ్రీనగర్, సోన్మార్గ్, గుల్మార్గ్, అమృత్‌సర్, ఢిల్లీలను సందర్శి ంచవచ్చున్నారు. పదమూ డు రోజుల ఈ యాత్రకు 2ఎస్‌ఎల్ రూ.42,400, 3ఏసీ రూ.54,000, 2ఏసీ రూ.61,000, 1ఏసీ రూ.68,200 అని తెలిపారు. వైష్ణో దేవి యాత్రలో ఆగ్రా, మధుర, హరిద్వార్, రిషికేష్, కురుక్షేత్ర, వైష్ణోదేవి, అమృత్‌సర్, ఢిల్లీలను సందర్శించవచ్చున్నారు. పదమూడు రోజుల ఈ యాత్రకు 2ఎస్‌ఎల్ రూ.36,800, 1ఏసీ రూ.65,700, 2ఏసీ రూ.54, 300, 3ఏసీ రూ.48,700 కలదన్నారు. ఈ సందర్భంగా సౌత్ స్టార్ రైల్ ప్రొడక్ట్ డైరెక్టర్ విఘ్నేష్ మాట్లాడుతూ ఇండియన్ రైల్వేస్ - భారత్ గౌరవ్ సౌత్ స్టార్ రైలును టూర్ టైమ్స్ నడుపుతుందన్నారు. ఇప్పటి వరకు ఈ పర్యాటక రైలు 2,97,130 కిలోమీటర్లు ప్రయాణించిందని చెప్పారు. 24,980 మంది ప్రయాణికులను భారతదేశంలోని వివిధ ప్రాంతాలకు,

రైలు సాధారణ రైలు వలే ఐఆర్సీటీసీ వెబ్సైట్లో బుకింగ్‌వివిధ గమ్యస్థానాలను సందర్శిం పజేసిందని
కోసం అందుబాటులో లేదన్నారు. రిజర్వేషన్లకు టూర్‌పేర్కొన్నారు. ఈ రైలులో ఆన్-బోర్డ్, ఆఫ్-బోర్డ్ లో
టైమ్ ను నేరుగా 93550 21516 నంబర్లోఅపరిమిత దక్షిణ భారత భోజనం అందించబడు
సంప్రదించడం ద్వారా లేదా ఆన్లైన్లో బుక్ చేసుకోవతుందని తెలిపారు. ఈ ప్యాకేజీలో వసతి, సందర్శన,
డానికి www.tourtimes.in సందర్శిం చడం ద్వారాబస్సు, ట్రావెల్ ఇన్సూరెన్స్, మూడు పుటలా భోజనం
మాత్రమే చేయవచ్చున్నారు. కాశ్మీర్ హాలిడే స్పెషల్లోపొందవచ్చున్నారు.



**గన్నవరం, ఫిబ్రవరి 14**

గన్నవరం క్రిస్టియన్‌పేటలోని బి.ఆర్. అంబేద్కర్ పేరుతో ఉన్న కళ్యాణ మండపంలో శనివారం విద్యార్థుల కోసం ప్రత్యేక సేవా కార్యక్రమం నిర్వహించారు. ఎం ఈ ఎఫ్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఉచిత ట్యూషన్ పాయింట్‌లో చదువుతున్న విద్యార్థులకు విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. గన్నవరానికి చెందిన దాత బేతపూడి వెంకటేశ్వరరావు సుమారు రూ.10,000 విలువైన స్టడీ మెటీరియల్స్ మరియు ఎగ్జామ్ కిట్‌లను అందజేశారు. 1వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులు ఈ సహాయాన్ని స్వీకరించారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఉచిత ట్యూషన్ సెంటర్‌కు దాతల సహకారం ఎంతో అవసరమని నిర్వాహకులు తెలిపారు. వెంకటేశ్వరరావు అందించిన సహాయం విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో దోహదపడుతుందని అభినందించారు. పరీక్షల సమయంలో ఎగ్జామ్ కిట్‌లు, స్టడీ మెటీరియల్స్ తమకు ఎంతో ఉపయోగపడతాయని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.ఈ.ఎఫ్ జిల్లా అధ్యక్షుడు దేవరపల్లి విక్టర్ బాబు, రిటైర్డ్ ఏఎస్ఐ కాటూరి వెంకటేశ్వరరావు, గన్నవరం నియోజకవర్గ అధ్యక్షుడు దేవరపల్లి ఏసుబాబు, నిడమర్తి నాగేశ్వరావు సౌజన్య దంపతులు, దేవరపల్లి రాబర్ట్ జాన్సన్, ఎం.ఈ.ఎఫ్ నాయకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పి.బి. సిద్ధార్థ 51 వ కళాశాల వార్షికోత్సవం



**విజయవాడ, ఫిబ్రవరి 14**

గూగుల్ వేదికగా సమస్త సమాచారం దిగుమతి అయినంత సులువుగా వ్యక్తిత్వం అబ్బదని, మానవ దృక్పథంలో, సాంకేతికతలో శరవేగంగా మార్పులు వస్తున్న నేపథ్యంలో నూతన పరిణామాలకు అనుగుణంగా విద్యార్థులు ఎదగాల్సి ఉందని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె. మధుమూర్తి అన్నారు. శనివారం సాయంత్రం విజయవాడ పి.బి. సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల 51వ కళాశాల వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ యువత అవకాశాలు అందుకుంటూనే సవాళ్లను అధిగమించాలన్నారు. సాంకేతికత ముసుగులో విద్యార్థులు మానవ సంబంధాలు, విలువలు కోల్పోకూడదన్నారు. గౌరవ అతిథి, శాస్త్రవేత్త, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (తిరుపతి) డీన్ ప్రొ.విజయమోహనన్ పిళ్ళై మాట్లాడుతూ సౌర విద్యుత్,అణుశక్తి, మానవ వనరుల్లో భారతదేశం అగ్రగామిగా పురోగమిస్తోందని, కార్బన్ నిరోధకత దిశగా, సూపర్ పవర్ గా భారత్ ముందడుగు వేస్తోందని, డ్రోన్ సాంకేతికత తదితర రంగాల్లో యువతకు అపార అవకాశాలు ఉన్నాయన్నారు. విద్యార్థులు ప్రశ్నించడం నేర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి, కృష్ణా వర్సిటీ రెక్టార్ ప్రొ.ఎం.బసవేశ్వరరావును సత్కరించారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు స్వర్ణపతకాలను బహుకరించి అభినందించారు. ప్రిన్సిపల్స్ డాక్టర్ మేకా రమేశ్, సిహెచ్. వెంకటేశ్వర్లు వార్షిక నివేదికలను సమర్పించారు. సిద్ధార్థ అకాడమి కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, కళాశాల కన్వీనర్ నిమ్మగడ్డ లలితప్రసాద్,, స్టూడెంట్ కౌన్సిల్ అధ్యక్షురాలు సిహెచ్. నిఖిల మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన దశావతారాలు, గరగలు తదితర నృత్యాంశాలు, వివిధ రాష్ట్రాల జానపద నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

# టీటీడీకి నెయ్యి సరఫరా ఆరోపణలు పచ్చి అబద్ధం

- చట్టపరమైన చర్యలకు వెనకాడబం
- హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ చీఫ్‌ఆపరేటింగ్ ఆఫీసర్ జే సాంబమూర్తి

**తిరుపతి, ఫిబ్రవరి 14**

తిరుమల తిరుపతి దేవస్థానానికి (టీటీడీ) నెయ్యి సరఫరా చేసినట్లు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, సాక్షి మీడియా చేస్తున్న ఆరోపణలు పచ్చి అబద్ధమని హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ జే సాంబమూర్తి తెలిపారు. ఇందాపూర్ డెయిరీతో తమకు ఎటువంటి సంస్థాగత సంబంధం లేదని, కేవలం కొన్ని పాల ఉత్పత్తుల కొనుగోలుకు మాత్రమే ఒప్పందం ఉందన్నారు. కంపెనీ ప్రతిష్టను దెబ్బతీస్తూ మా వ్యాపారానికి, రైతులకు, వినియోగదారులకు నష్టం కలిగిస్తున్న ప్రతి వ్యక్తి, సంస్థపై పరువు నష్టం దావా వేస్తామన్నారు. భక్తుల మనోభావాలతో ముడిపడి ఉన్న అంశంపై కావాలని రాజకీయ ప్రేరేపిత అబద్ధాలు ప్రచారం చేస్తున్న వారిపై పరువు నష్టం దావా వేస్తామని హెచ్చరించారు. ఈ నిరాధార, పరువు నష్టం కలిగించే ఆరోపణలను ఖండిస్తున్నామన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ సాక్షి మీడియా ద్వారా ఈ అసత్య కథనాలను ప్రచారం చేస్తోందని పేర్కొన్నారు. వీటిని కొందరు రాజకీయ నాయకులు, రాజకీయ ప్రేరేపిత సోషల్ మీడియా కార్యకర్తలు సర్క్యులేట్ చేస్తున్నారన్నారు. బీ కరుణాకర్ రెడ్డి, సాక్షి మీడియా గ్రూప్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన రాజకీయ నాయకులు, సోషల్ మీడియా కార్యకర్తలు ప్రచారం చేస్తున్న ఆరోపణలు ముమ్మాటికీ అబద్ధమన్నారు. 2014-2019 మధ్య కాలంలో హెరిటేజ్ ఫుడ్స్ టీటీడీకి నెయ్యి సరఫరా చేసిందని చెప్పడం పూర్తిగా పరువు నష్టం కలిగించేలా ఉందన్నారు. ఇది కేవలం రాజకీయ ప్రేరేపితమైన దన్నారు. టీటీడీకి ఎప్పుడైనా నెయ్యి సరఫరా చేసిన ఏ కంపెనీనైనా హెరిటేజ్ ఫుడ్స్‌తో ముడిపెట్టాలని ఈ అబద్ధాలకోరులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తోందన్నారు. టీటీడీకి సరఫరా చేసిన నెయ్యితో హెరిటేజ్ ఫుడ్స్‌కు ఎటువంటి సంబంధం లేదన్నారు.

గత 33 ఏళ్లుగా లక్షలాది మంది రైతులు, కోట్లాది మంది వినియోగదారులకు ఎంతో చిత్తశుద్ధితో సేవలందిస్తున్నామని తెలిపారు. సంస్థ ప్రతిష్టను దెబ్బతీయడానికి ఇటువంటి దురుద్దేశపూర్వక ఆరోపణలు చేస్తున్నారన్నారు. కోట్ల మంది భక్తుల మతపరమైన భావాలతో కూడిన అంశాలపై కావాలని తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తుంటే మౌనంగా ఉండబోమన్నారు. ఇందాపూర్ డెయిరీ అనేది హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ యూనిట్ కాదన్నారు. ఇందాపూర్ డెయిరీ మహారాష్ట్రలోని ఒక స్వతంత్ర ప్రైవేట్ డెయిరీ కంపెనీ అన్నారు. దీనికి ప్రపంచవ్యాప్తంగా సొంత కార్యకలాపాలు ఉన్నాయన్నారు. కేవలం పనీర్, చీజ్, ఎస్ఎంపీ, యుహెచ్‌టీ పాలను కొనుగోలు చేయడానికి మాత్రమే ఇందాపూర్ డెయిరీతో కాంట్రాక్ట్ మ్యానుఫ్యాక్చరింగ్ ఒప్పందాన్ని కలిగి ఉన్నామన్నారు. టీటీడీకి నెయ్యి తయారు చేయడానికి, సరఫరా చేయడానికి ఇందాపూర్ డెయిరీతో సహా ఏ ఇతర కంపెనీతోనూ హెరిటేజ్ ఫుడ్స్‌కు ఒప్పందం లేదన్నారు. హెరిటేజ్ ఫుడ్స్ కొన్ని పరిశ్రమ భాగస్వాములతో కాంట్రాక్ట్ మ్యానుఫ్యాక్చరింగ్ ఒప్పందాలను కలిగి ఉందన్నారు. అందులో ఇందాపూర్ డెయిరీ ఒకటన్నారు. దురుద్దేశంతో అబద్ధాలు ప్రచారం చేసేవారు.. టీటీడీకి నెయ్యి సరఫరా చేయడానికి హెరిటేజ్ ఫుడ్స్ సిండికేట్‌గా మరో ఐదు డెయిరీల పేర్లను జాబితా చేశారన్నారు. ఆ కంపెనీలతో హెరిటేజ్ ఫుడ్స్‌కు ఎలాంటి సంబంధం లేదన్నారు. ఏయే ఉత్పత్తుల కోసం ఏ కంపెనీలతో లావాదేవీలు జరుపుతామో మా వెబ్‌సైట్‌లో స్పష్టంగా ఉందన్నారు. అత్యంత సున్నితమైన మతపరమైన అంశంపై భక్తులను తప్పుదోవ పట్టించేలా, కావాలని తప్పుడు సంబంధాలను సృష్టించి చేస్తున్న ఈ ప్రయత్నం పరువు నష్టం కలిగించే చర్యగా పరిగణించబడుతుందని పేర్కొన్నారు.

# ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయం





- ఉచిత మెడికల్ క్యాంపు ప్రారంభోత్సవ సభలో జేసీ పులి శ్రీనివాసులు

**మార్కాపురం, ఫిబ్రవరి 14**

మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా సామాజిక సేవా దృక్పథంతో ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు ను నిర్వహించడం ప్రశంసనీయమని జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు అన్నారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం దోర్నాల పట్టణంలోని శ్రీశైలం రోడ్ లో భక్తుల సౌకర్యార్థం మెడికల్ క్యాంపు ను డిఎస్పీ డాక్టర్ యు నాగరాజు తో కలిసి జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసి శ్రీనివాసులు మాట్లాడుతూ మానవతా దృక్పథంతో లక్షల రూపాయలు విలువ చేసే మెడిసిన్స్ ను మూడు రోజుల పాటు నిరంతరం కాలినడక, వివిధ అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్న భక్తులకు ఉచితంగా అందజేయడం అభినందనీయమని ట్రస్ట్ సభ్యులు డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి సేవలను అభినందించారు. డిఎస్పీ డాక్టర్ యు. నాగరాజు మాట్లాడుతూ శైవ క్షేత్రమైన శ్రీశైలానికి ఈ పండుగ సందర్భంగా లక్షల సంఖ్యలో భక్తులు పెద్ద ఎత్తున రాక పోకలు సాగిస్తుంటారని, ఇలాంటి పరిస్థితుల్లో వారికి యుద్ధ ప్రాతిపదికపై మందులను అందజేసి, ఆరోగ్యాలను కాపాడడం గొప్ప విషయమని అన్నారు. అలాగే శ్రీశైలం వెళ్ళే భక్తులు తమ వాహనాలను ట్రాఫిక్ రూల్స్ కు అనుగుణంగా నడపాలని సూచించారు. ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోడీ స్ఫూర్తితో తమ ట్రస్ట్ సేవా కార్యక్రమాలను అనేక సంవత్సరాలుగా కొనసాగిస్తున్నామని, అందులో భాగంగా ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నామని అన్నారు. దాదాపుగా రూ 50 లక్షల విలువ చేసే మందులను ఈ సందర్భంగా రోగులకు అందిస్తున్నామని అన్నారు. లీ ఫార్మా కంపెనీ లిమిటెడ్ వారు స్వర్గీయ నాగిరెడ్డి జ్ఞాపకార్థం మందులను ఈ క్యాంపు కు అందించిన సహకారం మరువలేనిదని అన్నారు. వెనుక బడిన మార్కాపురం జిల్లాలో తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరంతరం సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని ఆయన అన్నారు. ఈ మెడికల్ క్యాంపు కార్యక్రమానికి హాజరైన జేసీ పులి శ్రీనివాసులు, డిఎస్పీ డాక్టర్ యు నాగరాజు లకు ట్రస్ట్ సభ్యులు డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి శాలువ కప్పి, స్వామి వారి మెమెంటో లను అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తంగిరాల అశోక్ రెడ్డి, పి ఏ సీసీ అధ్యక్షులు బట్టు సుధాకర్ రెడ్డి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు నరాల శ్రీనివాస రెడ్డి,పిచ్చయ్య, త్రిపురాంతకం మండల పార్టీ అధ్యక్షులు సముద్రాల మల్లికార్జున, కంభం మండలం పార్టీ అధ్యక్షులు బాదం కిషోర్, గిద్దలూరు పట్టణ పార్టీ అధ్యక్షులు అప్పిశెట్టి ఉదయ్ కుమార్, మహిళా నాయకురాలు మద్దెల లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి మహిళా పారిశ్రామికవేత్తగా ఎదగాలి

- తక్కువ పెట్టుబడితో సుస్థిర ఆదాయం పొందాలి
- ఔత్సాహిక మహిళా శక్తికి రైజ్ చేయూత
- ప్రతివారం ప్రత్యేక అవగాహన, నైపుణ్య వర్క్‌షాపులు
- పారిశ్రామిక యూనిట్ల స్థాపనకు సాంకేతిక--ఆర్థిక మార్గదర్శకత్వం
- మంచి ఆలోచనలతో ఆదాయం పొందే మార్గాలకు దిశానిర్దేశం
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ




**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 14** మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే స్వయంఉపాధి, సూక్ష్మ, చిన్న పారిశ్రామిక రంగాల్లో ముందుకుతీసుకువెళ్లే లక్ష్యంతో జిల్లా అధికార యంత్రాంగం,విజయవాడ కూలెక్స్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌భాగస్వామ్యంతో నిర్వహించిన ప్రత్యేక అవగాహన,నైపుణ్య వర్క్‌షాప్ విజయవంతంగా నిర్వహించామనిఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ఇలాంటికార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని ప్రతి మహిళాపారిశ్రామికవేత్తగా ఎదగాలని అన్నారు. మహిళామణులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు జిల్లాపరిశ్ర మలు, డీఆర్‌డీఏ తదితర శాఖలతో పాటుకూలెక్స్ ఇండస్ట్రీస్ భాగస్వామ్యంతో శనివారం ఇబ్రహీంపట్నం మండలం, గుంటుపల్లిలోని రూరల్‌ఇంక్యుబేషన్, స్కిల్లింగ్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్‌సెంటర్ (రైజ్)లో ప్రత్యేక జాగృతి వర్క్‌షాప్ జరిగింది. ఈ సందర్భంగా శీతలీకరణ, కిచెన్ అండ్ ఫుడ్ ఎక్విప్‌మెంట్ తయారీలో సుదీర్ఘ అనుభవం కలిగినకూలెక్స్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమానులుసూక్ష్మ, చిన్న ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుతోపాటు విలువ ఆధారిత ఉత్పత్తులు, చిన్నస్థాయి వ్యాపార అభివృద్ధికి ప్రయోజనం కల్పించేలా శిక్షణ అందించారు. ఫ్రయర్స్, పిజ్జా ఓవెన్స్, శాండ్‌విచ్‌గ్రిల్స్, వాఫెల్ మెషీన్స్, ఎలక్ట్రికల్ గ్రైడర్స్ తదితరాలపై లైవ్ డెమో ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఆహార ఉత్పత్తుల వ్యాపారం చాలా లాభదాయ కమని.. అయితే ఉత్పత్తులను అత్యంత పరిశుభ్రతతో నాణ్యతతో అందించినప్పుడే వినియోగదారుల ఆదరణ ఉంటుందన్నారు. అందుకే ఇలాంటి అధునాతన, వినూత్న మెషీన్లు ఉపయోగించడం ద్వారా దీర్ఘకాలం పాటు వ్యాపారాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్లొచ్చన్నారు. ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త కలను సాకారం చేసేందుకు ప్రతివారం రైజ్ కేంద్రంలో ప్రత్యేక వర్క్‌షాపులు నిర్వహిస్తున్నామని.. మహిళలు వీటిని సద్వినియోగం చేసుకొని స్వయంగా ఉపాధి అవకాశాలు సృష్టించుకొని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు.

### రైజ్.. హెల్పింగ్ హ్యాండ్...


మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధిస్తే కుటుంబం, గ్రామం, జిల్లా, రాష్ట్రం, దేశం సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. మహిళలు తమ ప్రతిభ, ఆలోచనలను కార్యరూపం దాల్చేందుకు రైజ్ వంటి వేదికలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ రైజ్ కేంద్రంలో వరుసగా ఇది నాలుగో వర్క్‌షాప్ అని.. ఇలాంటి మరిన్ని వర్క్‌షాప్‌లు నిరంతరం జరుగుతూనే ఉంటాయన్నారు. లిపాఠాలు నేర్చుకోవాలంటే బడికి వెళ్లాలి.. దేవుని దర్శనం కోసం ఆలయానికి వెళ్లాలి.. పారిశ్రామికవేత్తగా ఎదగాలంటే రైజ్ కేంద్రానికి వెళ్లాలంటూ మహిళామణుల్లో స్ఫూర్తి నింపారు. మంచి ఆలోచనలు ఆదాయ మార్గాలుగా మారేలా రైజ్ చేయిపట్టి నడిపిస్తుందని, ఆర్థిక సాధికారతను సొంతం చేస్తుందని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు.

### పథకాలను సద్వినియోగం చేసుకోవాలి...

మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అందిస్తున్న పీఎంఈజీపీ వంటి పథకాలతో పాటు వివిధ రుణ సదుపాయాలు, సబ్సిడీలు, శిక్షణా కార్యక్రమాలు, మార్కెటింగ్ మద్దతు పథకాలపై జిల్లా పారిశ్రామిక అధికారి వివరించారు. బ్యాంకు రుణాల ప్రక్రియ, డాక్యుమెంటేషన్, స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థిక మద్దతు పొందే విధానం వంటి అంశాలపై స్పష్టత ఇచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు యూనిట్ స్థాపనలో ఎదురయ్యే సమస్యలు, వినూత్న పరికరాల వినియోగం, నిర్వహణ, ముడి సరుకు అందుబాటు, మార్కెటింగ్ సవాళ్లు వంటి అంశాలపై నిపుణులతో చర్చించారు. ప్రత్యక్షంగా తమ సందేహాలకు సమాధానాలు పొందడంతో మహిళల్లో ఆత్మవిశ్వాసం పెరిగింది. కొంతమంది మహిళలు త్వరలోనే ఆహార ఉత్పత్తుల తయారీ యూనిట్లు ప్రారంభించేందుకు ఆసక్తి వ్యక్తం చేయడం, రిజిస్ట్రేషన్ చేయించుకోవడం ఈ వర్క్‌షాప్ విజయానికి నిదర్శనంగా నిలిచింది.

కార్యక్రమంలో ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న, విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, కూలెక్స్ ఇండస్ట్రీస్ యాజమానులు పాలకుర్తి రాధాకృష్ణ, భ్రమరాంబ, సందేశ్, జిల్లా పరిశ్రమల అధికారి ఎం.మధు, డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, ఇబ్రహీంపట్నం బ్లాక్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, మహిళా సమాఖ్యల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో స్వయం సహాయక సంఘాల, ఔత్సాహిక మహిళలు హాజరయ్యారు.

# సంపాదకీయం



## అమెరికా ఆధిపత్య వ్యూహాలకు లొంగుబాటు

**అమెరికా పాత్ర ప్రత్యేకించి అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పాత్ర అంతకంతకూ ఒక "బుల్డోజర్" తరహాలోకి మారిపోతున్నది. బుల్డోజర్లను ఏకపక్షంగా ప్రయోగించి బలహీనులూ, ఏ రక్షణ లేని వారి హక్కులను ఎలా కాలరాస్తారో భారతదేశం లోని మనకు ఇప్పుడు బాగా తెలుసు. మెజారిటీతో విర్రవీగే వాతావరణంలో ఈ విధంగా నగంగా దురాక్రమణకు పాల్పడటం సోషల్ మీడియా వరణంలోని భక్తగణాల నుంచి భారీ ప్రశంసలు తీసుకు వస్తుంది. అయితే అంతర్జాతీయ రంగంలో అదే విధమైన ధోరణి వల్ల రాజకీయంగా తీవ్ర నష్టం, వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి కోల్పోవడం మాత్రమే జరుగుతుంది. ఇది దేశ సార్వభౌమత్వానికి హానికరమైంది.**

బయటి ప్రపంచంతో భారత దేశ సంబంధాల నిర్వహణలో గత కొంత కాలంగా జరుగుతున్నది కచ్చితంగా ఇదే. పహల్గాం దాడి, పాకిస్తాన్‌పై తదనంతర సైనిక ఘర్షణ నాటి నుంచి ఇది మరింత ప్రస్ఫుటంగా కనిపిస్తున్నది. భారత, పాకిస్తాన్‌లుగా తాము లోతుగా పరిశీలించిన తర్వాతనే ఈ విరమణ జరిగిందన్న భారతదేశ ప్రకటనకు అధ్యక్షుడు ట్రంప్ ఏకపక్షంగా చేసిన ప్రకటన పూర్తి విరుద్ధంగా తయారైంది. ఏమైనా ఇరు దేశాలు అధికారికంగా ఫలితం ప్రకటించే లోపుగానే ట్రంప్ హడావుడిగా చేసిన ప్రకటనతో ద్వైపాక్షిక సమస్యల్లో తృతీయ దేశాల జోక్యానికి చోటు ఇవ్వబోమన్న మన పవిత్రమైన వచనాలను పచ్చిగా వమ్ము చేసినట్టయింది. అయితే భారత పాలనా వ్యవస్థ ఇప్పటికీ అదే మాట అంటున్నది.ఇప్పటికి కొంత కాలంగా భారత విదేశాంగ విధానం అమెరికా గొంతెమ్మ కోర్కెలకు బందీ అయిపోయిందని స్పష్టమవుతూ వస్తోంది. మోడీ సర్కారులో అది మరింత బాహాటంగా నడుస్తున్నది. వ్యవసాయం, నియంత్రణలు, డిజిటల్ విధానం, భద్రతా పొత్తులపై భారత అమెరికా వాణిజ్య ఒప్పందం ఇందుకు గట్టి సాక్ష్యం. అమెరికా విడుదల చేసిన అధికారిక ప్రకటన దీన్ని మరింతగా నిరూపించింది. 'రష్యన్ ఫెడరేషన్ నుంచి అమెరికాకు ఎదురవుతున్న ముప్పును తట్టుకోవడం కోసం సుంకాలను సవరిస్తూ అధ్యక్షుడు చేపడుతున్న చర్యలపై అధికారిక ఉత్తర్వులు' అనే పేరుతో 2026 ఫిబ్రవరి ఆరున అది విడుదలైంది.భారత అమెరికా వాణిజ్య ఒప్పందం పరిధిని అధికారికంగా అమెరికా భారత ప్రభుత్వాలు 2026 ఫిబ్రవరి 7న తెల్లవారుఝామున విడుదల చేశాయి. అంతర్జాతీయ రంగంలో భారత దేశం ఎదుర్కొంటున్న మధ్యకాలిక, తక్షణ నేపథ్యాలు ఈ పత్రాలకూ సంబంధం లేదన్న భ్రమ కలగడానికి ఇది కారణం కావచ్చు. తన వాణిజ్య వ్యవసాయ రంగాల కోసం అనుసరిస్తున్న విధానాల కారణంగా ఇటీవలి కాలంలో అంతర్జాతీయ చర్చలలో భారత దేశం టారిఫ్ రాజుగా చిత్రించబడింది. అయితే టారిఫ్‌లతో సహా అంతర్జాతీయ వ్యవసాయ రక్షణ విధానాలను మొత్తంగా పరిగణించేట్టయితే అత్యధికమైన అభేద్యమైన టారిఫ్ సబ్సిడీ గోడలు కట్టింది. అన్యాయమైన టారిఫ్ యేతర అడ్డంకులు సృష్టించిందీ అత్యధికంగా ధనిక దేశాలే. జాతీయ ఉత్పత్తిలో వ్యవసాయం వాటా గణనీయంగా తగ్గిపోతున్నది. అదే సమయంలో వ్యవసాయంపై ఆధారపడిన జనాభా శాతం చెప్పుకోదగినంతగా ఏమీ తగ్గడం లేదు. ఇలాంటి సమయంలో ఏ అంతర్జాతీయ ఒప్పందాన్నయినా కేవలం షరతులలో ఒక అంశంగా చూడకూడదు. కోట్లాది మంది చిన్న మధ్యతరహా రైతుల జీవనోపాధి సమస్యగా దాన్ని చూడవలసి వుంటుంది. వారు చిరు ఉత్పత్తిలో పాల్గొంటుంటారు. అయితే సబ్సిడీలు, ఆహార భద్రత అనివార్య అవసరాల కోసం భారతీయ రైతులను కాపాడేందుకు తీసుకునే ఎలాంటి చిన్న చర్యనైనా సరే వాణిజ్యపరంగా చిత్రించడం, టారిఫ్ టారిఫేతర అడ్డంకిగా ప్రతికూల ముద్ర వేయడం జరుగుతున్నది.కాని వాస్తవం పూర్తిగా భిన్నంగా వుంది. సగటున 39 శాతం వున్న భారతదేశ వ్యవసాయ టారిఫ్‌లనే అత్యధికమైనవిగా, దారుణంగా చిత్రించేట్టయితే అప్పుడు సంపన్న దేశాలు నిస్సందేహంగా రక్షణ విధానాలలో మరింత పెద్ద మొనగాళ్లుగా చెప్పాల్సి వుంటుంది. తృణధాన్యాలు, పాడి ఉత్పత్తులపై అమెరికా ఏకంగా 188 శాతం పైన టారిఫ్‌లు విధిస్తుంది. భారత్‌కు వ్యతిరేకంగా అమెరికా సృష్టించిన ఇలాంటి టారిఫ్ టెర్రర్‌పై దుష్ప్రచారానికి తోడు దానికి 4500 కోట్ల డాలర్ల వాణిజ్య మిగులు కలిగివుందనే ఫిర్యాదు లేవనెత్తింది. ఆ పేరుతో భరించలేని స్థాయిలో 25 శాతం టారిఫ్‌లను విధించింది. రష్యా నుంచి చమురు సహజ వాయువు తీసుకుంటున్నందుకు వేసిన శిక్ష అంటూ తర్వాత మరో 25 శాతం అదనపు టారిఫ్ విధించి 50 శాతానికి చేర్చింది. ఇక్కడ వాస్తవాలు స్పష్టంగానే వున్నాయి. అమెరికా సరుకులపై భారత దేశం విధించే టారిఫ్ 0 నుంచి 3 శాతం వుంటే భారతీయ సరుకులపై అమెరికా విధించే టారిఫ్ గతంలో ప్రతిపాదించిన 50 శాతం గాక 18 శాతానికి పెంచబడింది. ట్రీ నట్స్ (జీడిపప్పు, బాదంపప్పు తదితరాలు), పశుగ్రాసం, ఎర్రజొన్నలు, తాజా-ప్రాసెస్ చేసిన పండ్ల వంటి వాటిపై భారత అమెరికా ఒప్పందం ఆ దేశ ఉత్పత్తులకు కొత్త మార్కెట్ సమకూర్చి పెడుతుందనేది తెలుస్తూనే వుంది. అమెరికా వ్యవసాయ మంత్రి బ్రూక్ రోలిన్స్ ట్రంప్‌నకు ధన్యవాదాలతో మాట్లాడిన దానిలో ఇదే నొక్కి చెప్పారు. "మరోసారి మన అమెరికా రైతులకు మేలు చేసినందుకు కృతజ్ఞతలు. దీంతో మనం భారత దేశపు విస్తార మార్కెట్లకు మరిన్ని వ్యవసాయ ఉత్పత్తులు ఎగుమతి చేయవచ్చు. వాటి రేట్లు పెరగడం, గ్రామీణ ప్రాంతాల్లోకి నగదు ప్రవహించడం జరుగుతుంది. 2024లో ఇండియాతో అమెరికా వ్యవసాయ వాణిజ్య లోటు 1300 కోట్ల డాలర్లుంది. పెరిగే ఇండియా జనాభా అమెరికా వ్యవసాయ ఉత్పత్తులకు ముఖ్యమైన మార్కెట్‌గా వుంటుంది. పైన చెప్పిన వాణిజ్య లోటును తగ్గించేందుకు కూడా ఈ ఒప్పందం ఎంతగానో ఉపయోగపడుతుంది. వ్యవసాయంపై కుదుర్చుకునే డజన్ల కొద్ది ఒప్పందాలలో అగ్రభాగాన అమెరికా సాధించిన తొలి విజయం ఇది." అంటూ కృతజ్ఞతలు తెలిపారు. అలా జరగలేదు సరికదా అమెరికా చెప్పుకున్న గొప్పలన్నీ వాణిజ్య ఒప్పందం రూపురేఖలపై వెలువడిన అధికారిక ప్రకటనలోనూ, అధికారిక ఉత్తర్వుల ప్రకటనలోనూ అవే పొందుపర్చబడ్డాయి.ఈ ఒప్పందంలో పేర్కొన్న అంశాలుగాక వచ్చే ఐదేళ్లలో 50,000 కోట్ల డాలర్ల విలువైన చమురు, ఇతర ఉత్పత్తులు అమెరికా నుంచి దిగుమతి చేసుకోవడానికి భారతదేశం హామీనిచ్చింది. ఇది కచ్చితంగా మన స్వతంత్ర ప్రతిపత్తికి భంగం కలిగించే తిరుగులేని సాక్ష్యం. రష్యా నుంచి చవకగా కొనుగోలు చేస్తున్న చమురు సరఫరాలను విచ్ఛిన్నం చేసేందుకు అమెరికా పావులు కదుపుతున్నా కూడా మోడీ ఆ దేశం నుంచి మరింత అధిక రేటుతో చమురు తీసుకోవడానికి సమ్మతి తెలిపారు. వెనిజులా నుంచి కూడా మోడీ చమురు కొనుగోలు చేస్తారని ట్రంప్ ఆశిస్తున్నారు. అమెరికా నుంచి కొనుగోలుకు హామీ ఇచ్చిన వాటిలో వైమానిక ఉత్పత్తులు, రక్షణ ఉత్పత్తులు కూడా వున్నాయి. అమెరికా నుంచి 10,000 కోట్ల డాలర్ల దిగుమతులు చేసుకోవడం వల్ల ఇప్పుడు 4500 కోట్ల మిగులుతో వున్న భారతదేశ వాణిజ్యం ఒక్క దెబ్బతో వెనక్కుపోతుంది.



## మాజీ మంత్రి జోగి రమేష్‌ను పరామర్శించిన వైసీపీ యువజన నేత బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి

### దాడులపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలని డిమాండ్.(

వైసీపీ యువజన నేత బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి శనివారం ఇబ్రహీంప ట్నంలో మాజీ మంత్రి జోగి రమేష్ ను కలిసి పరామర్శించారు. ఇటీవల జరిగిన దాడిలో దెబ్బతిన్న ఆయన నివాసాన్ని పరిశీలించి, ఘటనకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నా రు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాజకీయంగా దృష ్టి మళ్లించే చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. అసెంబ్లీ, మండలిలో కుటుంబ స భ్యులపై వ్యాఖ్యల విషయమై ఒకే విధమైన ప్రమాణాలు పాటించాలన్నారు. కొన్ని వ్యాఖ్యలపై చర్యలు తీసుకుంటామని చెప్పిన నాయకత్వం, ఇతర సందర్భాల్లో ఎం దుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. తిరుమల లడ్డూ అంశంపై వెలువడిన నివేదిక ప్రజల్లోకి వెళ్లకుండా ఉండాలనే ఉద్దేశంతోనే జోగి రమేష్, అంబటి రా ంబాబు నివాసాలపై దాడులు జరిగాయని ఆయన ఆరోపించారు. ఎన్నికల హామీల అమ లుపై ప్రజల్లో చర్చ జరగకుండా చేయడానికే డైవర్షన్ రాజకీయాలు చేసు ్తున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్, ఎ ైఎస్సార్సీపీ యువజన నేతలు, నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరై బైరెడ్డి సిద్ధార్థ రెడ్డికి స్వాగతం పలికారు.

## దామోదరం సంజీవయ్యగారి సేవలు చిరస్మరణీయం

### ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, ఫిబ్రవరి 14**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రెండో ముఖ్యమంత్రిగా దామోదరం సంజీవయ్య గారు రాష్ట్రానికి చేసిన సేవలు ఆదర్శనీయమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతిని పురస్కరించుకుని శనివారం జిల్లా సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ లక్ష్మీశ.. డీఆర్వో ఎం. లక్ష్మీనరసింహం, అధికారులతో కలిసి దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దామోదరం సంజీవయ్య గారి నిరాడంబరత, నిజాయితీ, కార్య దక్షత నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి రమాదేవి, కలెక్టరేట్ వివిధ సెక్షన్ల అధికారులు, సహాయ సాంఘిక సంక్షేమ అధికారులు, వసతి గృహ సంక్షేమ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## యానమదల వెంకయ్యారావు కుటుంబానికి రూ.7.5 లక్షల సీఎం సహాయనిధి చెక్కు అందజేత

### గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు భరోసా



**మల్లవల్లి, ఫిబ్రవరి 14**

గన్నవరం నియోజకవర్గానికి చెందిన పార్టీ కార్యకర్త యానమదల వెంకయ్యారావు మరణం పార్టీకి, మల్లవల్లి గ్రామానికి తీరని లోటని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ బలోపేతం కోసం చివరి శ్వాస వరకు అంకితభావంతో పనిచేసిన వెంకయ్యారావు గత 30 ఏళ్లుగా స్వప్రయోజనాలు ఆశించకుండా గ్రామ అభివృద్ధికి కృషి చేశారని ఎమ్మెల్యే తెలిపారు. అనారోగ్య కారణాలతో ఆయన మృతి చెందడం బాధాకరమన్నారు. వెంకయ్యారావు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటోందని పేర్కొంటూ, ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ. 7.5 లక్షల చెక్కును విజయవాడలోని తన కార్యాలయంలో ఆయన తనయుడు యానమదల గీతారామ్‌కు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా గీతారామ్ మాట్లాడుతూ, తన తండ్రి మూడు దశాబ్దాలుగా తెలుగుదేశం పార్టీ కోసం అహర్నిశలు శ్రమించారని గుర్తు చేశారు. క్యాన్సర్‌తో బాధపడుతూ తుదిశ్వాస విడిచారని తెలిపారు. తమ కుటుంబానికి కష్టకాలంలో ఎమ్మెల్యే యార్లగడ్డ అండగా నిలిచి, ఇప్పుడు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేసి భరోసా కల్పించారని కృతజ్ఞతలు తెలిపారు.

## "సహస్ర దీపాలంకరణ"లో తిరుమలగిరిరాయునకు శోభా రాజు సంకీర్తనా సేవ

**తిరుమల, ఫిబ్రవరి 14**



"సహస్ర దీపాలంకరణ" సేవా కార్యక్రమంలో పద్మశ్రీ డాక్టర్ శోభా రాజు గారు వారి శిష్యులతో కలిసి తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి సంకీర్తనా కైంకర్యం చేశారు. తొలుతగా "అన్నమ గాయత్రి" మంత్రంతో ప్రారంభి "సర్వం విష్ణు మయంబను" "తిరుమలగిరి రాయా" రెండు అన్నమయ్య కీర్తనలను వారి శిష్యులు వాసంతి, సాయి గాయిత్రి తేజస్విని కలిసి ఆలపించారు. కార్యక్రమానికి వాయిద్య సహకారం కీబోర్డ్ కళ్యాణ్, తబలా మంజూ అందించారు. అనంతరం ఆలయ వెద పండితుల ఆశిర్వచనంతో డాక్టర్ శోభారాజు గారికి స్వామి వారికి ఇచ్చిన హారతి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# జర్నలిస్టు సంక్షేమ పథకాలను తక్షణమే పునర్దించండి

- ఏ.పి.ఎం.పి.ఏ.రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ యాదవ్





**విజయవాడ, ఫిబ్రవరి 14** (జర్నలిస్టు సంక్షేమ పథకాలను తక్షణమే పునర్దించవలసిందిగా ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వీర ్ల శ్రీరామ్ యాదవ్ డిమాండ్‌చేశారు.సీనియర్ జర్నలిస్టులు యేమినేని వెంకటరమణ,కలిమి శ్రీ లను స్థానికంగా జరిగిన ఒక కార్యక్రమంలోపాత్రికేయ మిత్ర ులు ఘనంగా సత్కరించారు. ఎన్.టి.ఆర్.జిల్లా మీడియా ఆక్రిడిషన్ కమిటీ సభ్యులుగానియమితులైన యేమినేని వెంకటరమణ,కలిమిశ్రీ లుసీనియర్ జర్నలిస్ట్ లే కాక జర్నలిస్టుల సమస్యలపై,పత్రికల నిర్వహణ పై పూర్తిగా అవగాహన వ్యక్తులనివీర్ల శ్రీరామ్ యాదవ్ పేర్కొన్నారు.వీరు ఇరువురుఎన్టీఆర్ జిల్లాలో జరుగుత ున్న సాంస్కృతిక,సామాజిక,చైతన్య కార్యక్రమాలలో చురుకైన పాత్ర వహిస్తున్నారనిఅన్నారు.వీరిని మీడియా ఆక్రిడిటిషన్ సభ్యులుగా ఎంపిక చేసిన జర్నలిస్ట్ సంఘాలకు, ప్రభుత్వానికి పాత్రికేయ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రం లోనే ఎన్టీఆర్ జిల్లాలో పారదర్శకంగా, ఎక్కువగా వర్కింగ్ జర్నలిస్ట్ లకు అక్రెడిటే షన్ మంజూరు లో కియాశీలకంగా పని చేసిన అధికారులకు,ఇతర సంఘ సభ్యులకు వారు ధన్యవాదాలు తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమ, సమాజ హితం కోరే యేమినేని, కలిమిశ్రీలు సమాచార అధికారులు, ఇతర కమిటీ సభ్యుల తోడ్పాటు తో మిగిలిన అందరు వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడేషన్ మంజూరు ప్రక్రియ పూర్తి చేయటంలో క్రియాశీలకంగా వ్యవహరించాలని ఆంధ్రప్రదేశ్ ఎంపానల్డ్ అసోసియ ేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వల్లూరి ప్రసాద్ కోరారు. ఈ కార్యక్రమంలో ఏ.పీ. ఎం.పీ.ఏ. రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇస్కా రాజేష్ బాబు, రాష్ట్ర కార్యదర్శి పసుపులేటి చైతన్య, ఆంధ్ర ప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ నగర్ అధ్యక్షులు తాళ్లూరి అనిల్ కుమార్,నగర ప్రధాన కార్యదర్శి గుర్రం శ్రీనివాస్, నాయకులు రాజా, ప్రశాంత్,సురేష్, ఎన్.ఎస్.ఆర్.తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రారంభమైన ఆల్ ఇండియా ఇంటర్-యూనివర్సిటీ నెట్‌బాల్ పోటీలు






**విజయవాడ స్పోర్ట్స్, ఫిబ్రవరి 14 )**

కృష్ణా యూనివర్సిటీ ఆధ్వర్యంలో మారిస్ స్టెల్లా కళాశాల వేదికగా ఆల్ ఇండియా ఇంటర్-యూనివర్సిటీ మహిళల నెట్‌బాల్ పోటీలు శనివారం ఘనంగా ప్రారంభం అయ్యాయి . ఫిబ్రవరి 14 నుండి 18 వరకు జరిగే ఈ పోటీలు నాక్-అవుట్ కమ్ లీగ్ విధానంలో నిర్వహించబడుతున్నాయి. నెట్ బాల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా పర్యవేక్షణలో దాని నియమావళి ప్రకారం పోటీలు జరుగుతున్నాయి ప్రారంభో త్సవ కార్యక్రమానికి కృష్ణా యూనివర్సిటీ వైస్-చాన్సలర్ మరియు టోర్నమెంట్ చైర్మన్ ప్రొఫెసర్ కె. రాంజీ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రవాణా, క్రీడలు మరియు యువజన సేవల మంత్రి యమ్. రాంప్రసాద్ రెడ్డి హాజరై పోటీలను ప్రారంభించారు . విజయవాడ ఈస్ట్ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోటీలను అధికారికంగా ప్రారంభించారు. దేశవ్యాప్తంగా వచ్చిన 55 జట్ల మార్చ్ పాస్ట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మారిస్ స్టెల్లా కళాశాల విద్యార్థులు త్రివర్ణ పతాకంతో ముందంజలో నడిచారు. గన్నవరం సెంట్ జాన్స్ స్కూల్ విద్యార్థుల బ్యాండ్ ప్రదర్శన వేడుకకు శోభను చేకూర్చింది. అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ జెండాను మంత్రి రామ్ ప్రసాద్ రెడ్డి ఆవిష్కరించగా, కృష్ణా యూనివర్సిటీకి చెందిన మౌనిక క్రీడాకారిణి ప్రమాణ స్వీకారం చేయించిన అనంతరం ముఖ్య అతిథి రామ్ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ, "నెట్‌బాల్ కేవలం ఆట మాత్రమే కాదు -- అది శక్తి, ఆత్మవిశ్వాసం, స్నేహబంధం పెంచుకోవటానికి దోహదపడుతుందాన్నారు. ఆటగాళ్లు తమ ప్రతిభతో, క్రీడాస్ఫూర్తితో మనందరికీ ప్రేరణనిస్తారు" అని అన్నారు. అనంతరం కృష్ణా యూనివర్సిటీ వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ రాంజీ మాట్లాడుతూ, కృష్ణా యూనివర్సిటీ క్రీడల అభివృద్ధికి కట్టుబడి ఉన్నదని తెలిపారు. స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా అందించిన 200 టీ-షర్ట్ కు, అలాగే



పాపులర్ షూ మార్ట్ సీఈఓ చుక్కపల్లి అరుణ్ కుమార్ అందించిన ?10,000 చెక్కుకు కృతజ్ఞతలు తెలిపారు.దేశవ్యాప్తంగా మహిళా క్రీడాకారిణుల ప్రతిభ, క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తిని ప్రతిబింబిస్తున్న ఈ టోర్నమెంట్ మహిళా సాధికారతకు, జాతీయ ఏకత్వానికి ప్రతీకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ 10వ డివిజన్ కార్పొరేటర్ డి. అపర్ణ, మారిస్ స్టెల్లా కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ డాక్టర్ ఇన్నాసమ్మ, కృష్ణా యూనివర్సిటీ ఇంచార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్. ఉష, ఇంచార్జి రెక్టార్ ప్రొఫెసర్ మందవ బసవేశ్వరరావు, రాజస్థాన్ కు చెందిన మాధవ యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ స్పోర్ట్స్ డాక్టర్ విష్ణు చౌధరి (అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ ప్రతినిధి), చీఫ్ రిఫరీ శ్రీ ఆకాష్ బాత్రా తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం జట్ల మేనేజర్లు, కోచ్‌లు, ఆటగాళ్లు అతిథులకు పరిచయం చేయబడ్డారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ నవీనా లావణ్య లత, కన్వీనర్లు సునీత, డాక్టర్ గోపీ, జ్యోతి, రాజ్‌కుమార్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# దేశ సంస్కృతికి దూరం కావడమంటే దేశంపట్ల భక్తిలేక పోవడమే

- డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, తితిదే
- ఘనంగా ముగిసిన తి. తి. దే.ధార్మిక కార్యక్రమాలు





**కర్నూలు, ఫిబ్రవరి**

ఈ దేశానికి ఘణకీర్తికి కారణం భారతీయ సంస్కృతేనని, అటువంటి శ్రేష్ఠమైన భారతీయ సంస్కృతికి దూరం కావడమంటే దేశంపట్ల భక్తి లేకపోవడమేనని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో గత ఐదు రోజులుగా పగిడ్యాల మండలం, యం. ఘణపురం గ్రామంలో వెలసిన శివాలయం నందు జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల ముగింపు సందర్భంగా ముక్కోటి దేవతా స్వరూపమైన గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు భారతీయ సంస్కృతి ఔన్నత్యాన్ని గురించి వివరించారు. శివాలయం అర్చకు లు జె. శివరామకృష్ణయ్య మరియు శ్రీరామాలయం అర్చకులు జె. యం. మల్లిఖార్జున స్వామి భక్తాదులం దరితో గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలను వేదక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మ ప్రచార మండలి సభ్యులు అంబటి శివశంకర రెడ్డి, సర్పంచ్ పి.ప్రతాప్ రెడ్డి, బి.ప్రభాకర్ రెడ్డి, బి. విజయభాస్కర్ రెడ్డి, కె.ఎల్లయ్య, జి.చంద్రన్న, కె.వెం కటేశ్వర్లు, జి శివన్న, కె.నాగ మల్లయ్య, బి రాంభూపాల్ రెడ్డి, కె.మల్లయ్య కె చిన్న వెంకటేశ్వర్లు, జి వెంకట స్వామి, సి.వి రాంరెడ్డి, కే శ్రీనివాసులు తదితం ులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తాదుల ందరికీ ఆలయ కమిటీ తీర్థ ప్రసాదాలు అందించారు.

# పరిశోధన రచనలో శాస్త్రీయత కీలకం

**విజయవాడ పశ్చిమ, ఫిబ్రవరి 14**




నాణ్యత కలిగిన పరిశోధన పత్రాల రచనలో శాస్త్రీయ దృక్పథం కీలకమని ప్రిన్సాస్సర్ యూనివర్సిటీ (దక్షిణ అమెరికా, పెరూదేశం) వైస్ చాన్సలర్ కొప్పుల విక్టర్ బాబు అన్నారు. కె.బి.ఎన్. కళాశాల ఐ.క్యు.ఎ.సి విభాగం, ఎస్.ఆర్.ఎస్.వి కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం కె.బి.ఎన్ కళాశాల అధ్యాపకుల శిక్షణా కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న విక్టర్ బాబు మాట్లాడుతూ ఉత్తమ పరిశోధన పత్ర రచనకు స్పష్టత, క్రమబద్ధత, తార్కికత అవసరమన్నారు. ప్రచురణ ప్రక్రియలో సరైన జర్నల్ ఎంపిక కీలకమని, జర్నల్ విశ్వసనీయత, ఇండెక్సింగ్, ఇంపాక్ట్ ఫ్యాక్టర్, పియర్-రివ్యూ విధానం వంటి అంశాలను పరిశీలించాలన్నారు. నకిలీ జర్నల్స్ పెరుగుతున్న నేపథ్యంలో అధ్యాపకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పబ్లికేషన్ ఎథిక్స్ కూడా ఎంతో ముఖ్యమైన అంశమని, ప్లేగారిజం నివారణ, సరైన సైటేషన్, ఇతరుల ఆలోచనలకు కృతజ్ఞత తెలియజేయడం వంటి నైతిక ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. కె.బి.ఎన్. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ పరిశోధన పత్ర రచన అధ్యాపకుల వ్యక్తిగత ప్రతిభను మాత్రమే కాకుండా, విద్యాసంస్థ ప్రతిష్ఠను కూడా పెంచుతుందన్నారు. పరిశోధన సంస్కృతి బలపడితే బోధన నాణ్యత పెరుగుతుంది; విద్యార్థుల్లోనూ అన్వేషణా స్వభావం పెంపొందు తుందన్నారు. బి.ఇడి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.కనకదుర్గ మాట్లాడుతూ అధ్యాపకులు సంవత్సరానికి కనీసం మూడు పరిశోధనా వ్యాసాలు ప్రచురించాలనే లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. ఐక్యుఎసి కోఆర్డినేటర్ షమీమ్, బీఈడీ కళాశాల కార్యదర్శి మాజేటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టణాలకు మహర్దశ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14

నగరాలు, పట్టణాలను ఆర్థిక ప్రగతికి గ్రోత్ ఇంజిన్లుగా మార్చే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. పట్టణాల్లో మౌలిక వసతుల కల్పన, వాటి అభివృద్ధి కోసం అర్బన్ చాలెంజ్ ఫండ్ (యూసీఎఫ్) ఏర్పాటు చేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం శనివారం ఇందుకు ఆమోదం తెలిపింది. ఈ పథకానికి కేంద్ర సాయంగా ఏకంగా రూ.లక్ష కోట్లను కేటాయించింది! ఈ పథకం 202526 నుంచి 203031 ఆర్థిక సంవత్సరం దాకా ఐదేళ్ల పాటు అమల్లో ఉంటుంది. అనంతరం అవసరాన్ని బట్టి మరింతకాలం పొడిగిస్తారు. నగరాలు తమ కాళ్లపై తాము నిలబడేలా, మార్కెట్ నుంచి నిధులు సమీకరించుకునేలా యూసీఎఫ్‌ను కేంద్రం రూపొందించింది. ఇందులో భాగంగా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు చేపట్టే పట్టణాభివృద్ధి ప్రాజెక్టుల్లో 25% నిధులను యూసీఎఫ్ కింద కేంద్రం ఇస్తుంది. ఇందుకోసం ప్రాజెక్టు నిధుల్లో కనీసం 50 శాతాన్ని రాష్ట్రాలు మార్కెట్ నుంచి సమీకరించాల్సి ఉంటుంది. మున్సిపల్ బాండ్లు, బ్యాంక్ రుణాలు లేదా పబ్లిక్‌ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) వాటిని సమకూర్చుకోవాలి.

మిగతా మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం, లేదా స్థానిక సంస్థలు భరించాలి. యూసీఎఫ్‌తో రాబోయే ఐదేళ్లలో దేశ పట్టణాభివృద్ధి రంగంలో ఏకంగా రూ.4 లక్షల కోట్ల మేరకు పెట్టుబడులు వెల్లువెత్తుతాయని కేంద్రం అంచనా వేస్తోంది. పట్టణాభివృద్ధిలో గ్రాంట్ ఆధారిత విధానం స్థానంలో మార్కెట్, సంస్కరణల ఆధారిత విధానానికి ఇది నాంది పలుకుతుందని ఒక ప్రకటనలో పేర్కొంది. యూసీఎఫ్ పథకంలో భాగంగా పోటీతత్వానికి కేంద్రం తెర తీసింది. పారదర్శకంగా, సంస్కరణలు అమలు చేసే నగరాలకే ప్రాధాన్యమిస్తారు. పాలనలో డిజిటల్ విధానాలు, ఆర్థిక క్రమశిక్షణ, అర్బన్ ప్లానింగ్ సంస్కరణలు అమలు చేసే నగరాలు రేసులో ముందుంటాయి. అంతేగాక టైర్2, టైర్3 నగరాలు, ముఖ్యంగా లక్ష లోపు జనాభా ఉన్న చిన్న పట్టణాల కోసం రూ.5,000 కోట్లతో ప్రత్యేక కార్పస్ ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఈశాన్య రాష్ట్రాలు, కొండ ప్రాంతాల్లో లక్ష లోపు జనాభా ఉన్న పట్టణాలు మార్కెట్ రుణాలు పొందడానికి కేంద్రం 'క్రెడిట్ రీపేమెంట్ గ్యారంటీ'ఇస్తుంది. దీనికింద తొలిసారి రుణాలకు రూ.7 కోట్లు లేదా రుణ మొత్తంలో 70% దాకా కేంద్రమే గ్యారంటీగా ఉంటుంది.

యూసీఎఫ్ ద్వారా మూడు రకాల అభివృద్ధి పనులకు ప్రాధాన్యమిస్తారు... నగరాల విస్తరణ, ఆర్థిక కారిడార్లు, రవాణా వ్యవస్థ మెరుగుదల

పాత బస్తీలు, హెరిటేజ్ ప్రాంతాల ఆధునీకరణ, బ్రౌన్‌ఫీల్డ్ ప్రాజెక్టులు, విపత్తుల నుంచి రక్షణ

తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ, చెత్త నిర్వహణ (స్వచ్ఛత), నీటి వనరుల రక్షణ ఎవరికి వర్తిస్తుంది?

10 లక్షల కంటే ఎక్కువ జనాభా ఉన్న నగరాలు
రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల రాజధానులు
లక్ష జనాభా దాటిన పారిశ్రామిక నగరాలు
చిన్న పట్టణాలు (గ్యారెంటీ స్కీమ్ కింద)

## కేబినెట్ ఇతర నిర్ణయాలు

ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో సమావేశమైన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ కీలక నిర్ణయాలు తీసుకుంది. వేల కోట్ల రూపాయలతో కూడిన పలు ప్రాజెక్టులకు ఆమోదముద్ర వేసింది. కేంద్ర సమాచార, ప్రసార మంత్రి అశ్వినీ వైష్ణవ్ వాటిని మీడియాకు వెల్లడించారు... తెలంగాణ, గుజరాత్, మహారాష్ట్రల్లో రూ.11 వేల కోట్ల రోడ్డు ప్రాజెక్టులకు అనుమతి

అస్సాంలో రూ.18,662 కోట్లతో బ్రహ్మపుత్ర నది కింద దేశంలోనే తొలి అండర్ వాటర్ రైల్, రోడ్డు ట్విన్ టన్నెల్ ప్రాజెక్టు. దీన్ని గోహ్‌పూర్‌నుమాలిగఢ్ నడుమ 34 కి.మీ. పొడవున నిర్మించనున్నారు

కసారామన్మాడ్, ఢిల్లీఅంబాలా, బళ్లారిహోస్పేట నడుమ మూడో, నాలుగో రైల్వే లైన్ల నిర్మాణం నిమిత్తం రూ.18,509 కోట్లతో మూడు భారీ ప్రాజెక్టులు రూ.10 వేల కోట్లతో తలపెట్టిన స్టార్టప్ ఇండియా ఫండ్ ఆఫ్ ఫండ్స్ 2.0కు ఆమోదం నోయిడా మెట్రో రైల్ ప్రాజెక్టు 11.56 కి.మీ. మేరకు విస్తరణ. ప్రధాని కార్యాలయాన్ని రైసినా హిల్స్‌లోని సౌత్ బ్లాక్ నుంచి నూతనంగా నిర్మించిన సేవా తీర్థ్‌లోకి మార్చడం పట్ల కేంద్ర మంత్రివర్గం హర్షం వెలిబుచ్చింది. శుక్రవారం సౌత్‌బ్లాక్ కార్యాలయంలో జరిగిన చివరి మంత్రివర్గ భేటీలో ఈ మేరకు తీర్మానం ఆమోదించింది. "సేవా తీర్థ్ చరిత్ర, భవిష్యత్తుల కూడలి. గతకాలపు బానిసత్వం నుంచి భవిష్యత్ వికసిత భారత్ దిశగా వేసిన ముందడుగు"అని అభివర్ణించింది.

# నేడు కోటప్పకొండ తిరునాళ్లు

- లక్షలాదిగా తరలిరానున్న భక్తులు
- 3,000 మంది పోలీసులతో పటిష్ఠ బందోబస్తు
- 100 అడుగుల ఎత్తున 22 భారీ విద్యుత్ ప్రభలు

( నరసరావుపేట), ఫిబ్రవరి 14



పల్నాడు జిల్లా నరసరావుపేట మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రం కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వరస్వామి తిరునాళ్ల మహాశివరాత్రి సందర్భంగా ఆదివారం అంగరంగ వైభవంగా జరగనుంది. తిరునాళ్లకు దేశ నలుమూలల నుంచి తరలివచ్చే లక్షలాది భక్తులకు ఇబ్బంది కలగకుండా భారీగా ఏర్పాట్లు చేశారు. నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ పట్టణాల నుంచి తిరునాళ్లకు 618 ప్రత్యేక బస్సులను ఆర్టీసీ ఏర్పాటు చేసింది. తాగునీరు, పారిశుధ్యం, వైద్య ఆరోగ్య అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ తిరునాళ్లనే ప్రభల పండుగగా పిలుస్తారు. తిరునాళ్లలో విద్యుత్ ప్రభలు ఆకర్షణంగా నిలుస్తాయి. 100 అడుగుల ఎత్తులో నిర్మించిన 22 భారీ విద్యుత్ ప్రభలు తిరునాళ్లలో కాంతులీననున్నాయి. శనివారం ఉదయం ఆయా గ్రామాల నుంచి ఊరేగింపుగా ప్రభలు కోటప్పకొండకు పయనమయ్యాయి. ఎనిమిది లక్షల మందికి పైగా భక్తులు వస్తారన్న అంచనా నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 3000 మంది పోలీసులతో పటిష్ఠ బందోబస్తుతో పాటు.. 200 సీసీ కెమెరాలు, డ్రోన్‌లతో నిఘా ఏర్పాట్లు చేశారు. కమాండ్ కంట్రోల్ కార్యాల యం ద్వారా బందోబస్తును పోలీసు ఉన్నతాధికారులు పర్యవేక్షించనున్నారు. ఉచిత దర్శనం, ప్రత్యేక, శీఘ్ర, వీఐపీ దర్శనాలు, అభిషేకాల కోసం ప్రత్యేకంగా క్యూలైన్‌లు ఏర్పాటు చేశారు. ఈసారి వీఐపీ ఉచిత దర్శనాలను రద్దు చేశారు. కలెక్టర్ కృతికా శుక్లా ఏర్పాట్లును పరిశీలించారు. ఎస్పీ బి.కృష్ణారావు బందోబస్తును పర్యవేక్షించారు. కాగా.. ఆదివారం అర్ధరాత్రి శ్రీ త్రికోటేశ్వర స్వామికి లింగోద్భవ అభిషేకాలు వైభవంగా జరగనున్నాయి. తిరునాళ్లకు రాష్ట్ర పండుగ హోదా నేపథ్యంలో ప్రభుత్వం తరపున శ్రీ త్రికోటేశ్వర స్వామికి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పట్టు వస్త్రాలు, వెండి ప్రభను సమర్పించనున్నారు.

# మౌలికం.. పెట్టుబడుల ఆకర్షణకు మార్గం

- రాష్ట్రంలో పోర్టులు..రైలు.. రోడ్డు మార్గాల అనుసంధానం
- కొత్తగా 6 విమానాశ్రయాల ఏర్పాటుకు ప్రతిపాదన
- 175 ఎంఎస్‌ఎంఈ పార్కులు
- 20 క్లస్టర్ విధానంలో పారిశ్రామిక అభివృద్ధి
- ప్రతి రంగానికి ప్రత్యేక పాలసీలు..



అమరావతి, ఫిబ్రవరి 14

కీలక రంగాల్లో పెట్టుబడుల ఆకర్షణకు 'పాలసీ 4.0' విధానాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోంది. దీనిద్వారా ఉపాధి అవకాశాలు కల్పించడం, ఎగుమతులు పెంచడం.. రాష్ట్ర సుస్థిర పారిశ్రామికాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. అందులో భాగంగా కీలక రంగాలు ఫుడ్ ప్రాసెసింగ్, ఆగ్రోప్రాసెసింగ్, ఫార్మాస్యూటికల్స్, లైఫ్‌సైన్సెస్ (బల్క్ డ్రగ్స్), టెక్స్‌టైల్స్, ఎలక్ట్రానిక్స్, ఈవీలు, ఐటీ, ఆరోగ్యం లాంటి రంగాలను గుర్తించింది. విశాఖ-చెన్నై (వీసీఐసీ) కారిడార్ అభివృద్ధి చేయడం.. ప్లగ్ అండ్ ప్లే క్లస్టర్లను (ఎంఎస్‌ఎంఈలకు సిద్ధంగా మౌలిక సదుపాయాలు) కల్పించడంపై దృష్టిపెట్టింది. మల్టీమోడల్ సరకు రవాణా నెట్‌వర్క్ అభివృద్ధి చేయడం, సహాయక విధాన ఫ్రేమ్‌వర్క్, గ్లోబల్ ప్రొడక్షన్ నెట్‌వర్క్‌ల అనుసంధానంతో సులభతరమైన రవాణా సేవలు అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం చేస్తోంది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా గ్రీన్/స్మార్ట్ ఇండస్ట్రియల్ పార్కుల అభివృద్ధి.. క్లీన్ ఎనర్జీని ప్రోత్సహించేలా కార్యాచరణ చేపట్టింది. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ (నిక్‌డిక్ట్) భాగస్వామ్యంతో.. విశాఖ-చెన్నై (వీసీఐసీ), చెన్నై-బెంగళూరు (సీబీఐసీ), హైదరాబాద్-బెంగళూరు (హెచ్‌బీఐసీ) పారిశ్రామిక కారిడార్లలో పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తోంది. సూక్ష్మ, చిన్న పారిశ్రామికవేత్తల కోసం క్లస్టర్ డెవలప్‌మెంట్ స్కీం కింద కేంద్ర సహకారంతో కామన్ ఫెసిలిటీ సెంటర్లు, ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌ల లాంటి మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా పెట్టుబడులు ఆకర్షించాలన్నది లక్ష్యం. సహజవనరులు, నిపుణులైన యువత, ఓడరేవులు.. ఇవన్నీ పెట్టుబడుల ఆకర్షణలో రాష్ట్రానికి ఉన్న బలం. గత 20 నెలల్లో రూ.8.74 లక్షల కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు గ్రౌండింగ్ అయ్యాయి. మరో రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు వివిధ సంస్థలు ప్రభుత్వంతో ఎంవోయూ కుదుర్చుకున్నాయి. కూటమి ప్రభుత్వం పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాలపై దృష్టిపెట్టింది. రాష్ట్రం మొత్తాన్ని మూడు జోన్‌లుగా.. 20 క్లస్టర్లుగా విభజించి అభివృద్ధికి ప్రణాళికలు రూపొందింది. ప్రాంతాలవారీగా ఉన్న వనరుల ఆధారంగా.. ఆయా రంగాల్లో పరిశ్రమల ఏర్పాటుకు వీలుగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తోంది.

### మూడు పారిశ్రామిక కారిడార్లు

రాష్ట్రంలో మూడు పారిశ్రామిక కారిడార్లను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంలో వీసీఐసీ, సీబీఐసీ, ఖహెచ్‌బీఐసీ పారిశ్రామిక కారిడార్ల ద్వారా కృష్ణపట్నం నోడ్, ఓర్వకల్లు, కొప్పర్తి నోడ్‌ల అభివృద్ధికి కేంద్రం నిధులు సమకూర్చుతోంది. సీబీఐసీ పరిధిలోని నెల్లూరు క్రిస్ సిటీని రూ.621 కోట్లతో నిక్‌డిక్ట్ భాగస్వామ్యంతో రాష్ట్రప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. హెచ్‌బీఐసీలో ఓర్వకల్లు నోడ్‌ను (హెచ్‌బీఐసీ) నిక్‌డిక్ట్ భాగస్వామ్యంతో రూ.1014 కోట్లతో రాష్ట్రప్రభుత్వం అబివృద్ధి చేస్తోంది.

వీసీఐసీ కింద వైఎస్సార్ కడప జిల్లాలోని కొప్పర్తి నోడ్ (వీసీఐసీ)ను రూ.872 కోట్లతో ప్రతిపాదించింది.

ప్రభుత్వం ఎంచుకున్న సూత్రాలు
ప్రపంచంలోని అత్యుత్తమ లాజిస్టిక్ విధానాలు
విద్యుత్ ధరలను వీలైనంతగా తగ్గించడం
అన్ని రంగాల్లో డీప్‌టెక్ వినియోగం లక్ష్యం సాధించేందుకు.. విధానాలు-4.0
పారిశ్రామికాభివృద్ధి పాలసీ 4.0
ఎంఎస్‌ఎంఈ, ఆంత్రప్రెన్యూర్ డెవలప్‌మెంట్ పాలసీ
ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్క్స్ పాలసీలు తీసుకొచ్చింది వాటిద్వారా తయారీ, ఎలక్ట్రానిక్స్, ఈవీలు, పునరుత్పాదక విద్యుత్, ఐటీ, సెమీకండక్టర్లు, డేటాసెంటర్లు, ఏరోస్పేస్, డిఫెన్స్, గ్రీన్ హైడ్రోజన్ లాంటి రంగాలపై ప్రభుత్వం దృష్టిపెట్టింది. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో.. ఒక్కో పారిశ్రామిక పార్కును ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. వాటిద్వారా ఎంఎస్‌ఎం ఈలను ప్రోత్సహించాలన్నది లక్ష్యం. ఒక కుటుంబం.. ఒక పారిశ్రామికవేత్త అనే ఆలోచనకు అనుగుణంగా చిన్న పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు వీలుగా పార్కులను ఏర్పాటుచేస్తోంది. ఇప్పటికే 50కి పైగా పార్కుల శంకుస్థాపనలు పూర్తిచేసింది. మిగిలినవాటికి భూములు గుర్తించింది. ఇలాగే ప్రైవేటు పార్కుల అభివృద్ధికి ప్రత్యేక పాలసీని ప్రకటించింది. ఎంఎస్‌ఎంఈ పారిశ్రామిక పార్కులో ప్లగ్ అండ్ ప్లే విధానంలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.100 కోట్లు బడ్జెట్‌లో కేటాయించింది. ఎంఎస్‌ఎంఈల పునరుజ్జీవనానికి రూ.5.70 కోట్లు.. ఏపీ క్రెడిట్ గ్యారంటీ స్కీం కింద రూ.10 కోట్లు కేటాయించడం ద్వారా ఎంఎస్‌ఎంఈలను బలోపేతం చేయనుంది.



# వీమోదీ సర్కారులో ఉపాధి పథకానికి ముప్పు

## కూటమితో పాటు జగన్ కూడా బీజేపీ బానిసే: షర్మిల

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 14

పల్లె ప్రజల వలసలు తగ్గించి, ఆకలి కేకలు లేకుండా చేసిన ఉపాధి హామీ పథకాన్ని బీజేపీ సర్కారు నిర్వీర్యం చేస్తోందని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం కడప నగరంలోని యానాది కాలనీలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఉపాధి హామీ కూలీలతో ఆమె రచ్చబండ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2005లో గ్రామాల్లో వలసలు ఆపాలని, ఉపాధి కల్పించి ఆదుకోవాలని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వాన్ని ఒప్పించి అనంతపురం జిల్లాలో ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించారన్నారు. నాటి నుంచి నేటి వరకు వలసలు ఆగి, పల్లె ప్రజలు ఉపాధి పనులతో జీవనం సాగిస్తున్నారన్నారు. అలాంటి పథకానికి మోదీ సర్కారు గండి కొట్టే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ఉపాధి హామీ పథకాన్ని ప్రజల కోసం వైఎస్ తెస్తే.. తనయుడుగా ఆ పథకాన్ని కాపాడాల్సిన జగన్ బీజేపీకి బానిసగా మారారని మండిపడ్డారు. ఆర్‌ఎస్ఎస్ వాది గాడ్సే గాంధీని హత్య చేస్తే, ఇప్పుడు ఉపాధి హామీ పథకానికి ఉన్న మహాత్మాగాంధీ పేరును తొలగించి మోదీ ఖూనీ చేశారని విమర్శించారు. మోదీ తెచ్చిన వీబీరామ్‌జీ చట్టం గ్రామ స్వరాజ్యానికి వ్యతిరేకమన్నారు. బీజేపీ మత రాజకీయాలకు జగన్ మద్దతు ఉండడం విచారకరమన్నారు. రాష్ట్రంలో ఎంపీలంతా బీజేపీ వారేనన్నారు. బాబు, పవన్‌తో పాటు జగన్ కూడా బీజేపీ బానిసలుగా మారారని ఎద్దేవా చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలను గాడిలో పెట్టేందుకు కాంగ్రెస్ ప్రజల ప్రక్షాన పోరాటాలకు సిద్ధమని షర్మిల తెలిపారు.

# వ్యవ'సాయం' పెంపు

## రూ.53,752 కోట్లతో ప్రత్యేక బడ్జెట్
## గతేడాది కన్నా 5,410 కోట్లు ఎక్కువ

అమరావతి, ఫిబ్రవరి 14

రాష్ట్రంలో వ్యవసాయ, అనుబంధ రంగాలకు 2026-27 బడ్జెట్‌లో రూ.53,752.12 కోట్లను కూటమి ప్రభుత్వం కేటాయించింది. శనివారం శాసనసభలో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఈ మేరకు వ్యవసాయ బడ్జెట్‌ను ప్రత్యేకంగా ప్రవేశపెట్టారు. శాసనమండలి ముందు రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ వ్యవసాయ బడ్జెట్‌ను ఉంచారు. వ్యవసాయ, అనుబంధ రంగాలకు ఈ ఏడాది కూడా ప్రాధాన్యం ఇచ్చారు. 2025-26 బడ్జెట్‌లో వ్యవసాయ, అనుబంధ రంగాలకు రూ.48,341.14 కోట్లు కేటాయించిన కూటమి ప్రభుత్వం.. ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.5,410 కోట్లు పెంచింది. కీలక రంగాలకు నిధులను పెంచింది. ఉచిత వ్యవసాయ విద్యుత్‌కు గతేడాది రూ.12,773.25 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది రూ.13,722 కోట్లు ప్రతిపాదించింది. సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణకు నిరుడు రూ.12,903.41 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది రూ.14,276 కోట్లు ప్రతిపాదించింది. వ్యవసాయ శాఖకు గతేడాది రూ.12, 401.58 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది రూ.12, 152 కోట్లు కేటాయించింది. పశుసంవర్ధక శాఖకు గతేడాది రూ.1, 112.07 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది రూ.1,121 కోట్లు, ఉద్యాన శాఖకు గతేడాది రూ.931 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది రూ.1,123 కోట్లు, మత్స్యశాఖకు గతేడాది రూ.540.19 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది రూ.523 కోట్లు, మార్కెటింగ్ శాఖకు నిరుడు రూ.315.32 కోట్లు కేటాయించగా, ఈ సారి రూ.515 కోట్లు ప్రతిపాదించింది. రైతులకు నేరుగా లబ్ధి కలిగించే అన్నదాత-సుఖీభవ పథకానికి రూ.6,600 కోట్లు, ధరల స్థిరీకరణ నిధికి రూ.500 కోట్లు, పంటల బీమాకు రూ.250 కోట్లు, వడ్డీ లేని రుణాలకు రూ.250 కోట్లు ప్రస్తుత బడ్జెట్‌లో కేటాయించింది.




# సంత్ సేవాలాల్ స్ఫూర్తితో ఆదివాసీల అభివృద్ధి

## నీట్, ఐఐటీ సీట్లు సాధించేలా ఎస్టీ విద్యార్థులకు శిక్షణ

అమరావతి, ఫిబ్రవరి 14

సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ స్ఫూర్తితో గిరిజనుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. రూ.50 లక్షలు కేటాయించి సేవాలాల్ జయంతిని రాష్ట్ర పండుగగా ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని నిధులు కేటాయిస్తామని స్పష్టం చేశారు. నీట్, ఐఐటీ సీట్లు సాధించేలా గురుకులాల్లో ఎస్టీ విద్యార్థులకు శిక్షణ అందిస్తామని చెప్పారు. ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ 287 జయంతి కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. సంత్ శ్రీ సేవాలాల్ మన రాష్ట్రంలో జన్మించడం మన అదృష్టమని తెలిపారు. బంజారాల ఆరాధ్య దైవమైన ఆయన సిద్ధాంతాలు ఎప్పటికీ ఆదర్శమేనన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున మౌలిక వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. ఉచితంగా సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేస్తున్నామని. 2026-27 వార్షిక బడ్జెట్‌లో రూ. 9,190 కోట్లు ఎస్టీల కోసం కేటాయించామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ఎమ్మెల్యేలు మిరియాల శిరీషాదేవి, తోయక జగదీశ్వరి, చిర్రిబాలరాజు, గిరిజన నేతలు, గిరిజన సంక్షేమశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## రూపాయికి ముడి చమురు సెగ..!

### డాలర్‌తో 93కు పడిపోవచ్చు

### రష్యాయేతర ఆయిల్ కొనుగోలుతో ప్రభావం

న్యూఢిల్లీ : అమెరికా ఒత్తిడితో రష్యాయేతర చమురు కొనుగోళ్లకు భారత్ మొగ్గు చూపడం ద్వారా రూపాయి మరింత బలహీనపడనుందని ఫిచ్ రేటింగ్స్ అంచనా వేసింది. ఖరీదైన రష్యాయేతర ముడి చమురు కొనుగోలు కారణంగా 2026 నాటికి డాలర్‌తో రూపాయి విలువ 93కి పడిపోవచ్చని విశ్లేషించింది. గతేడాది కాలంలో డాలర్‌తో రూపాయి 5 శాతం పతనమై 92 మార్క్‌ను దాటిన విషయం తెలిసిందే. "గతేడాది డాలర్‌తో పోలిస్తే 5 శాతం క్షీణించిన రూపాయి ఇటీవల యుఎస్- ఇండియా వాణిజ్య ఒప్పందం వల్ల ప్రస్తుతం రూ.90.4 వద్ద నమోదవుతోంది. మేము గతంలో డాలర్‌తో రూపాయి విలువ 95కి చేరుతుందని అంచనా వేయగా.. ఇప్పుడు 2026 చివరి నాటికి రూపాయి మరింత నెమ్మదిగా క్షీణించి సుమారు 93 వద్ద ట్రేడ్ కావొచ్చని భావిస్తు న్నాము. మార్కెట్ల నుంచి ఎఫ్ఐఐలు తరలిపోవడం, వాణిజ్య ఒప్పందం ప్రకారం ఖరీదైన రష్యాయేతర ముడి చమురు వైపు మళ్లడం ఈ క్షీణతకు కారణ మవుతాయి." అని ఫిచ్ తన నివేదికలో పేర్కొంది. అమెరికా వడ్డీ రేట్ల తగ్గింపు ఆసియా కరెన్సీలకు మద్దత ునిస్తుందని.. అయితే దేశీయ స్థిరత్వం కీలక పాత్ర పోషిస్తుందని ఫిచ్ తెలిపింది. 'బలహీనమైన యుఎస్ డాలర్ నేపథ్యం ఎంపిక చేసిన కరెన్సీలకు మద్దతు ఇస్తుంది.. కానీ లాభాలు అసమానంగా ఉంటాయి. బలమైన కరెంట్ ఖాతాలు, ఆర్థిక లోటు, వాణిజ్య క్షీణత లేదా జోక్యం ఎక్కువగా ఉండే దేశాల కరెన్సీలు తమ విలువను నిలబెట్టుకోవడంలో ఇబ్బంది పడతాయి." అని ఫిచ్ తెలిపింది.

## ఇన్ఫోసిస్ ఉద్యోగులకు 85 శాతం బోనస్



న్యూఢిల్లీ : ప్రముఖ టెక్ కంపెనీ ఇన్ఫోసిస్ తమ ఉద్యోగులకు భారీ బోనస్‌ను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26 డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికానికి గాను ఇన్ఫోసిస్ సగటున 85 శాతం పనితీరు బోనస్ చెల్లించనుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) కారణంగా ఐటి సర్వీసెస్ పనుల్లో ఆటోమేషన్ పెరిగి ఉద్యోగాలకు ముప్పు వాటిల్లుతుందనే ఆందోళనల మధ్య, టెక్నాలజీ స్టాక్స్ ఒత్తిడిలో ఉన్న సమయంలో ఈ నిర్ణయం ఉద్యోగుల నైతిక ధైర్యాన్ని పెంచుతుందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ఈ బోనస్ చెల్లింపు ఫిబ్రవరి నెల జీతంతో కలిపి అందించనున్నట్లు తెలుస్తోంది. వ్యక్తిగత బోనస్ చెల్లింపుల తేడాల్లో 75 శాతం నుండి 100 శాతం మధ్య ఉన్నాయని ఉద్యోగులు తెలిపారు. కొంతమంది గత త్రైమాసికం కంటే 15 శాతం ఎక్కువ అందుకున్నామని చెప్పగా, మరికొందరు పూర్తి 100 శాతం అందుకున్నట్లు వెల్లడించారు. జులై- సెప్టెంబర్ త్రైమాసికంలోనూ 75 శాతం బోనస్‌ను చెల్లించింది. కాగా.. వార్షిక జీతాల పెంపునపై ఉద్యోగులు ఎదురు చూస్తున్నారు. గతేడాది 5-8 శాతం మధ్య వేతనాలను పెంచింది.

## పసిడి మళ్లీ పైకి ..!



ఇటీవల భారీగా దిగివచ్చిన పసిడి ధర మళ్లీ పైకి ఎగబాకింది. శనివారం కూడా పది గ్రాములపై దాదాపు రెండు వేల రూపాయలు పెరిగింది. ఈ రోజు ఉదయం 11 గంటల సమయానికి హైదరాబాద్ నగరంలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,970 పెరిగి.. రూ.1,57,750కి చేరింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1800 పెరిగి.. రూ.1,44,600కి చేరింది. అలానే 18 క్యారెట్ల పది గ్రాముల ధరపై రూ.1470 పెరిగి.. రూ.1,18,310కి పెరిగింది. అలాగే కిలో వెండి ధరల్లో ఎలాంటి మార్పులు జరగలేదు. ప్రస్తుతం వెండి ధర రూ.2,80,000 ఉంది. ఇక, దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి రేటు రూ.1970 పెరిగి... రూ.1,57,900కి చేరింది. అలానే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర.. రూ.1800 పెరిగి.. రూ.1,44,750కి చేరుకుంది. ఇక, 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1470 పెరిగి.. రూ.1,44,750కి చేరింది. ప్రస్తుతం కిలో వెండి ధర రూ.2,80,000 ఉంది. ఇటీవల బంగారం, వెండి ధరల్లో అనూహ్య పెరుగుదల, తగ్గుదల కనిపిస్తోంది కాబట్టి కొనుగోలుదారులు ముందుగా రేట్లను తెలుసుకొని కొనుగోలు చేయడం మంచిది.

## ఇండిగో 1,000 మంది పైలట్‌ల నియామకం..!



న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద బడ్జెట్ విమాన యాన సంస్థ ఇండిగో భారీ స్థాయిలో నియామ కాలు చేపట్టనుం దని తెలుస్తోంది. దీనిలో భాగంగా 1,000 మందికి పైగా పైలట్‌లను విధుల్లోకి తీసుకోనుంది. గత డిసెంబర్‌లో ఈ బడ్జెట్ ఎయిర్‌లైన్స్ దిగ్గజం భారీ అంతరాయాలను, పైలట్‌ల సంక్షోభాన్ని ఎదుర్కొన్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. ఆ సమయంలో కేవలం ఏడు రోజుల వ్యవధిలోనే 5,000 కంటే ఎక్కువ విమానాలను రద్దు చేసింది. ఈ కొత్త నియామకాలలో ట్రైనీ ఫస్ట్ ఆఫీసర్లు, సీనియర్ ఫస్ట్ ఆఫీసర్లు, కమాండర్లు ఉంటారని రిపోర్టులు వస్తోన్నాయి. తమ నెట్‌వర్క్‌లో అత్యధికంగా వాడే ఎయిర్‌బస్ ఎ320 విమానాలపై అనుభవం లేని దరఖాస్తుదారులను కూడా తీసుకోవడానికి సంస్థ సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది.

## హెచ్‌సిఎల్ టెక్, సిస్కో కొత్త ఎఐ సెంటర్ ప్రారంభం

నోయిడా : ప్రముఖ టెక్ సంస్థ హెసిఎల్ టెక్, నెట్‌వర్కింగ్ దిగ్గజం సిస్కోతో కలిసి ఎఐ ఆధారిత 'ఫ్లూయిడ్ కాంటాక్ట్ సెంటర్' పరిష్కారాన్ని ఆవిష్కరించింది. ఈ క్లౌడ్ నేటివ్ ప్లాట్‌ఫారమ్ జెన్ ఎఐ సామర్థ్యాలతో కస్టమర్ సర్వీస్ రంగాన్ని ఆధునీకరించడమే కాకుండా, బహుభాషా వర్చువల్ ఏజెంట్ల ద్వారా సేవలను వేగవంతం చేస్తుందని హెచ్‌సిఎల్ టెక్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ గుర్‌ప్రీత్ కోహ్లీ, సిస్కో ప్రతినిధి షానన్ లీనింగర్ తెలిపారు. మూడు దశాబ్దాల భాగస్వామ్యంలో భాగంగా రూపొందిన ఈ సాంకేతికత, వ్యాపార సంస్థల నిర్వహణ సామర్థ్యాన్ని పెంచి కస్టమర్లకు మరింత వ్యక్తిగతమైన అనుభూతిని అందిస్తుందన్నారు.

# అనుమతి లేని విమానంతో ప్రయాణాలు

### ఎయిర్ ఇండియాకు రూ.1 కోటి జరిమానా



న్యూఢిల్లీ : సాధారణంగా అనుమతి పత్రాలు లేకుండానే బస్సులు, ఆటోలు లాంటి వాహనాలను మాత్రమే తిప్పడం, ప్రమాదాల భారిన పడటాన్ని చూస్తాము. కానీ భారత్‌లో అప్పుడప్పుడు విమానాలు కూడా సరైన ధృవీకరణ పత్రాలు లేకుండా పలు రూట్లలో తిరుగుతున్నాయి. ఈ కోవలోనే ఎయిరిండియా విమాన ఘటన రుజువు చేస్తోంది. అవసరమైన ఎయిర్‌వర్తినెస్ సర్టిఫికేషన్ (ఎఆర్‌సి) లేకుండా ఎయిర్‌బస్ ఎ320 నియో విమానాన్ని నడిపినందుకు టాటా గ్రూప్ యాజమాన్యంలోని ఎయిర్ ఇండియాకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) రూ.1 కోటి జరిమాన విధించింది. గతేడాది కనీసం ఎనిమిది రూట్లలో విమానాన్ని తిప్పిందనే ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్నట్లు డిసెంబర్ 2న డైరెక్టరేట్ డిజిసిఎ ప్రకటన చేయగా.. తాజాగా జరిమానా విధించినట్లు ఆ వర్గాలు తెలిపాయి. '2025లో స్వచ్ఛందంగా నివేదించబడిన ఒక ఘటనకు సంబంధించి డిజిసిఎ జారీ చేసిన ఉత్తర్వును అంగీకరిస్తున్నాము. గుర్తించిన లోపాలన్నీ ఇప్పటికే పరిష్కరించబడ్డాయి. అధికార యంత్రాంగంతో చర్చించడం జరిగింది" అని ఎయిరిండియా తెలిపింది. ఎఆర్‌సి అనేది విమానం నిర్వహణ రికార్డులు, ఫిట్‌నెస్ ప్రమాణాలకు అనుగుణంగా సమగ్రంగా సమీక్షించిన తర్వాత ఏటా ఈ సర్టిఫికెట్ జారీ చేయబడుతుంది. 2025 నవంబర్ 26తో గడువు ముగిసిన ఎయిర్‌వర్తినెస్ రివ్యూ సర్టిఫికేట్‌తో ఎయిర్‌బస్ ఎ320 నియోను ఎనిమిది రెవెన్యూ సెక్టార్‌లలో ప్రయాణికులతో కూడిన సర్వీసులు కొనసాగించినట్లు ఎయిరిండియా స్వయంగా తెలిపింది.

# సమ ఉజ్జీల సమరానికి వేళాయే..

### నేడు భారత్ - పాకిస్తాన్ జట్ల మధ్య కీలక పోరు

### పొంచివున్న వర్షం ముప్పు

### రాత్రి 7.00గం॥ల నుంచి



కొలంబో: టి20 ప్రపంచకప్‌లో సమవుజ్జీల సమరానికి సమయం ఆసన్నమైంది. ఆదివారం కొలంబోలోని ఆర్. ప్రేమదాస స్టేడియంలో భారత్, పాకిస్తాన్ జట్ల మధ్య హై-వోల్టేజ్ మ్యాచ్ జరగనుంది. గ్రూప్-ఎ ఈ రెండుజట్లు ఆడిన తొలి రెండు మ్యాచుల్లోనూ గెలిచిన ఉత్సాహంతో బరిలోకి దిగుతున్నాయి. నేటి మ్యాచ్‌లో గెలిచిన జట్టుకు టాప్ బెర్త్ ఖాయం కానుండగా... ఇప్పటికే ఇరుజట్ల ఆటగాళ్లు ప్రాక్టీస్ మొదలుపెట్టారు. ఈ హైవోల్టేజ్ మ్యాచ్ కోసం భారత జట్టులో కీలక మార్పులు చోటు చేసుకోనుంది. అనారోగ్యం కారణంగా నమీబియాతో మ్యాచ్‌కు దూరమైన విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ.. పాక్‌తో మ్యాచ్‌కు అందుబాటులోకి వచ్చాడు. దీంతో సంజూ శాంసన్‌పై వేటు పడటం ఖాయం. గత మ్యాచ్‌లో సంజూకు అవకాశం లభించినా.. సద్వినియోగ పరుచుకోలేకపోయాడు. 8 బంతుల్లో 22 పరుగులు చేసి ఔటయ్యాడు. ఇక కొలంబో పిచ్ స్పిన్‌కు అనుకూలించే అవకాశముండడంతో కుల్దీప్ యాదవ్ తుది జట్టులోకి వచ్చే ఛాన్స్ ఉంది. దీంతో అర్ష్‌దీప్ సింగ్‌పై వేటుపడటం ఖాయం. పాక్‌పై కుల్దీప్ యాదవ్‌కు అద్భుతమైన రికార్డు ఉంది. అతడు 3 టి20ల్లో 8 వికెట్లు పడగొట్టాడు. కాబట్టి అతడిని తుది జట్టులోకి తీసుకోవడం ఖాయమే. ఈ టోర్నీలో భారత్ తన తొలి మ్యాచ్‌లో అమెరికాపై 29 పరుగుల తేడాతో, రెండో మ్యాచ్‌లో నమీబియాపై 93 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. మరోవైపు పాకిస్తాన్ నెదర్లాండ్స్, అమెరికా జట్లను ఓడించింది. భారత్‌తో పోరుకు పాకిస్తాన్ చివరి వరకు ఐసిసితో సుదీర్ఘ చర్చలు జరిపి చివరి నిమి షంలో ఆడతామని ప్రకటించింది. దీంతో ఈ మ్యాచ్ ప్రాధాన్యత సంతరించకుంది. గ్రూప్-ఎ నుంచి సూపర్-8కు చేరాలంటే ఇరుజట్లకు గెలుపు తప్పనిసరి. పాకిస్తాన్ కెప్టెన్ అఘా సల్మాన్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. షేక్‌హ్యాండ్ వివాదంపై అడిగిన ప్రశ్నకు బదులిస్తూ... భారత్‌తో కరచాలనం చేసేందుకు పాకిస్తాన్ సిద్ధంగా ఉందని, కానీ ఏం జరుగుతుందో చూద్దామని బదులిచ్చారు. ఓపెనర్ అభిషేక్ శర్మ ఆదివారం జరిగే మ్యాచ్‌లో బరిలోకి దిగడం ఖాయంగా కనబడుతోంది. తమజట్టు ఉత్తమమైన జట్టుతోనే తాము తలపడాలని అనుకుంటున్నట్లు సల్మాన్ తెలిపారు. బౌలర్ ఉస్మాన్ తారీఖ్ యాక్షన్ వివాదం గురించి స్పందిస్తూ... ఉస్మాన్‌కు ఐసిసి రెండుసార్లు క్లియరెన్స్ ఇచ్చిందని, ఎందుకు అంతగా అతని యాక్షన్ గురించి చర్చిస్తున్నారో అర్థంకావడం లేదని, అతనేమీ దీని గురించి పట్టించుకోవడం లేదన్నారు. అతను మా ట్రంప్‌కార్డ్ అవుతారన్నారు. ఇక టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మాత్రం.. షేక్‌హ్యాండ్ ఉంటుందా? అనే ప్రశ్నకు 'ఇంకా 24 గంటలు సమయం ఉందిగా' అని బదులిచ్చాడు. ఐసిసి ప్రపంచకప్‌లలో ఇండియాపై పాకిస్తాన్‌కు మంచి రికార్డు లేదు. టి20 ప్రపంచకప్‌లో ఇరుజట్లు ఇప్పటివరకు 8సార్లు తలపడగా.. భారత్ 7సార్లు, పాకిస్తాన్ ఒకసారి మాత్రమే విజయం సాధించాయి.

### పొంచివున్న వర్షం ముప్పు

బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశమున్నట్లు ఇక్కడి వాతావరణ శాఖ శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. హిందూ మహాసముద్రం, ఆగేయ బంగాళాఖాతం పరిసరా ల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని, దీంతో 15న తీవ్ర అల్పపీడనంగా మారే అవకాశాలు న్నాయని అందులో తెలిపింది. దీని ప్రభావం దక్షిణాది రాష్ట్రాలతో పాటు శ్రీలంకలో వర్షాలు కురి సే అవకాశమున్నట్లు తెలిపింది. దీంతో కొలంబోలో ఇండియా, పాకిస్తాన్ జట్ల మధ్య జరిగే మ్యాచ్‌కు ఆటంకం కలిగించే అవకాశాలున్నాయని పేర్కొంది.

జట్లు(అంచనా)..: భారత్: సూర్యకుమార్(కెప్టెన్), అభిషేక్ శర్మ/సంజు శాంసన్, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, దూబే, రింకు సింగ్, బుమ్రా, అర్ష్‌దీప్/కుల్దీప్, వరుణ్ చక్రవర్తి. పాకిస్తాన్: అఘా సల్మాన్(కెప్టెన్), ఫర్హాన్, ఆయుబ్, బాబర్, ఉస్మాన్(వికెట్ కీపర్), షాదాబ్, నవాజ్, అష్రాఫ్, షాహిన్, సల్మాన్, అబ్రార్.



## ఐర్లాండ్ ఘన విజయం

### ఒమన్ 96 పరుగుల తేడాతో చిత్తు

### ఐసిసి టి20 ప్రపంచకప్

కొలంబో: టి20 ప్రపంచకప్-2026లో ఐర్లాండ్ బోణీ కొట్టింది. శనివారం కొలంబో వేదికగా జరిగిన గ్రూప్-బి మ్యాచ్‌లో ఒమన్‌పై 96 పరుగుల భారీ తేడాతో ఐర్లాండ్ ఘన విజయం సాధించింది. దీంతో ఐర్లాండ్ జట్టు తమ సెమీస్ ఆశలను సజీవంగా ఉంచుకుంది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఐర్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 235 పరుగుల భారీ స్కోరు చేసింది. టాపార్డర్ విఫలమైనా.. మిడిలార్డర్ బ్యాటర్లు లోర్కాన్ టక్కర్, గారెత్ డెలానీ, జార్జ డాక్రెల్ అద్భుతమైన ఇన్నింగ్స్‌లు ఆడారు. ముఖ్యంగా టక్కర్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. టక్కర్ కేవలం 51 బంతుల్లో 94 పరుగులు (10 ఫోర్లు, 4 సిక్సర్లు) చేసి అజేయంగా నిలిచాడు. డెలానీ 30 బంతుల్లో 56 పరుగులతో మెరుపు అర్ధ సెంచరీ కొట్టాడు. జార్జ్ డాక్రెల్ కేవలం 9 బంతుల్లోనే 5 సిక్సర్ల సాయంతో 35 పరుగులు చేశాడు. ఒమన్ బౌలర్లలో షకీల్ అహ్మద్ మూడు, కలీం రెండు వికెట్లు సాధించారు. భారీ ఛేదనలో ఒమన్ బ్యాటర్లు ఐర్లాండ్ బౌలర్ల ధాటికి చేతులెత్తేశారు. దీంతో ఒమన్ జట్టు 18 ఓవర్లలో 139 పరుగులకే కుప్పకూలింది. ఒమన్ బ్యాటర్లలో ఆమిర్ కలీం (50), హమ్మద్ మీర్జా (46) మాత్రమే రాణించగా.. మిగతా బ్యాటర్లు నిరాశపరిచారు. ఐర్లాండ్ బౌలర్లలో జాషువా లిటిల్ మూడు, బారీ మెక్‌కార్తీ, మాథ్యూ హంఫ్రీస్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ టక్కర్‌కు దక్కింది. ఈ గెలుపుతో గ్రూప్-బిలో ఐర్లాండ్ జట్టు మూడు మ్యాచ్‌లు ముగిసేసరికి నాల్గోస్థానంలో నిలిచింది.

## స్కాట్లాండ్‌పై ఇంగ్లాండ్ విజయం

### సూపర్-8 రేసులోకి ఇంగ్లండ్



కోల్‌కతా: స్కాట్లాండ్ టీంపై ఇంగ్లాండ్ జట్టు ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. కలకత్తాలోని ఈడెన్ గార్డెన్ స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన స్కాట్లాండ్ 20 ఓవర్లలో152 రన్స్ చేసి ఆలౌటైంది. స్కాట్లాండ్ బ్యాటర్లు ఎంఎ జోన్స్ 33, బెరింగ్టన్ 49, టామ్ బ్రూస్ 24, ఆలివర్ డేవిడ్సన్ 20, రాణించారు. మిగాతా బ్యాటర్లంతా జార్జ్ మున్సే 4, బ్రాండన్ మెక్‌ముల్లెన్ 0, మైఖేల్ లీస్క్ 1, మాథ్యూ క్రాస్ 8, మార్క్ వాట్ 2, బ్రాడ్ వీల్ 2, బ్రాడ్ క్యూరీ 2 తక్కువ పరుగులకే ఔటయ్యారు. ఇంగ్లాండ్ బౌలర్లలో రషీద్ 3 ఆర్చర్, డాసన్ 2, ఓవర్ టన్, కరెన్ తలో వికెట్ తీశారు. 153 లక్ష్య చేధనకు దిగిన ఇంగ్లాండ్ టీం తడబడింది. ఓపెనర్లు సాల్ట్, బట్లర్ సింగిల్ డిజిట్ పరుగులకే పెవిలియన్ చేరారు. పది ఓవర్లు ముగిసేరికి ఇంగ్లాండ్ స్కోర్ 4 వికెట్లు కోల్పోయి 86 రన్స్ చేసింది. ఈక్రమంలోనే బెథల్(32), బాన్ టన్(63) తో కలిసి ఇన్నింగ్స్ స్కోర్ బోర్డును ముందుకు నడిపించారు.



## ప్రమోద్ భగత్‌కు బంగారు పతకం

### ఆరోసారి స్వర్ణంతో రికార్డుపుటల్లోకి..

బహ్రైన్: పారా ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ప్రమోద్ భగత్ రికార్డు నెలకొల్పాడు. 6వ సారి ప్రపంచ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం చేజిక్కించుకున్నాడు. శనివారం జరిగిన ఎస్‌ఎల్3 పురుషుల సింగిల్స్ ఫైనల్లో 21-12, 21-18తో ఇండోనేషియాకు చెందిన ముహమ్మద్‌ను ఓడించాడు. 37ఏళ్ల ప్రమోద్ భగత్.. వరుసగా నాల్గోసారి ఈ ఛాంపియన్‌షిప్‌లో బంగారు పతకంతో మెరిసాడు. ఓవరాల్‌గా కెరీర్‌లో ఇది 6వ స్వర్ణ పతకం. ఇంతకుముందు 2009, 2015, 2019తో పాటు 2022 నుంచి వరుసగా ఈ విభాగంలో బంగారు పతకాలు సాధిస్తూ వచ్చాడు. అలాగే ప్రమోద్ భగత్-సుకాంత్ కండమ్ ఎస్ఎల్3-ఎస్ఎల్4 కేటగిరీలో భారతజట్టును ఫైనల్‌కు చేర్చారు. వీరు 21-19, 21-16తో భారత్‌కే చెందిన జె.డిల్లీ-ఎన్. శివకుమార్‌లను ఓడించారు. ఆదివారం జరిగే ఫైనల్లో వీరు ఫ్రాన్స్‌కు చెందిన టాప్‌సీడ్ లూకాస్-మజూర్‌లతో తలపడనున్నారు.

నినాదం
నిఖార్సైన జర్నలిజం
ఆదివారం 15 ఫిబ్రవరి 2026

# అస్సాం హైవే మీద మోదీ విమానం ల్యాండింగ్








**అస్సాం :** చైనా సరిహద్దుల్లోని భారత్ లోని ఈశాన్య రాష్ట్రం అస్సాం. వాస్తవాధీన రేఖ(ఎల్ఏసీ)కి అత్యంత సమీపంలో ఉంటుంది. అత్యంత సున్నిత మైన ఈ ప్రాంతంలో ఈశాన్య రాష్ట్రాల్ని కలిపే జాతీయ రహదారి ఉంది. దీని పై ఇవాళ ప్రధాని మోదీ ప్రయాణించిన సీ-130 జే యుద్ధ విమానం ల్యాండ్ తో ఈ రహదారి రన్ వేను ప్రధాని ప్రారంభించారు. రహదారి పై యుద్ధ విమానం ల్యాండ్ అవ్వగానే ఒక్కసారిగా జనం కేరింతలు కొడుతూ స్వాగతం పలికారు. ప్రధాని మోదీ శనివారం అస్సాం లోని మోరాన్ లో ఉన్న హైవే మీద సీ-13 జే యుద్ధ విమానంలో అత్యవసర ల్యాండింగ్ అయ్యారు. ఇక్కడ యుద్ధ అవసరాల కోసం జాతీయ రహదారిని కాస్తా రన్ వేగా మార్చారు. అత్యవసర పరిస్థితుల్లో యుద్ధ విమానాలు ఇక్కడ ల్యాండ్ అయ్యేందుకు వీలుగా ఈ ఏర్పాటు చేశారు. దీన్ని ప్రారభించేందుకు ఇవాళ ప్రధాని మోదీ అక్కడికి వెళ్లారు. ఈశాన్య భారత దేశంలో నిర్మించిన తొలి అత్యవసర విమాన ల్యాండింగ్ ఫెసిలిటీ ఇది. సవాలుతో కూడిన పరిస్థితుల్లో రెస్క్యూ, రిలీఫ్ కార్యకలాపాలను సకాలంలో మోహరించడానికి వీలుగా అత్యవసర ప్రతిస్పందనకు ఈ సౌకర్యం చాలా ముఖ్యమైనదని ప్రధాని మోదీ ఎక్స్ లో తెలిపారు. దేశ వ్యాప్తంగా యుద్ధ పరిస్థితుల్లో సాధారణ విమానాశ్రయాలు, ఎయిర్ స్ట్రిప్ ల మీద శత్రువులు దాడి చేస్తే, ప్రత్యామ్నాయంగా మన యుద్ధ విమానాలు ల్యాండ్ అయ్యేందుకు వీలుగా ఇలా ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీలను ఆర్మీ నిర్మిస్తోంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న హైవేలనే ఇలా ఎయిర్ స్ట్రిప్ లుగా మారుస్తోంది. సాధారణ పరిస్థితుల్లో ఇవి హైవేలుగా ఉపయోగపడతాయి. అత్యవసర పరిస్థితుల్లో మాత్రం యుద్ధ విమానాలకు పనికొస్తాయి.

# శరవేగంగా ఉపమాక శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవ ఏర్పాట్లు





**నక్కపల్లి, ్ర ఫిబ్రవరి 14:** ఉత్తరాంధ్ర లో మరో తిరుపతిగా ప్రసిద్ధి చెందిన ఉపమాక శ్రీ వేంకటేశ్వర స్వామి సన్నిధిలో ఈనెల 27వ తేదీన జరిగే శ్రీవేంకటేశ్వర స్వామి వారి వార్షిక కళ్యాణ మహోత్సవానికి సంబంధించి ఏర్పాట్లు శర వేగంగా జరుగుతున్నాయి. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆదేశాల మేరకు భక్తుల స్నానాల నిమిత్తం బందరు సరస్సు( పుష్కరిణి) సుబ్రపరిచి, జల్లు స్నానం ఏర్పాటు చేయడం, అలాగే స్వామివారి ఆలయానికి ఎదురుగా గతంలో కంటే పెద్దగా జర్మన్ షెడ్ నిర్మించి క్యూ లైన్ లో ఉన్నటువంటి భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉండేలా భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం నక్కపల్లి పిఎసిఎస్ చైర్పర్సన్ కొప్పిశెట్టి బుజ్జి, స్థానిక సర్పంచ్ ప్రగడ వీరబాబు కలసి స్వామివారి తిరువీధి సేవలు నిర్వహించే మాడవీధులు శుభ్రపరచడం, స్వామివారి కళ్యాణం ఏకాదశి రోజున మధ్యాహ్నం పెద్ద ఎత్తున జరిగే అన్నదాన కార్యక్రమానికి సంబంధించి టెంట్లు ఏర్పాటు వంటి ఏర్పాట్లు పరిశీలించారు. ఆలయం వద్ద భారీ ఎత్తున విద్యుత్ దీపాలంకరణ, పుష్పాలంకరణ చేపట్టడం వంటి అంశాలపై దానికి నాయకులు, ఆలయ సిబ్బంది చర్చించారు. ముఖ్యంగా మహిళా భక్తుల కోసం తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ఆలయ సివిల్ ఏఈ శివరామరాజు కు తెలియజేసారు. ఉత్సవాల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు వేగవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి శ్రీనివాసరావు, కొంకిపూడి దొరబాబు, టిడిపి యూత్ నాయకులు కొప్పిశెట్టి వాసు, తోలేటి శ్రీనివాస్ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందజేసిన యార్లగడ్డ

**గన్నవరం, ్ర ఫిబ్రవరి 14:** తెలుగుదేశం పార్టీ బలోపేతం కోసం చివరి శ్వాస వరకు అంకితభావంతో పనిచేసిన యానమదల వెంకయ్యరావు మరణం పార్టీకి, మల్లవల్లి గ్రామానికి తీరని లోటని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు. గత 30 ఏళ్లుగా సొంత ప్రయోజనాలను ఆశించకుండా, ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ మల్లవల్లి గ్రామ అభివృద్ధికి వెంకయ్యారావు చేసిన కృషి మరువలేనిదన్నారు. అనారోగ్య కారణాల చేత ఆయన మరణించటం బాధాకరమని అన్నారు. కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుందని ఇందులో భాగంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన రూ. 7.5 లక్షల రూపాయల చెక్కును విజయవాడ లోని తన కార్యాలయంలో వెంకయ్యరావు తనయుడు యనమదల గీతా రామ్ కు ఎమ్మెల్యే యార్లగడ్డ అందజేశారు. తమ తండ్రి ముప్పై ఏళ్ళ గా తెలుగుదేశం పార్టీలో ఉంటూ పార్టీ కోసం అహర్నిశలు శ్రమించారని ఆయన గుర్తు చేశారు. క్యాన్సర్ తో బాధపడుతూ తుది శ్వాస విడిచారాని అన్నారు. పార్టీ కోసం చేసిన కృషిని ఎమ్మెల్యే యార్లగడ్డ గుర్తించారని తన తండ్రి మరణించిన సమయంలో తమ కుటుంబానికి అండగా నిలిచారన్నారు. నేడు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన 7.5 లక్షల రూపాయల చెక్కును అందచేసి భరోసా ఇచ్చారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



# ఇది ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే బడ్జెట్- పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు

**పెందుర్తి, ్ర ఫిబ్రవరి 14:** రాష్ట్ర అసెంబ్లీలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన 2026-27 బడ్జెట్ అభివృద్ధి, సంక్షేమం సమపాలల్లో ప్రాధాన్యత ఇస్తూ ప్రవేశపెట్టిన ప్రజా బడ్జెట్ అని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు అన్నారు. రాష్ట్రంలో అన్ని రంగాలకు ప్రాధాన్యతనిస్తూ, అన్ని వర్గాల ప్రజలకు చేయూతనిచ్చేదిగా ఈ బడ్జెట్ ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. అనుభవం కలిగిన ముఖ్యమంత్రి, బలమైన ప్రభుత్వంలో పనిచేసే మంత్రి బడ్జెట్ ప్రవేశపెడితే ఎలా ఉంటుందో మరొకసారి నిరూపించారని ఆయన అన్నారు. బడ్జెట్ అనేది కేవలం ఈ రాష్ట్రానికి వచ్చిన ఆదాయము, ఖర్చులను లెక్కలు చెప్పేదిగా కాకుండా ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేదిగా ఉండాలని ఆయన అన్నారు. గత ప్రభుత్వం ఈ రాష్ట్రాన్ని ఆర్థిక విధ్వంసం సృష్టించి ఖజానా ఖాళీ చేస్తే, ఈ రాష్ట్రాన్ని అప్పుల ఊబి నుండి గట్టే ఎక్కించి స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంగా ఈ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ఈ రాష్ట్రంలో అన్ని ప్రాంతాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ఈ బడ్జెట్ రూపొందించబడిందని ఆయన అన్నారు. ఇది ప్రజా బడ్జెట్ అని రాబోయే రోజుల్లో ఈ రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నడపడం ఖాయమని ఆయన అన్నారు.



## రాయలసీమ స్థితిగతులను మార్చే రాష్ట్ర బడ్జెట్

పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి



**పుట్టపర్తి, ్ర ఫిబ్రవరి 14:** రాష్ట్ర కూటమి ప్రభుత్వంలో, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజా రంజక బడ్జెట్ అని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అభివర్ణించారు. రాష్ట్ర అసెంబ్లీలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్ రాయలసీమ స్థితిగతులను మార్చే బడ్జెట్ అని కొనియాడారు. ముఖ్యంగా రాయలసీమను కరువు రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు, రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్ గా మార్చేందుకు సుమారు 30 వేల కోట్లు బడ్జెట్లో కేటాయించడం ఎంతో అభినందనీయమని, ముఖ్యమంత్రి చంద్రబాబు కు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ బడ్జెట్లో సాగునీటి రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని గుర్తు చేశారు. అంతే కాకుండా వ్యవసాయానికి 12,172 కోట్లు, అన్నదాత సుఖీభవ పథకానికి 6.600 కోట్లు, హార్టికల్చర్ కు 1,123 కోట్లు, పశుసంవర్ధక 1,121 కోట్లు కేటాయించడం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు. ఎస్సీ సంక్షేమానికి 20,644 కోట్లు, ఎస్టి సంక్షేమానికి 9,190 కోట్లు, బీసీ సంక్షేమానికి 51,021 కోట్లు, మైనార్టీ సంక్షేమానికి 690 కోట్లు, మహిళా శిశు సంక్షేమానికి 4,582 కోట్లు, తల్లికి వందనం 9,668 కోట్లు, జల జీవన్ మిషన్ కు 4,000 కోట్లు, ఎన్టీఆర్ వైద్య సేవకు 4,000 కోట్లు, గృహ నిర్మాణానికి 5,451 కోట్లు, దీపం-2 కింద 2,601 కోట్లు, గ్రామీణాభివృద్ధి కి రూ2,2941 కోట్లు, ఎన్టీఆర్ భరోసా సామాజిక సంక్షేమానికి 27,719 కోట్లు, విభిజీ రామ్ జీ ఉపాధి పథకానికి 8,365 కోట్లు, విద్యుత్ కు రూ13,934 కోట్లు కేటాయించి సామాజిక న్యాయానికి సంక్షేమానికి ఈ బడ్జెట్ లో పెద్ద పీటవేశారని తెలిపారు. ఈ బడ్జెట్ రూపకర్తలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆలోచన మేరకు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తీసుకొచ్చిన బడ్జెట్ ప్రజా రంజక బడ్జెట్ అని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు.

# శంకరవిలాస్ బ్రిడ్జి ప్రధాన వంతెన తొలగింపు పనులు పూర్తి



**గుంటూరు, ్ర ఫిబ్రవరి 14:** రైల్వే ట్రాక్ పై శంకరవిలాస్ బ్రిడ్జి ప్రధాన వంతెన తొలగింపు పనులు విజయవంతం కావడం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, కాంట్రాక్టర్, కార్మికులను గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ స్థానిక డిఆర్ఎం కార్యాలయంలో శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ మనం ఎన్ని కష్టపడి పని చేసినా, కొన్ని పనులు మాత్రం జీవితంలో సంతృప్తిని కలిగిస్తాయి. అలాంటి పనుల్లో ఈ శంకర్ విలాస్ డెమోలిష్ పనులు ఒకటి. ఈ నిర్మాణాల తొలగింపులలో ఏ చిన్న తప్పు జరిగిన ఎన్నో ఇబ్బందులు కలిగేవి. కానీ ఎక్కడా, ఎలాంటి సమస్య ఎదురు కాకుండా, చాలా జాగ్రత్తగా ఈ పనులు పూర్తి చేయగలిగినందుకు చాలా ఆనందంగా ఉంది. ప్రభుత్వ వ్యవస్థలను సరైన పద్ధతిలో సమన్వయపరచుకుంటే ఎంత అద్భుతంగా పనిచేయవచ్చు అనేందుకు ఇది ఒక చక్కటి కేస్ స్టడీగా ఉండబోతుంది. 30 రోజుల్లో ఈ పనులు పూర్తి చేయాలి అన్న లక్ష్యంతో మొదలుపెట్టగా, రికార్డు స్థాయిలో కేవలం 21 - 22 రోజుల్లో పూర్తి చేయడం నిజంగా గుర్తుండిపోయే అంశం. ఇలాంటి అపురూప జ్ఞాపకాలను అందించిన అనురు గ్రూప్స్, యాక్ట్ డిజైన్స్ ఒ సొల్యూషన్స్ వారికి, సిబ్బందికి నా హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న అధికారులను, సిబ్బందిని, కార్మికులను సన్మానించు కోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఎం సుదేశ్నా సేన్, అడిషనల్ డిఆర్ఎం రమేష్, సీనియర్ డివిజనల్ ఇంజనీర్ కోఆర్డినేషన్ శ్రీనివాస్, ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విశ్వనాథ్, స్టేషన్ మాస్టర్ నాగేశ్వర రావు, లక్ష్మీ ఇన్ఫ్రా కాంట్రాక్టర్, సిబ్బంది, డెమోలిసింగ్ ఏజెన్సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# నినాదం
నిఖార్సైన జర్నలిజం

ఆదివారం 15 ఫిబ్రవరి 2026



## ముందు త్రిష సంగతి ఏమిటో తేల్చండి

విజయ్ పై బీజేపీ చీఫ్ సంచలన కామెంట్స్..!!



**తమిళనాడు:** మరో రెండు నెలల్లో తమిళనాడు రాష్ట్రానికి అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. దీంతో అక్కడి రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. నేతల మధ్య మాటలు కోటలు దాటుతున్నాయి. నువ్వెంత అంటే నువ్వెంత అనే స్థాయికి హీట్ పెరిగిపోయింది. తాజాగా తమిళనాడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నైనార్ నాగేంద్రన్ తమిళ నటుడు–టీవీకే పార్టీ అధినేత విజయ్ పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు ఆ వ్యాఖ్యలు తమిళనాడులో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. విజయ్ అభిమానులు ఆగ్రహంతో ఊగిపోతున్నారు. ఇంకా వేసవికాలం రాకముందే తమిళనాడు రాజకీయాలు రాష్ట్రాన్ని నిప్పుల కుంపటిలా మారుస్తున్నాయి. త్వరలో ఆ రాష్ట్రానికి అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పార్టీల మధ్య మాటల యుద్ధం మరో లెవెల్‌కు చేరుకుంది. తాజాగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నైనార్ నాగేంద్రన్ టీవీకే పార్టీ అధినేత విజయ్ ను ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రముఖ నటి త్రిషతో విజయ్ ను ముడిపెడుతూ ఆయన చేసిన వ్యాఖ్యలు టీవీకే కార్యకర్తలు, అభిమానులకు ఆగ్రహం తెప్పించాయి. హీరోయిన్ త్రిష నుంచి విజయ్ బయటకు వస్తేనే ఏమైనా జరుగుతుందంటూ చేసిన ఘాటు వ్యాఖ్యలు నాగేంద్రన్ ను ఇరకాటం లోకి నెట్టాయి. విజయ్ వ్యక్తిగత జీవితాన్ని, రాజకీయ భవిష్యత్తుని లక్ష్యంగా చేసుకుని ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందు నైనార్ నాగేంద్రన్ విజయ్ పార్టీని తీవ్ర స్థాయిలో విమర్శించారు. విజయ్ రాజకీయ అనుభవాన్ని ప్రశ్నించిన ఆయన టీవీకే ఓటు బ్యాంకు వాదనలను కొట్టిపారేయడంతో పాటు అధికార డీఎంకే పైనా విమర్శలు గుప్పించారు. మీడియాతో నాగేంద్రన్ మాట్లాడుతూ విజయ్ రాజకీయ విశ్వసనీయతను, అనుభవాన్ని నాగేంద్రన్ తనదైన శైలిలో తీవ్రంగా ప్రశ్నించారు. పాపం విజయ్‌కి ఏమీ తెలియదు, అతనికి సున్నా అనుభవం, ముందు అతన్ని తన ఇంటి నుండి బయటకు రావాలని చెప్పండి. త్రిషతో తన సంబంధం నుండి అతను బయటపడితేనే వాస్తవాలను చూడగలడు. ఒక రాష్ట్రానికి నాయకత్వం వహించడానికి ప్రయత్నించే ముందు అతను తన కుటుంబ సంబంధాలను సరిచేసుకోవాలి. తనకు కుటుంబంలో సరైన సంబంధాలను కొనసాగించాలి, గొప్ప నాయకులు ఉద్యమాలను ఎలా నిర్మించారో నేర్చుకోవాలి అని అన్నారు. తన వాదనను మరింత బలంగా వినిపించేందుకు నాగేంద్రన్ ఒక సామెతను చెప్పుకొచ్చారు. ఉట్టికెక్కలేనమ్మ స్వర్గానికి ఎగిరనట్టు ఉంది విజయ్ తీరు అంటూ సెటైర్ వేశారు. ప్రతిదానికి అనుభవం కావాలి అని చెప్పుకొచ్చిన నాగేంద్రన్ కుండలో ఏది ఉందో అదే పోయగలరు అని వ్యాఖ్యానించారు. ఓటు షేర్ గురించి టీవీకే చేసిన వాదనలను కూడా నాగేంద్రన్ కొట్టిపారేశారు. ఒక నటుడు అయినంత మాత్రాన అతడు 32% ఓట్లను దక్కించుకుంటాడని ఎలా చెప్పగలమని ప్రశ్నించారు. ఒకప్పుడు విజయకాంత్ సభలకు కూడా భారీగా జనసందోహం తరలివచ్చేదని గుర్తు చేసిన నాగేంద్రన్ అ వి ఓట్లుగా మార్చుకోవడంలో విజయకాంత్ విఫలమయ్యారని చెప్పారు. మొత్తానికి తమిళనాట రాజకీయాలు రంజుగా సాగుతున్నాయి. ఈ సారి ఎన్నికల పై చాలా గట్టిగా ఫోకస్ చేసింది కమలం పార్టీ. వీలైనన్ని ఎక్కువ సీట్ల పై కన్నేసింది. ఓటు శాతం కూడా ఈ సారి బీజేపీకి పెరిగే అవకాశం ఉందంటున్నారు రాజకీయ విశ్లేషకులు. అయితే విజయ్ పార్టీ ఎంట్రీతో ప్రధాన పార్టీలైన డీఎంకే కాంగ్రెస్ కూటమి, అన్నాడీఎంకే బీజేపీ కూటమిలకు చెమటలు పడుతున్నాయనేది అక్కడి అనలిస్టులు చెప్తున్నారు. విజయ్ రాకతో ఏ పార్టీకి ఓట్లు చీలుతాయో అంతు చిక్కడం లేదని పలు సర్వే సంస్థలు కూడా భావిస్తున్నాయి.

## విప్రో తమ ఉద్యోగులకు బంపర్ ఆఫర్ ఇచ్చింది.




**బిజినెస్ డెస్క్ :** దేశీయ టెక్ దిగ్గజం విప్రో బంపర్ ఆఫర్ ఇచ్చింది. తమ ఉద్యోగుల జీతాల పెంపుదలను మార్చి 1 నుండి అమలు చేయనుంది. సెప్టెంబర్ 2024 లో చివరిసారిగా ఇంక్రిమెంట్లు ఇచ్చిన తర్వాత మళ్లీ అప్రైజల్స్ ప్రకటించడం ఇదే తొలిసారి. దాదాపుగా ఏడాదికి పైగా వాయిదా పడుతూ వచ్చిన ఈ నిర్ణయం ఇప్పుడు అమలులోకి వస్తోంది. పెరిగిన జీతాల శాతం ఎంత అనే దాని పై విప్రో యాజమాన్యం ఎటువంటి స్పష్టత ఇవ్వలేదు. ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక పరిస్థితుల్లో నెలకొన్న మందగమనం, భౌగోళిక రాజకీయ అనిశ్చితి, క్లయింట్లు టెక్నికల్ బడ్జెట్‌ను కుదించడం వంటి కారణాలతో గతంలో బేస్ పే సవరణలను నిలిపివేసింది విప్రో. వేతన పెంపుదల విషయంలో యాజమాన్యం ఇంకా తర్జనభర్జన పడుతోందని, దావోస్ లోని ప్రపంచ ఆర్థిక ఫోరం సమావేశం తర్వాత నిర్ణయం తీసుకుంటామని ఈ ఏడాది ప్రారంభంలో ప్రకటించారు విప్రో చీఫ్ హ్యూమన్ రిసోర్సెస్ ఆఫీసర్ సౌరభ్ గోవిల్. అప్రైజల్స్ ఉంటాయని, ఎప్పుడనే విషయం పై ఇంకా తుది నిర్ణయాన్ని తీసుకోవాల్సి ఉందని అన్నారు. దీనికి వాస్తవ రూపాన్ని ఇచ్చింది విప్రో మేనేజ్మెంట్, మార్చి 1 నుండి జీతాలు పెంచనున్నట్లు తెలిపింది. ఈ వేతన పెంపుదల ఇతర పోటీ కంపెనీల విధానాలతో పోలిస్తే భిన్నంగా ఉంటోంది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసిఎస్) తన వేతన పెంపుదల సైకిల్ ను ఏప్రిల్ నుండి సెప్టెంబర్ కు వాయిదా వేసిన విషయం తెలిసిందే. సెప్టెంబర్ నుండి రెండు నుండి ఎనిమిది వాతం వరకు పెంపుదలను అమలు చేసింది. ఇన్ఫోసిస్ దశలవారీగా ఇంక్రిమెంట్లను విడుదల చేసింది. అయిదు నుండి ఎనిమిది శాతం వరకు పెరుగుదల లభించింది. కాగ్నిజెంట్ కూడా మొదట జీతాల పెంపుదలను వాయిదా వేసింది గానీ సంవత్సరం లోపే వాటిని తిరిగి ప్రారంభించింది. ఇక తాజాగా విప్రో కూడా అదే బాట పట్టింది. డిసెంబర్ త్రైమాసికంలో విప్రో ఆదాయం 5.5 శాతం పెరిగి 23,555 కోట్ల రూపాయలకు చేరుకుంది. నికర లాభాలు ఏడు శాతం తగ్గాయి. 3,145 కోట్ల రూపాయలుగా నమోదయ్యాయి. బేస్ శాలరీ పెంపుదల వాయిదా పడినప్పటికీ, విప్రో వేరియబుల్ పరిహారాన్ని చెల్లించడం కొనసాగించింది. డిసెంబర్ 31 ముగిసిన త్రైమాసికానికి సంబంధించి నూరుశాతం త్రైమాసిక వేరియబుల్ పే అవుట్‌ను ఫిబ్రవరి జీతాలతో కలిపి పంపిణీ చేయనున్నట్లు కంపెనీ ప్రకటించింది. అంతకు ముందు రెండు త్రైమాసికాల్లో 90 శాతానికి పైగా చెల్లింపులు జరిగాయి. మార్కెట్ పరిస్థితులు మెరుగుపడే వరకు ఎంట్రీ లెవల్స్, ఫ్రెషర్స్ కు పరిమితంగా ఉండొచ్చు.

# రైతులకు త్వరలో విశిష్ట గుర్తింపు సంఖ్య ఇస్తాం





**అమరావతి, ఫిబ్రవరి 14:** రాష్ట్ర అభివృద్ధిలో వ్యవసాయ రంగం కీలక పాత్ర పోషిస్తుందని ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. మూడో సారి వ్యవసాయ బడ్జెట్ ను ప్రవేశపెట్టడం సంతోషంగా ఉందన్న ఆయన, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయమే వెన్నుముక అని అభివర్ణించారు. ఏపీ ప్రభుత్వం రైతులకు శుభవార్త చెప్పింది, ఆర్థికంగా తోడ్పాటు అందిస్తామని ప్రకటించింది. ప్రతీ రైతుకు మద్దతుగా నిలుస్తామని హామీ ఇచ్చింది. 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వ్యవసాయ బడ్జెట్ ను మంత్రి అచ్చెన్నాయుడు అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. వ్యవసాయం లాభసాటిగా మారితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేత మవుతుందని, దాని ద్వారానే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని వివరించారు. ఏపీ వ్యవసాయ బడ్జెట్ రూ.53,752 కోట్లు గా మంత్రి ప్రతిపాదించారు. రైతు సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సాధారణ బడ్జెట్ ను ప్రతిపాదించిన తరువాత అచ్చెన్నాయుడు వ్యవసాయ - అనుబంధ రంగాల కేటాయింపులను వివరించారు. అందులో భాగంగా ధాన్యం సేకరణకు సంబంధించి రూ.1,674 కోట్ల బకాయిలు చెల్లింపు చేసినట్లు వెల్లడించారు. పెట్టుబడి రాయితీ కింద రూ.310 కోట్లు, వ్యవసాయ యాంత్రీకరణలో 50 శాతం రాయితీతో రూ.136 కోట్లు, భూ సారాన్ని అంచనా వేయడానికి 6 లక్షల భూ సార పరీక్ష పత్రాల అందజేస్తున్నామని వివరించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంతో 18 లక్షల మంది రైతులకు విస్తరణ సేవలు అందిస్తున్నారు. 80 శాతం రాయితీ కింద రూ.90.4 కోట్లతో 1,130 డ్రోన్ కేంద్రాలు, గతేడాది రూ.182 కోట్ల రాయితీతో విత్తనాల సరఫరా, పంటలను కాపాడేందుకు రైతులకు అన్నివిధాలుగా సాయం చేస్తామని ప్రకటించారు. సాగునీటి సౌకర్యాల కల్పనకు బిందు సేద్యం పై ప్రత్యేక దృష్టి సారించినట్లు వెల్లడించారు. వ్యవసాయ రంగం వృద్ధి రేటు 7.83 శాతం గా మంత్రి అచ్చెన్నాయుడు వివరించారు. పీఎం కిసాన్ పథకం కింద రూ.6,309 కోట్లు చెల్లింపులు చేసినట్లు వెల్లడించారు. 2026–27లో రూ.6,600 కోట్లు పీఎం కిసాన్ కోసం కేటాయించగా, ఇప్పుడు కొంత మేర పెంచారు. రాష్ట్ర ఆర్థిక రంగానికి మూల స్తంభంగా వ్యవసాయం నిలిచిందన్నారు. దేశ వ్యవసాయ రంగంలో ఆంధ్రప్రదేశ్ వాటా 10 శాతం గా చెప్పారు. 11 వ్యవసాయ పంటలను గ్రోత్ ఇంజిన్లుగా గుర్తించామని, 24 గంటల్లో 9 వేల కోట్లకు పైగా రైతుల ఖాతాల్లో జమ చేసామని వివరించారు. వ్యవసాయం లాభసాటిగా మారితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉంటేనే రాష్ట్రం ఆర్థికంగా సుభిక్షం సాధ్యం అవుతుందని చెప్పారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటల సాగు, అగ్రి టెక్నాలజీ, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభంగా వ్యవసాయ రంగాన్ని గుర్తించామన్నారు. వ్యవసాయ రంగం వృద్ధి రేటు 7.83 శాతం సాధించిందని తెలిపారు. పంటలను కాపాడేందుకు రైతులకు అన్ని విధాలుగా సాయం అందిస్తామని తెలిపారు. 80 శాతం రాయితీతో రూ.90.4 కోట్లతో.. 1,130 డ్రోన్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. గతేడాది రూ.182 కోట్ల రాయితీతో విత్తనాల సరఫరా చేశామని మంత్రి పేర్కొన్నారు.

బడ్జెట్ ముఖ్యాంశాలు: ప్రాధాన్యత: రాష్ట్ర జనాభాలో 62 శాతం మంది వ్యవసాయం, అనుబంధ రంగాల పైనే ఆధారపడి ఉన్నారని మంత్రి గుర్తు చేశారు.

భవిష్యత్తు ప్రణాళిక: ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనతో పాటు, మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న పంటల సాగుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.

రైతులకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య: రైతులకు మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో, త్వరలో వారికి ప్రత్యేక గుర్తింపు సంఖ్య (యూనిక్యూ ఐడి) ఇవ్వనున్నట్లు మంత్రి ప్రకటించారు.

సాంకేతికత: వాతావరణ మార్పుల పై రైతులకు ముందస్తు హెచ్చరికలు పంపడం ద్వారా పంట నష్టాన్ని నివారించేందుకు సాంకేతికతను ఉపయోగిస్తున్నట్లు ఆయన వివరించారు.

# ఎల్లుండి అమరావతికి బిల్‌గేట్స్..

### హెల్త్‌కేర్ రంగంలో 'గేమ్ ఛేంజర్ సీఎం చంద్రబాబు



**అమరావతి, ఫిబ్రవరి 14:** మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ సోమవారం (ఫిబ్రవరి 16) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వస్తున్నారని సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు. శనివారం అమరావతిలో పార్టీ ఎమ్మెల్యేలతో నిర్వహించిన భేటీలో సీఎం చంద్రబాబు ఈ విషయం వెల్లడించారు. ఎల్లుండి అమరావతికి బిల్ గేట్స్ వస్తున్నారు. బిల్ గేట్స్‌ను 3 సార్లు ఏపీకి తీసుకొచ్చిన ఘనత నాదే అని సగర్వంగా ప్రకటించారు. తొలిసారి హైటెక్ సిటీ (హైదరాబాద్) కోసం, రెండోసారి విశాఖ అగ్రిటెక్ కోసం గేట్స్‌ను రప్పించానని, ఇప్పుడు సంజీవని పథకం కోసం పిలిపిస్తున్నామని వివరించారు. ఆరోగ్య రంగాన్ని విప్లవాత్మకంగా మార్చే లక్ష్యంతో సంజీవని పథకం రూపొందుతోంది. బిల్ ‌ మెలిండా గేట్స్ ఫౌండేషన్ సహకారంతో ఈ పథకం ద్వారా గ్రామీణ ఆరోగ్య సేవలు, వ్యాక్సినేషన్, మాతా శిశు సంరక్షణ వంటి అంశాల్లో పురోగతి సాధించాలని ప్రభుత్వం భావిస్తోంది. కాగా, సంజీవని పథకం అనేది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో 2025 లో ప్రవేశపెట్టిన టెక్నాలజీ ఆధారిత ప్రజా ఆరోగ్య కార్యక్రమం. ఇది రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ గా మార్చడం, ప్రతి పౌరుడికీ డిజిటల్ హెల్త్ రికార్డులు, ముందస్తు రోగ నిర్ధారణ, ఉచిత, సులభ వైద్య సేవలు అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. సంజీవని పథకం కింద ప్రతి ఒక్కరికీ డిజిటల్ హెల్త్ ప్రొఫైల్, డిజిటల్ హెల్త్ కార్డ్ ఇస్తారు. ఇందులో వైద్య పరీక్షలు, చికిత్స చరిత్ర, ప్రిస్క్రిప్షన్లు, ల్యాబ్ రిపోర్టులు, వ్యాక్సినేషన్ రికార్డులు స్టోర్ అవుతాయి. మొబైల్ ఫోన్ ద్వారా డాక్టర్ అపాయింట్ మెంట్లు బుక్ చేసుకోవచ్చు. క్యాష్‌లెస్, పేపర్‌లెస్ మాత్రమే కాకుండా తక్షణ సాయం అందుతుంది. ప్రతి కుటుంబానికీ సంవత్సరానికి రూ.2.5 లక్షల వరకు ఉచిత వైద్య చికిత్స (యూనివర్సల్ హెల్త్ కవరేజ్). అవసరమైతే ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా అడ్వాన్స్‌డ్ ట్రీట్‌మెంట్ కోసం రూ.25 లక్షల వరకు సాయం. ముందుగానే రోగాలను గుర్తించడం. ఉదాహరణకు 30 ఏళ్లు దాటిన వారికి, హై–రిస్క్ కేసులకు స్క్రీనింగ్. రాష్ట్ర వ్యాప్తంగా 72.73 లక్షల మందికి 42 రకాల వైద్య పరీక్షలు (రక్త పరీక్షలు, డయాబెటిస్, బీపీ, గుండె సంబంధిత వంటివి) చేస్తారు. ఏఐ–ఆధారిత స్క్రీనింగ్, పర్సనలైజ్డ్ మెడిసిన్ కార్యక్రమాన్ని బిల్ ‌ మెలిండా గేట్స్ ఫౌండేషన్, టీసీఎస్ (టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్) సహకారంతో అమలు చేస్తున్నారు. ఇది ఆయుష్మాన్ భారత్, ఎన్టీఆర్ హెల్త్ సర్వీసెస్‌తో ఇంటిగ్రేట్ అవుతుంది. అమరావతితో సంబంధం.. అమరావతి రాజధాని ప్రాంతంగా ఉండటంతో సంజీవని పథకం ఇక్కడ ప్రధానంగా అమలు చేయాలని చూస్తున్నారు. బిల్ గేట్స్ ఫౌండేషన్ సహకారంతో డిజిటల్ హెల్త్ రికార్డులు, పర్సనలైజ్డ్ మెడిసిన్ వంటి అంశాలు అమరావతిలో ఫోకస్ చేస్తున్నారు. బిల్ గేట్స్ తన పర్యటనలో (ఫిబ్రవరి 16) అమరావతికి వచ్చి ఈ పథకం పై చర్చలు జరుపుతారు. ఇది అమరావతిని హెల్త్‌కేర్ ‌ టెక్నాలజీ హబ్‌గా మార్చే భాగంగా చూస్తున్నారు. మొదటి పైలట్ ప్రోగ్రాం కుప్పం నియోజకవర్గం (చిత్తూరు జిల్లా)లో విజయవంతంగా ప్రారంభ మైంది. తర్వాత 2026 జనవరి నుంచి చిత్తూరు జిల్లా మొత్తం అమల్లోకి తెచ్చారు. 2026 లో రాష్ట్ర వ్యాప్తంగా పూర్తిగా అమలు చేస్తారు. జూలై 2026 నాటికి లక్షల మంది స్క్రీనింగ్ పూర్తి చేసి, ఆరోగ్య భద్రతను బలోపేతం చేయాలనేది ఈ పథకం లక్ష్యం. ఈ పథకం రాష్ట్ర ప్రజలకు ఆర్థిక భారం తగ్గించి, నాణ్యమైన ఆరోగ్య సేవలు అందుబాటు లోకి తెచ్చే గేమ్ ఛేంజర్ గా చెబుతున్నారు.

# దక్షిణ నియోజకవర్గం అభివృద్ధికి సహకరించాలి

### – ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ను కోరిన వంశీకృష్ణ శ్రీనివాస్

**అమరావతి, ? ఫిబ్రవరి 14:** 39 వార్డు జనసేన అధ్యక్షులు మైలపల్లి చిన్న కుమారునికి 8 లక్షలు ఇది వరకే సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరు చేయించగా మరొక నాలుగు లక్షల ఇవాళ సీఎం కలిసి మంజూరు చేయించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్. దక్షిణ నియోజకవర్గాన్ని అధునాతన నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని విశాఖ దక్షిణ ఎమ్మెల్యే సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ కోరారు. శనివారం ముఖ్యమంత్రిని కలిసి నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమం, ప్రజల జీవన స్థితిగతుల గురించి చర్చించారు. విశాఖ లోనే తొలి సిటిగా పాత నగరం పేరుగాంచిందని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అభివృద్ధి పనులు సాగుతున్నాయని తెలియజేశారు. నియోజవర్గంలో కాలుష్యం ఇతర అంశాల పై చర్చించారు. ఎంతో మంది కుటుంబాలు దక్షిణ నియోజకవర్గం దశాబ్దాలుగా జీవనం సాగిస్తున్నాయని, వారికి మరింత పురోగతి సాధించేలా సహకరించాల్సిన అవసరం ఉందని కోరారు. ఇటీవల కాలంలో 39 వార్డు జనసేన అధ్యక్షులు మైలపల్లి చిన్న కుమారుని జితేంద్ర కు సీఎం రిలీఫ్ ఫండ్ కింద 8 లక్షలు మంజూరు చేయగా, మరల ఎమ్మెల్యే స్వయంగా కలసి నాలుగు లక్షలు మంజూరు చేయించడం జరిగిందని, అయితే వైద్య సహాయానికి మరింత తోడ్పాటు అవసరం అవుతుందని వైద్యులు చెప్పారని ముఖ్యమంత్రి తెలియజేశారు. దీని పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించి తక్షణమే సీఎం సహాయనిది ద్వారా అందజేస్తున్నట్లు చెప్పారన్నారు. దీంతో ఆ కుటుంబానికి దాదాపు పన్నెండు లక్షలు సీఎం సహాయనిది ద్వారా అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం పలు విషయాల పై వినతి పత్రం అందజేయగా ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని ఆయన తెలియజేశారు.



# కుల్దీప్ లేకుండా భారత్ మ్యాచ్ గెలవలేదు

## స్పోర్ట్స్

### టీమిండియా లిటిల్ మాస్టర్ సునీల్ గవాస్కర్



ఫిబ్రవరి 15న పాకిస్థాన్‌తో భారత్ తదుపరి మ్యాచ్ జరగనున్న నేపథ్యంలో, రెండు దేశాల అనుభవజ్ఞులు తమ తమ జట్లపై సలహాలు ఇవ్వడం ప్రారంభించారు. పాకిస్థాన్‌తో జరిగే హై-వోల్టేజ్ టీ20 ప్రపంచ కప్ మ్యాచ్ కోసం టీమిండియా తన ప్లేయింగ్ ఎలెవెన్‌లో కీలక మార్పు చేయాలని సునీల్ గవాస్కర్ సూచించారు. స్పిన్‌కు అనుకూలమైన కొలంబో పిచ్‌పై భారత్ గెలవాలంటే, అర్ష్‌దీప్ సింగ్ స్థానంలో ఈ పవర్ ఫుల్ స్పిన్నర్‌ను ఖచ్చితంగా జట్టులోకి తీసుకోవాలని స్పష్టం చేశారు. పాకిస్థాన్‌తో జరిగే మ్యాచ్‌కు ముందు భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, లెజెండరీ వ్యాఖ్యాత సునీల్ గవాస్కర్ భారత జట్టు యాజమాన్యానికి ఒక ప్రధాన సూచన చేశారు. ఎడమచేతి వాటం ఫాస్ట్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ ప్రస్తుతం ఫామ్‌లో లేడని గవాస్కర్ అభిప్రాయపడ్డారు. నమీబియాతో జరిగిన చివరి మ్యాచ్‌ను వివరిస్తూ, నమీబియా బ్యాట్స్‌మెన్స్ అర్ష్‌దీప్‌ను ఓడించిన విధానం, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ పూర్తి ఓవర్లు కూడా బౌలింగ్ చేయించలేకపోయాడని, పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో అతని స్థానంలో స్పిన్నర్‌ను ఆడించాలని ఇది సూచిస్తుందని అన్నారు. హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే బౌలింగ్ చేస్తున్నప్పుడు అర్ష్‌దీప్ తన నాలుగు ఓవర్లు పూర్తి చేయలేదని సునీల్ గవాస్కర్ తెలిపారు. కెప్టెన్‌కి అతనిపై ఉన్న నమ్మకం సన్నగిల్లిందని స్పష్టంగా తెలుస్తుంది. పాకిస్తాన్ లాంటి బలమైన జట్టుతో పోటీ పడేటప్పుడు, ఒత్తిడిలో పరుగులు లీక్ చేసే బౌలర్‌తో మీరు రిస్క్ తీసుకోలేరంటూ ఎత్తిచూపాడు. గవాస్కర్ ప్రకటన సాధారణమైనది కాదు, ఎందుకంటే అతను తరచుగా జట్టు ప్రదర్శనను నిశితంగా పర్యవేక్షిస్తుంటాడు. పాకిస్థాన్‌తో జరిగే మ్యాచ్‌లు ఎల్లప్పుడూ ఒత్తిడితో కూడిన ఆట అని, శ్రీలంక పిచ్‌లు, ముఖ్యంగా కొలంబోను స్పిన్నర్లకు స్వర్గధామంగా భావిస్తారని సునీల్ గవాస్కర్ అభిప్రాయపడ్డారు. కుల్దీప్ యాదవ్ మణికట్టు స్పిన్ పాకిస్తాన్ మిడిల్ ఆర్డర్‌ను నాశనం చేసే అవకాశం ఉందని గవాస్కర్ నొక్కి చెప్పాడు. భారత్ ముగ్గురు స్పెషలిస్ట్ స్పిన్నర్లతో ఆడినప్పుడల్లా వారు విజయం సాధించారని చరిత్ర చూపిస్తుందని ఆయన అన్నారు. కుల్దీప్ యాదవ్ మ్యాచ్ విన్నర్ అని, అతను లేకుండా పాకిస్థాన్‌ను ఓడించడం కష్టమని ఆయన అన్నారు. హార్దిక్ పాండ్యా మొదటి ఓవర్ వేయడం చూస్తే, పాకిస్తాన్ మ్యాచ్ కోసం అర్ష్‌దీప్ స్థానంలో జట్టు యాజమాన్యం ఇప్పటికే ఎవరిని ఎంపిక చేస్తుందో అర్థం అవుతుందని గవాస్కర్ అన్నారు. జట్టులో కుల్దీప్ ఉండటం బౌలింగ్ కు వైవిధ్యాన్ని జోడించడమే కాకుండా వరుణ్ చక్రవర్తి, అక్షర్ పటేల్ లతో కలిసి పాకిస్తాన్ ఆటగాళ్లను ట్రాప్ చేయగలడు. దీనిని పాకిస్తాన్ బ్యాటర్స్ అధిగమించడం కష్టమని నిరూపించవచ్చు. కుల్దీప్ ను మాత్రమే కాకుండా వరుణ్ చక్రవర్తిని కూడా సునీల్ గవాస్కర్ ప్రశంసించారు. వరుణ్ తక్కువ ఓవర్లు బౌలింగ్ చేసినప్పటికీ, అతని వికెట్ తీసే సామర్థ్యం స్పష్టంగా కనిపించిందని ఆయన అన్నారు. వరుణ్, కుల్దీప్ కలిసి బౌలింగ్ చేస్తే పాకిస్తాన్ బ్యాటింగ్ కుప్పకూలిపోతుందని గవాస్కర్ అభిప్రాయపడ్డారు. ఆర్థికంగా బౌలింగ్ చేసి వికెట్లు తీసిన అక్షర్ పటేల్ ప్రదర్శనను కూడా ఆయన ప్రశంసించారు. ఇంతలో, టీం ఇండియాకు మరో శుభవార్త ఏమిటంటే, ఓపెనర్ అభిషేక్ శర్మ కడుపు ఇన్ఫెక్షన్ నుంచి కోలుకున్నాడు. పాకిస్థాన్‌తో జరిగే ఎంపికకు అందుబాటులో ఉంటాడు. వరుణ్ చక్రవర్తి స్వయంగా ఈ విషయాన్ని ధృవీకరించాడు. ప్రస్తుత పరిస్థితుల్లో కుల్దీప్ యాదవ్‌ను ప్లేయింగ్ ఇ×లో చేర్చడం అత్యంత వివేకవంతమైన నిర్ణయం అని సునీల్ గవాస్కర్ తేల్చిచెప్పారు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, కోచ్ గౌతమ్ గంభీర్ గవాస్కర్ సలహాను ఎలా పాటిస్తారో చూడాలి.



### ప్రియురాలికి హార్దిక్ పాండ్యా మరిచిపోలేని జ్ఞాపకం

ఫిబ్రవరి 15న పాకిస్తాన్‌తో హైవోల్టేజ్ ఉన్నప్పటికీ భారత స్టార్ క్రికెటర్ హార్దిక్ పాండ్యా తన గర్ల్‌ఫ్రెండ్ మహికా శర్మకు ఈ వాలెంటైన్స్ డేని మరింత ప్రత్యేకంగా మార్చారు. తన గర్ల్‌ఫ్రెండ్ పేరులోని మొదటి అక్షరం 'వీ'ని తన మెడ వెనుక భాగంలో పాండ్యా టాటూ వేయించుకున్నాడు. ఈ టాటూను సెలబ్రిటీ టాటూ ఆర్టిస్ట్ సన్నీ భానుశాలి, లీడ్ ఆర్టిస్ట్ తుషార్ మరానే రూపొందించారు. హార్దిక్ ఎం అక్షరంతో కొత్త టాటూ మహికా శర్మపై తన ప్రేమను వ్యక్తం చేస్తోంది. ఈ వాలెంటైన్స్ డే ఆమెకు ఎప్పటికీ గుర్తుండిపోతుందని ఫ్యాన్స్ సైతం కామెంట్లు చేస్తున్నారు. టీమ్ సమాచారం ప్రకారం, హార్దిక్ పాండ్యా మొదట మహికా కోసం కేవలం ఒక చిన్న టాటూ వేయించుకోవాలని అనుకున్నాడు. కానీ వారు తమ రిలేషన్, ఒకరి గురించి ఒకరు మాట్లాడుకుంటున్నప్పుడు, ఆ ఐడియా పెద్దదిగా మారింది. చివరికి వాలెంటైన్స్ డే గిఫ్ట్ గా మారింది. టాటూలో మీరు గమనిస్తే.. 2 చిరుతపులులు ఉన్నాయి. మొదటి చిరుతపులి చాలా పవర్‌ఫుల్, నేచురల్‌గా కనిపిస్తుంది. ఇది హార్దిక్ పాండ్యా బలాన్ని, శ్రమను సూచిస్తుంది. రెండో చిరుతపులి లైన్ ఆర్ట్‌లో రూపొందించారు. ఇది మొదటి చిరుత చుట్టూ తిరుగుతున్నట్లు ఉంటుంది. తన గాళ్‌ఫ్రెండ్ మహికా పేరులోని మొదటి అక్షరం 'వీ' స్పష్టంగా కనిపిస్తుంది. హార్దిక్ మొదట కేవలం మహికా పేరులోని మొదటి అక్షరాన్ని మాత్రమే టాటూ వేయించుకోవాలని భావించాడని సన్నీ భానుశాలి తెలిపారు. కానీ మాట్లాడుతున్న సమయంలో వారి బంధంలోని ఒక స్పెషల్ స్టోరీ బయటకు వచ్చింది. వారు ఒకరికొకరు బలాన్ని అందించే పార్ట్‌నర్స్ కావాలని భావించారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని అర్థవంతంగా చూపించడానికి చిరుతపులి టాటూ సరైన చిహ్నంగా మారింది. ఈ టాటూ కేవలం ఫ్యాషన్ కోసం మాత్రమే కాదు. కొన్ని టాటూలు కేవలం అడిగితే, లేక ఎవరైనా సూచిస్తే వేసుకుంటారు. కానీ కొన్ని వాటంతట అవే రూపుదిద్దుకుంటాయి. హార్దిక్ ఈ టాటూ నమ్మకంతో పాటు భావోద్వేగంతో తయారైంది. టాటూ ఏదైనా రియల్ స్టోరీని ప్రతిబింబించినప్పుడు, అది కేవలం రంగుగా మాత్రం మిగిలిపోదు. వారికి, ప్రియమైన వ్యక్తికి అది ఒక జ్ఞాపకంగా మారుతుంది. హార్దిక్ పాండ్యా గత ఏడాది 2025లో మహికా శర్మతో తన రిలేషన్ పై స్పందించాడు. ప్రస్తుతం వీరు ప్రేమలో మునిగి తేలుతున్నారు. గతంలో హార్దిక్ పాండ్యా విదేశీ మోడల్, బాలీవుడ్ నటి నటాషా స్టాంకోవిచ్‌ను వివాహం చేసుకున్నాడు. వీరిద్దరూ మే 2020లో ఇంట్లోనే సాధారణంగా వివాహం చేసుకోగా, ఫిబ్రవరి 2023లో రాజస్థాన్‌లో హిందూ, క్రైస్తవ సంప్రదాయాల ప్రకారం వైభవంగా పెళ్లి చేసుకున్నారు. ఏడాదిన్నరలోనే కథ ముగిసింది. అభిప్రాయభేదాలు రావడంతో జూలై 2024లో వారు విడిపోతున్నట్లు ప్రకటించారు. వీరికి కుమారుడు అగస్త్య ఉండగా.. బాలుడి బాధ్యతలను ఇద్దరూ చూసుకుంటున్నారు.

### ఉత్కంఠ పోరులో స్కాట్లాండ్‌పై ఇంగ్లాండ్ విజయం

టీ20 వరల్డ్ కప్‌లో భాగంగా నేడు కోల్‌కతాలో జరిగిన మ్యాచ్‌లో స్కాట్లాండ్‌పై ఇంగ్లాండ్ అద్భుత విజయం సాధించింది. 5 వికెట్ల తేడాతో స్కాట్లాండ్‌ను చిత్తుచేసింది. వెస్టిండీస్ చేతిలో ఓటమి తర్వాత డీలా పడ్డ ఇంగ్లాండ్‌కు ఈ గెలుపు టానిక్‌లా పనిచేసింది. మొదట బౌలింగ్లో అదిల్ రషీద్ మాయ చేయగా, ఛేజింగ్ లో టామ్ బాంటన్ వీరోచిత ఇన్నింగ్స్ తో జట్టును గెలిపించాడు. స్కాట్లాండ్ నిర్దేశించిన 153 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లాండ్ మరో 10 బంతులు మిగిలి ఉండగానే, 18.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఈ గెలుపుతో ఇంగ్లాండ్ తన సూపర్-8 అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. టాస్ గెలిచిన ఇంగ్లాండ్ సారథి హ్యారీ బ్రూక్ బౌలింగ్ ఎంచుకోవడంతో స్కాట్లాండ్ బ్యాటింగ్ కు దిగింది. ఇంగ్లీష్ బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్ ముందు స్కాట్లాండ్ బ్యాటర్లు నిలవలేకపోయారు. ఆ జట్టు నిర్ణీత 19.4 ఓవర్లలో 152 పరుగులకే ఆలౌట్ అయ్యింది. స్కాట్లాండ్ తరపున రిచీ బెరింగ్టన్ 49 పరుగులతో ఒంటరి పోరాటం చేయగా, టామ్ బ్రూస్ 24 పరుగులు జోడించాడు. ఇంగ్లాండ్ బౌలర్లలో వెటరన్ స్పిన్నర్ అదిల్ రషీద్ 36 పరుగులు ఇచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టాడు. పేసర్ జోఫ్రా ఆర్చర్ రెండు వికెట్లు తీసి ప్రత్యర్థి స్కోరును కట్టడి చేయడంలో కీలక పాత్ర పోషించాడు. 153 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లాండ్ కు ఆరంభంలోనే షాక్ తగిలింది. ఓపెనర్లు ఫిల్ సాల్ట్ (2), జాస్ బట్లర్ తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరారు. ఆ తర్వాత వచ్చిన జాకబ్ బెథెల్, కెప్టెన్ హ్యారీ బ్రూక్ కూడా స్వీప్ షాట్లకు ప్రయత్నించి వికెట్లు పారేసుకున్నారు. దీంతో ఇంగ్లాండ్ శిబిరంలో ఆందోళన మొదలైంది. అయితే ఈ దశలో క్రీజులోకి వచ్చిన టామ్ బాంటన్ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 41 బంతుల్లోనే అజేయంగా 63 పరుగులు చేశాడు. ముఖ్యంగా మార్క్ వాట్ వేసిన ఒకే ఓవర్లో మూడు భారీ సిక్సర్లు బాది మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశాడు. సామ్ కరన్ (28) అతనికి చక్కటి సహకారం అందించాడు. చివర్లో విల్ జాక్స్ విన్నింగ్ షాట్ కొట్టి లాంఛనం పూర్తి చేశాడు. ఈ అద్భుత ఇన్నింగ్స్ ఆడిన టామ్ బాంటన్ కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఈ విజయంతో ఇంగ్లాండ్ గ్రూప్-సి పాయింట్ల పట్టికలో తమ స్థానాన్ని మెరుగుపచుకుని తదుపరి దశకు వెళ్లే అవకాశాలను పెంచుకుంది. మరోవైపు గట్టి పోటీ ఇచ్చినప్పటికీ స్కాట్లాండ్ కు నిరాశే మిగిలింది.






### పాకిస్తాన్‌తో కీలక మ్యాచ్ కోసం టీమిండియా కసరత్తు

**సమాలోచనలో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్**

**నలుగురు కీలక ప్లేయర్లను బరిలోకి దిగే చాన్స్**

**నేడు కొలంబోలో పాక్ తో ఇండియా మ్యాచ్**

2026 టీ20 ప్రపంచ కప్‌లో పాకిస్థాన్‌తో జరిగే కీలక పోరుకు భారత జట్టు సిద్ధంగా ఉంది. ఈ బ్లాక్‌బస్టర్ మ్యాచ్ కోసం కోచ్ గౌతమ్ గంభీర్ ఓ మాస్టర్ ప్లాన్ రూపొందించాడు. ప్లేయింగ్ ఎలెవెన్‌లో ఒకేసారి నలుగురు మ్యాచ్ విన్నింగ్ స్పిన్నర్లను రంగంలోకి దింపేందుకు సిద్ధమయ్యాడు. అంటే, ఫిబ్రవరి 15న కొలంబోలో జరిగే మ్యాచ్‌లో కోచ్ గౌతమ్ గంభీర్ తన స్పిన్ అస్త్రాలను పాకిస్థాన్ జట్టుపై ప్రయోగించేందుకు సిద్ధమయ్యాడు. భారత స్పిన్ ఆల్ రౌండర్ వాషింగ్టన్ సుందర్ పూర్తిగా ఫిట్ గా ఉన్నాడు. జట్టులో చేరాడు. నమీబియాతో జరిగిన మ్యాచ్‌లో సుందర్‌కు ఆడే అవకాశం రాలేదు. కానీ, కోచ్ గౌతమ్ గంభీర్ ఈ యువ స్పిన్ ఆల్ రౌండర్‌ను పాకిస్థాన్‌తో జరిగే మ్యాచ్‌లో నేరుగా బరిలోకి దించవచ్చని భావిస్తున్నారు. సుందర్ తన బౌలింగ్ తోనే కాదు, బ్యాటింగ్ ఆర్డర్‌లో భారీ షాట్లు కూడా కొట్టగలడు. ఇది మ్యాచ్‌లో కీలకం అవుతుంది. 2026 టీ20 ప్రపంచ కప్‌లో తొలి రెండు మ్యాచ్‌ల్లో భారత చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌కు అవకాశం ఇవ్వలేదు. అయితే, కుల్దీప్ యాదవ్ ఆర్. ప్రేమదాస స్టేడియంలో పాకిస్థాన్‌పై ఆడే ఛాన్స్ ఉంది. పాకిస్తాన్‌తో జరిగిన 3 టీ20 మ్యాచ్‌ల్లో కుల్దీప్ 8 వికెట్లు పడగొట్టాడు. అదే సమయంలో 6.58 ఎకానమీ రేటును కూడా కొనసాగించాడు. అందుకే కోచ్ గౌతమ్ గంభీర్ కుల్దీప్‌ను ఎలాగైనా ఆడించాలని కోరుకుంటాడు. గతంలో పాకిస్తాన్ బ్యాట్స్‌మెన్‌ను ఇబ్బంది పెట్టిన ఆర్. ప్రేమదాస పిచ్‌పై కుల్దీప్ యాదవ్ భారత్‌కు గేమ్ ఛేంజర్‌గా నిరూపించబడవచ్చు. భారత జట్టు వైస్ కెప్టెన్ అక్షర్ పటేల్ పాత్ర పాకిస్తాన్ పై చాలా ముఖ్యమైనది కానుంది. ఎందుకంటే, అక్షర్ తన ఎడమ చేతి వేలు స్పిన్ తో పాకిస్తాన్ ను ఇబ్బంది పెట్టడమే కాకుండా, బ్యాట్ తో భారీ ఇన్నింగ్స్ ఆడే సామర్థ్యం కూడా కలిగి ఉన్నాడు. పాకిస్థాన్‌తో జరిగే బిగ్ మ్యాచ్‌లో అక్షర్ పటేల్ తన నాలుగు ఓవర్లలో వీలైనన్ని ఎక్కువ వికెట్లు తీయాలని లక్ష్యంగా పెట్టుకుంటాడు. కోచ్ గౌతమ్ గంభీర్ మాస్టర్ ప్లాన్ ప్రకారం, అక్షర్ ఈ ప్రయత్నంలో కీలక ఆటగాడు కావొచ్చు. కుడిచేతి వాటం మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి స్పిన్ చాలా మంది బ్యాట్స్‌మెన్‌లకు అర్థం కాదు. అయితే, స్పిన్-ఫ్రెండ్లీ ఆర్. ప్రేమదాస పిచ్‌పై, వరుణ్ మరింత ప్రమాదకరమైన బౌలర్‌గా మారవచ్చు. పాకిస్థాన్‌తో జరిగిన నాలుగు టీ20ఐలలో వరుణ్ కేవలం మూడు వికెట్లు మాత్రమే తీసుకున్నప్పటికీ, 2026 ప్రపంచ కప్‌లో తన గణాంకాలను మార్చుకోవాలని చూస్తున్నాడు. 2026లో భారతదేశం తరపున ఐదు మ్యాచ్‌ల్లో వరుణ్ ఎనిమిది వికెట్లు పడగొట్టాడు. అతని ఎకానమీ రేటు కేవలం 7.72 మాత్రమే.

### ఆఫ్ఘనిస్తాన్ జట్టు సభ్యుడికి గుండెపోటు..

టీ20 వరల్డ్ కప్ 2026 కోసం ఇండియాలో పర్యటిస్తున్న ఆఫ్ఘనిస్తాన్ జట్టులో ఆందోళన కలిగించే ఘటన చోటుచేసుకుంది. ఆ జట్టులో కీలక సభ్యుడికి గుండెపోటు రావడంతో ఒక్కసారిగా ఆందోళన నెలకొంది. ఈ వార్త తెలిసిన వెంటనే క్రీడా ప్రపంచం ఉలిక్కిపడింది. ప్రస్తుతం ఆఫ్ఘన్ జట్టు సభ్యుడికి ఢిల్లీలోని ప్రముఖ ఆస్పత్రిలో అత్యవసర చికిత్స అందిస్తున్నారు. ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్ జట్టుకు పర్ఫామెన్స్ అనలిస్ట్‌గా సేవలు అందిస్తున్న కేసీ రామ సుబ్రమణియన్.. జట్టుతో కలిసి ఢిల్లీలోని ఒక హోటల్‌లో ఉంటున్న సమయంలో అకస్మాత్తుగా గుండెపోటుకు గురయ్యారు. ఆయన అస్వస్థతకు లోనవ్వడాన్ని గమనించిన జట్టు మెడికల్ సిబ్బంది వెంటనే స్పందించి హోటల్‌లోనే ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం పరిస్థితి విషమించకుండా ఉండేందుకు వెంటనే దక్షిణ ఢిల్లీలోని ఫోర్టిస్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రికి తరలించిన వెంటనే వైద్యులు ఆయనను పరీక్షించి అత్యవసరంగా యాంజియోప్లాస్టీ సర్జరీ నిర్వహించారు. ప్రస్తుతం రామ సుబ్రమణియన్ ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు వెల్లడించారు. అయినప్పటికీ ముందస్తు జాగ్రత్తగా ఆయన్ని ఐసీయూలో ఉంచి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఈ ఘటనతో ఆఫ్ఘన్ ఆటగాళ్లు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. జట్టు కెప్టెన్ రషీద్ ఖాన్, సీనియర్ ప్లేయర్ మొహమ్మద్ నబీ ఆస్పత్రికి వెళ్లి ఆయనను పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఈ క్లిష్ట సమయంలో రామ సుబ్రమణియన్ కుటుంబానికి ప్రైవసీ కల్పించాలని ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్ బోర్డు విజ్ఞప్తి చేసింది.

# దమ్ముంటే అభిషేక్ శర్మను ఆడించండి'

### సూర్యకు పాక్ కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘా సవాల్!





టీ20 ప్రపంచ కప్ 2026లో భాగంగా ఆదివారం కొలంబో వేదికగా జరగనున్న భారత్-పాకిస్థాన్ మ్యాచ్‌కు ముందు మైండ్ గేమ్స్ మొదలయ్యాయి. పాకిస్థాన్ కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘా, టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌కు ఓ ఆసక్తికరమైన సవాల్ విసిరారు. టీమిండియా యువ ఓపెనర్ అభిషేక్ శర్మ గత నమీబియా మ్యాచ్‌కు ముందు కడుపులో నొప్పి కారణంగా దూరమైన సంగతి తెలిసిందే. అయితే పాక్ కెప్టెన్ సల్మాన్ ఆఘా మాత్రం అభిషేక్ కోలుకోవాలని, అతను భారత్ తుది జట్టులో ఉండాలని కోరుకుంటున్నట్లు వెల్లడించాడు. "అభిషేక్ శర్మ రేపటి మ్యాచ్ ఆడాలని నేను కోరుకుంటున్నాను. అతను త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నాను. మేము అత్యుత్తమ ఆటగాళ్లతోనే పోటీ పడాలనుకుంటున్నాము" అని పాక్ కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘా మీడియా సమావేశంలో పేర్కొన్నాడు. గత ఆసియా కప్‌లో పహల్గాం దాడికి నిరసనగా భారత జట్టు పాక్ ఆటగాళ్లకు షేక్ హ్యాండ్ ఇచ్చేందుకు నిరాకరించిన సంగతి తెలిసిందే. ఇది అప్పట్లో పెద్ద వివాదానికి దారితీసింది. దీనిపై స్పందిస్తూ సల్మాన్ ఆఘా.. "రేపటి మ్యాచ్‌లో క్రీడా స్ఫూర్తి కనిపిస్తుందని ఆశిస్తున్నాను" అని వ్యాఖ్యానించాడు. అయితే మరి పాక్ జట్టు షేక్ హ్యాండ్ ఇవ్వడానికి సిద్ధంగా ఉందా? అని అడగ్గా.. "అది రేపు తెలుస్తుంది" అంటూ దాటవేశాడు. పాక్ బౌలర్ ఉస్మాన్ తారిఖ్ విభిన్నమైన బౌలింగ్ యాక్షన్ ఇప్పుడు హాట్ టాపిక్ అయింది. అతని బౌలింగ్ యాక్షన్ అక్రమమని వార్తలు వస్తున్న నేపథ్యంలో పాక్ కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘా అతనికి మద్దతుగా నిలిచాడు. "అతని యాక్షన్ ఇప్పటికే రెండుసార్లు క్లియర్ అయ్యింది. మీడియా అనవసరంగా హైప్ చేస్తోంది. యాక్షన్ క్లియర్ అయినప్పుడు ఇక చర్చ ఎందుకు?" అని సల్మాన్ ప్రశ్నించాడు.

# విశ్వజి



## తప్పు చేయకండి.. ఎండలో అవి అవసరాలు కాదు.. అనర్థాలు!

ఎండాకాలం వచ్చిందంటే చర్మానికీ, శరీరానికీ అవసరాలు మారతాయి. దానికి తగ్గట్టు కొన్ని విషయాల్లో మనమూ మారతాం. అక్కడే తప్పు చేసే అవకాశం ఉంది. ఇవి అవసరాలు కాదు,అనర్థాలు అంటున్నారు చర్మ, ఆరోగ్య నిపుణులు.
ఇంట్లో అక్కర్లేదు.. సన్‌స్క్రీన్ బయటికెళ్లేప్పుడు మాత్రమే రాసుకోవాలి. ఇంట్లో ఉన్నా, కారులో వెళ్తున్నా అక్కర్లేదు అనుకోవడం అపోహ మాత్రమే. మనం ఎక్కడ ఉన్నా మన చుట్టూ ఉండే వెలుతురులో చర్మానికి హాని చేసే అతినీల లోహిత కిరణాలు ఉంటాయి. కాబట్టి తప్పకుండా ఈ సమయంలో సన్‌స్క్రీన్ వాడాలి.
కడుగుతూనే ఉండాలి... ఎండాకాలం వచ్చిందంటే అదేదో యాడ్‌లో 'కడుగు బాబు కడుగు' అన్నట్టు మొహాన్ని మాటి మాటికీ నీళ్లతో కడుగుతుంటారు. ఇది ఎండవేళ చర్మానికి హాయిని కలిగించి, తేమగా ఉంచుతుందని అనుకుంటారు. కానీ ఇది నిజం కాదు. ఇలా మాటిమాటికీ నీటితో చర్మాన్ని కడగడం వల్ల 'ట్రాన్స్ ఎపిడెర్మల్ వాటర్ లాస్ (టీఈడబ్ల్యూఎల్)' అని పిలిచే ప్రత్యేక పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో చర్మం తేమను కోల్పోయి పొడిబారుతుంది. అదైతే చాలు..
వేసవిలో ఏ వీధి మూలన చూసినా మజ్జిగ, పుదీనా రసం కుండలు, జీరా నీళ్లు, నిమ్మరసాలు దొరుకుతుంటాయి. ఎండవేళ చలువ చేస్తాయన్న ఉద్దేశంతో వాటిని స్వేచ్ఛగా తాగుతుంటారు. కానీ, ఇలా బయట దొరికేవి తాగేప్పుడు అక్కడ ఎంత పరిశుభ్రత పాటిస్తున్నారు, ఎలాంటి నీళ్లు వాడుతున్నారులాంటివి గమనించాలి. లేకపోతే పొట్టకు లేనిపోని తంటా తెచ్చినట్టే. అన్నీ తాగొచ్చు.. ఎండవేళ శరీరంలో నీటి స్థాయుల్ని నిలిపి ఉంచేందుకు ద్రవాలు ఎక్కువగా తీసుకోవాలి. కాబట్టి మంచీ చెడులతో సంబంధం లేకుండా ఏమైనా తాగొచ్చు అనుకోవడం పొరపాటు. కేవలం మజ్జిగ, కొబ్బరినీళ్లలాంటి సంప్రదాయ ఆరోగ్యకర పానీయాలకే ప్రాధాన్యం ఇవ్వాలి. మిల్క్‌షేక్‌లు, శీతల పానీయాల్లాంటి హై క్యాలరీ డ్రింకులను ఏ కాలంలో అయినా పక్కన పెట్టేయాల్సిందే.

# ఎదుర్కోడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండాలి



'కోరుకున్న రంగంలో రాణించాలంటే మనలో ఒక తపన ఉండాలి. ఒక తపస్సులా ఆ రంగాన్ని స్వీకరించాలి. ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఎదుర్కోడానికి సిద్ధంగా ఉండాలి' అంటారు. ఐదు పదుల వయసు దాటిన విపుల్ వర్షిణే. లక్నోవాసి అయిన విపుల్ వర్షిణే ముప్పైఏళ్లుగా ఆర్కిటెక్చర్ రంగంలో తనదైన ముద్ర వేస్తూ, గుర్తింపు పొందారు. ఒక్కరూ తన మాట వినడం లేదు అనే నిరాశ నుంచి రెండు విమానాశ్రయాల రూపకల్పన చేసేంత స్థాయికి ఎదిగారు. విపుల్ వర్షిణే తనను తాను శక్తిగా మలుచుకున్న విధానం నేటి మహిళలకు స్ఫూర్తిని కలిగిస్తుంది. 'నా పేరు విపుల్ అనే ఉండటంతో మగ ఆర్కిటెక్ట్ అనుకుని, సంప్రదించేవారు. నేను మహిళను అని తెలిసి వర్క్ ఇవ్వడానికి వెనకడుగు వేసేవారు. ఇప్పుడు ఈ పరిస్థితుల్లో కొంతమార్పు చూస్తున్నాను కానీ, 30 ఏళ్ల క్రితం నేను ఆర్కిటెక్ట్ అని చెబితే చాలామంది ఆశ్చర్యపోయేవారు. ఇప్పుడు నేను రెండు విమానాశ్రయాలను డిజైన్ చేసే స్థాయికి ఎదిగాక ఈ రంగంలో అమ్మాయిలూ రాణించగలరు అనే స్పష్టత వచ్చింది. ఈ విషయాన్ని నిరూపించడానికి నేను చేసిన ప్రయత్నం ఆషామాషీ కాదు. సృజనతో అడుగు... పుట్టి, పెరిగింది లక్నోలో. స్కూల్ ఏజ్ నుంచి పెయిం టింగ్స్ వేయడం, కార్టూన్స్ గీయడం వంటివి చూసి వాటిని పత్రికలకు పంపించే వారు నాన్న. మొదట నేను మెడిసిన్ చదవాలని కోరుకున్న మా నాన్న నాలోని సృజనాత్మకత చూసి ఆర్కిటెక్ట్ ఇంజినీరింగ్ చేయమని సలహా ఇచ్చారు. ఎందుకంటే ఆర్కిటెక్చర్ సైన్స్, సృజనాత్మకతల సమ్మేళనంగా ఉంటుంది. మా నాన్న మనసులో నేను గవర్నమెంట్ ఉద్యోగం చేయాలని, అది నాకు సురక్షితమైనదని భావించేవారు. నేను ఎంచుకున్న రంగం చాలా శ్రమతో కూడుకున్నదని ఆయనకు తెలియదు. అప్పట్లో కంప్యూటర్లు లేవు కాబట్టి రాత్రంతా డ్రాయింగ్ బోర్డ్ పైనే పని చేయాల్సి వచ్చేది. ఎవరూ సీరియస్‌గా తీసుకోలేదు.. "నేను ఆర్కిటెక్చరల్ ఇంజినీరింగ్ చదువుతున్నప్పుడు మా క్లాస్‌లో ముగ్గురం మాత్రమే అమ్మాయిలం. ఈ వృత్తిలో అబ్బాయిలదే అధిపత్యమని అప్పుడు అర్థమైంది. కాలేజీలో చదివే సమయంలోనే పెళ్లి అయ్యింది. మావారు సివిల్ ఇంజనీర్ కాబట్టి పెళ్లయ్యాక ఆయనతోనే కెరీర్‌ప్రారంభించాను. భవనాలు కట్టే లొకేషన్‌కు వెళ్లేటప్పుడు నాతో మాట్లాడేందుకు కూలీలు తడబడేవారు. మేస్త్రీలు నా మాటలను అస్సలు పట్టించుకునేవారు కాదు. ఒక మహిళ యజమానిగా మారడం వారెవరికీ ఇష్టం ఉండదని అప్పుడు అర్థమైంది. అసలు నన్ను వారు నిర్మాణశిల్పిగా అంగీకరించలేదు. నిరాశగా అనిపించేది. కానీ, నా డిజైన్ ప్రకారమే పనిచేయాల్సి ఉంటుందని నా నిర్ణయాన్ని సున్నితంగానూ, అంతే కచ్చితంగానూ తెలియజేశాను. అక్కడ నుంచి ఆర్కిటెక్ట్‌గా ఎదగడానికి నన్ను నేను మార్చుకుంటూ వెళ్లాల్సి వచ్చింది. ఆఫీస్‌లో నాకు, నా భర్తకు విడివిడిగా క్యాబిన్లు ఉండేవి. క్లయింట్స్ వచ్చినప్పుడల్లా నా సలహా తీసుకోవాలని నా భర్త తరచూ వారికి చెప్పాల్సి వచ్చేది. తీసుకున్నప్రాజెక్ట్ పూర్తి చేయడం పట్ల పూర్తి శ్రద్ధ పెట్టేదాన్ని. కానీ వచ్చిన వాళ్లు మాత్రం 'మిస్టర్ విపుల్ వర్షిణే ఎప్పుడు వస్తారు' అని అడిగేవారు. నేనే విపుల్ అని, ఆర్కిటెక్ట్ అని తెలిసి ఆశ్చర్యపోయేవారు. 200 భవనాల జాబితా.. భవన నిర్మాణంలో నా వర్క్‌ని కొనసాగిస్తూనే లక్నోలోని చారిత్రక కట్టడాలపై, వాటి పరిరక్షణ గురించిప్రాజెక్ట్ వర్క్ చేశాను. అక్కడి వారసత్వ కట్టడాల పట్ల ఎలాంటి జాగ్రత్తలూ తీసుకోవడం లేదని తెలుసుకొని దాదాపు 200 భవనాల జాబితాను తయారు చేశాను. ఆ జాబితాను పురావస్తు శాఖకు అప్పగించాను. ఆ సమయంలోనే 500 పేజీల ఆప్రాజెక్ట్ వర్క్‌ని పుస్తకంగా తీసుకువస్తే ప్రయోజనకరంగా ఉంటుందన్న సన్నిహితుల సలహాతో బుక్‌గా తీసుకువచ్చాను. అలా రచనా ప్రపంచంలోకి అడుగుపెట్టాను. ఇప్పటి వరకు మన దేశ వారసత్వ సంపదపైన ముఖ్యంగా లక్నో సంస్కృతి, వారసత్వ నగరం, చరిత్ర ద్వారా నడక, మ్యూజింగ్స్ ఇన్ బెనారస్, ఎ కెలిడోస్కోప్ ఆఫ్ ది హార్ట్, లక్నో ఎ ట్రెజర్ పేర్లతో 5 పుస్తకాలు ప్రచురిత మయ్యాయి. ఇటీవలే అయోధ్యకు సంబంధించి ఎ వాక్ త్రూ ది లివింగ్ హెరిటేజ్ ప్రచురితమైంది. 'షామ్ ఎ అవద్ పుస్తకంలో లక్నో సంస్కృతిపై స్కెచ్‌లు కూడా వేశాను. లక్నోలోని చికంకారీ ఎంబ్రాయిడరీ, ఈ నగరంలోని వీధులు, మార్కెట్ల గురించి ప్రస్తావించాను. లక్నో ఇన్‌టాక్‌కి కన్వీనర్‌గా ఉన్నాను. లేహ్ విమానాశ్రయం .. ఓ సవాల్!
2018లో లేహ్ ఎయిర్‌పోర్ట్ డిజైన్ చేసే అవకాశం వచ్చింది. ఈప్రాజెక్ట్ నాకు అత్యంత సవాల్‌గా ఉండేది. ఎందుకంటే అక్కడ భూమి, పర్యావరణం చాలా భిన్నంగా ఉంటాయి. పర్వతాల కారణంగా భూభాగం చాలా తేడాగా ఉంటుంది. విమానాశ్రయం అరైవల్, డిపార్చర్ లాంజ్‌ల మధ్య 3 అంతస్తుల వ్యత్యాసం ఉంది. అక్కడ లగేజీ బెల్ట్ రివర్స్ చేయాల్సి వచ్చింది. ఉష్ణోగ్రత చాలా తక్కువ కాబట్టి, ఎయిర్ కండీషనర్లలో ఉపయోగించే ద్రవం ఘనీభవన స్థానం కంటే తక్కువగా ఉంది. అలాంటప్పుడు ప్రత్యేక రసాయనాలను ఉపయోగించి, దానిని ఏర్పాటు చేశాను. లేహ్‌లో అనేక బౌద్ధ విహారాలు ఉన్నాయి. ప్రవేశం ద్వారం వద్ద 30 అడుగుల ఎత్తైన బుద్ధుని విగ్రహాన్ని ఉంచాను. అక్కడి స్థానిక సంస్కృతి, కళ, హస్తకళలను దృష్టిలో ఉంచుకుని రంగు రంగుల వలలు,ప్రార్థన చక్రాలను ఏర్పాటు చేయించాను. అయోధ్య విమానాశ్రయం పనిప్రారంభించినప్పుడు అక్కడ మహంతులు, సాధువులను కలుస్తూ ఉండేదాన్ని. ఎందుకంటే అక్కడి నిర్మాణాన్ని బాగా అర్థం చేసుకోవాలి, సరైన సమాచారం కోసం చాలా పుస్తకాలు చదివాను. వివిధ వృత్తులలో ఉన్న వ్యక్తులతో మాట్లాడాను. దీంతో అయోధ్యపై నాకు ఆసక్తి పెరుగుతూ వచ్చింది. ఆ తర్వాత దానినే పుస్తకంగా తీసుకు వచ్చాను. ఒక సృజనాత్మక వ్యాపకం నన్నూ నా దిశను మార్చింది. సవాల్‌గా ఉన్న రంగంలో సమున్నతంగా నిలబడేలా చేసింది. ఏ రంగం ఎంచుకున్నా అందులో మనదైన ముద్ర తప్పక వేయాలి. అప్పుడే, ఎక్కడ ఉన్నా సరైన గుర్తింపు లభిస్తుంది' అని వివరిస్తారు విపుల్ వర్షిణే.

# విజయాలకు తను ఒక 'ల్యాండ్ మార్క్'..



సంపన్న కుటుంబ నేపథ్యం లేని మిక్కీ జగ్తియాని 'ల్యాండ్‌మార్క్'తో ఒక్కోమెట్టు ఎక్కుతూ ప్రపంచ కుబేరుల సరసన నిలిచాడు. భర్త అడుగు జాడల్లో నడిచి వ్యాపార నైపుణ్యాన్ని సొంతం చేసుకున్న రేణుకా జగ్తియాని 'ల్యాండ్ మార్క్'కు తనదైన మార్క్ జోడించి ఆ వ్యాపార సామ్రాజ్యాన్ని మరింత విస్తరించింది. తాజాగా.. ఫోర్బ్స్ న్యూ బిలియనీర్స్ 2024 జాబితాలో చోటు సాధించింది.రేణుకా జగ్తియాని నేతృత్వంలోని దుబాయ్ చెందిన రిటైలింగ్ దిగ్గజం 'ల్యాండ్‌మార్క్' 21 దేశాలలో పాదరక్షల నుంచి గృహోపకరణ వస్తువుల వరకు వివిధ బ్రాండ్‌లతో విజయపథంలో దూసుకుపోతుంది. హాస్పిటాలిటీ బిజినెస్‌లో కూడా గెలుపు జెండా ఎగరేసింది. ఎప్పటికప్పుడు కొత్త ప్రణాళికలతో ముందుకువెళ్లే రేణుక మిడిల్ ఈస్ట్, ఇండియా, ఆగ్నేయాసియాలోని కీలక మార్కెట్‌లలో రాబోయే కాలంలో వందలాది స్టోర్‌లను ప్రారంభించాలని లక్ష్యంగా నిర్ణయించుకుంది. ఎలాంటి వ్యాపార అనుభవం లేని రేణుక 1993లో ల్యాండ్‌మార్క్ గ్రూప్‌లోకి అడుగు పెట్టింది. 'ఇది సాధ్యమా!' అనుకునే వాళ్లు సందేహాల దగ్గరే తచ్చాడుతారు. 'కచిత్చంగా సాధ్యమే' అనుకునే వాళ్లు ముందుకు దూసుకుపోతారు. రేణుక రెండోకోవకు చెందిన మహిళ. వేగంగా వ్యాపార నైపుణ్యాన్ని అందిపుచ్చుకోవడమే కాదు ఫాస్ట్-ఫ్యాషన్ బిజినెస్ 'స్ప్లాష్'తో తనదైన ముద్ర వేసింది. 'స్ప్లాష్' పదకొండు దేశాలలో 200 స్టోర్స్ వరకు విస్తరించింది. మన దేశంలో 1999లో లైఫ్‌స్టైల్, హోమ్ సెంటర్ అండ్ మాక్స్‌లాంటి అయిదు ఫార్మట్స్‌లో ప్రస్థానం ప్రారంభించి 900 స్టోర్స్‌లో విస్తరించింది ల్యాండ్‌మార్క్. 2017లో రేణుక ల్యాండ్ మార్క్ గ్రూప్ చైర్‌పర్సన్, సీయీవోగా బాధ్యతలు స్వీకరించింది. రేణుక భర్త మిక్కీ జగ్తియాని సౌత్ ఆఫ్రికా ఇమిగ్రెంట్స్‌ను దృష్టిలో పెట్టుకొని బహ్రెయిన్‌లో బేబీ ?ొడక్ట్స్ స్టోర్‌ను మొదలుపెట్టాడు. అక్కడినుంచిప్రారంభమైన బుడి బుడి అడుగుల వ్యాపారం 'ల్యాండ్‌మార్క్' రూపంలోఎక్కడికో వెళ్లింది. భర్త నిర్మించిన వ్యాపార సామ్రాజ్యాన్ని చెక్కుచెదరకుండా నిలబెట్టడం అంత సులువు కాదు. కాని ఎక్కడా రేణుక వెనకడుగు వేయలేదు. అయితే ప్రపంచంలోని ఎన్నో కంపెనీలపై పడినట్లే కోవిడ్ సంక్షోభ ప్రభావం 'ల్యాండ్‌మార్క్' పై పడింది. రెండు నెలలకు పైగా స్టోర్స్ అన్నీ క్లోజ్ అయిపోయాయి. ఆ తరువాత మెల్లమెల్లగా కొత్త గైడ్‌లైన్స్‌తో తెరుచుకోవడం మొదలైంది. 'విపత్కరమైన పరిస్థితుల్లో ఆపరేషనల్‌ప్రాసెస్‌లో ర్యాపిడ్ చేంజెస్ చేశాము. ఉద్యోగుల ఆరోగ్యంపై దృష్టి పెట్టాం. క్వారంటైన్‌లో ఉన్న ఉద్యోగులు లేదా వారి కుటుంబ సభ్యులకు అవసరమైన సహాయం అందించాం, వారిలో ధైర్యం నింపాం. ఆఫీస్, స్టోర్ ఉద్యోగుల కోసం ప్రత్యేక వసతి ఏర్పాటు చేశాం. ఉద్యోగుల కోసమే కాదు కోవిడ్ బాధితుల కోసం మా ఫౌండేషన్ తరపున ఎన్నోరకాల సేవాకార్యక్రమాలు చేపట్టాం' అంటూ ఆ రోజులను గుర్తు తెచ్చుకుంటుంది రేణుక. రేణుక జగ్తియాని భర్త మిక్కీ జగ్తియాని 71 సంవత్సరాల వయసులో చనిపోయారు. కొన్ని సంవత్సరాల క్రితం ఒక రిపోర్టర్ ఆయనను 'మీ నెక్స్ ?న్ ఏమిటి?' అని అడిగాడు. దీనికి మిక్కీ జగ్తియాని చెప్పిన జవాబు.. 'నా గురించి నేను పూర్తిగా తెలుసుకోవడానికి ఎక్కువ సమయం గడపాలనుకుంటున్నాను. వ్యాపార సంబంధిత విషయాల గురించి కాకుండా నేనెవరిని? జీవితపరమార్థం ఏమిటి? లాంటి విషయాల గురించి ఆలోచిస్తుంటాను. వ్యాపార లాభాలే కాదు జీవితానికి సంబంధించిన ఎన్నో అంశాలలో ఆనందం దొరుకుతుంది' భర్త అడుగుజాడల్లో నడిచి, వ్యాపార నైపుణ్యాన్నే కాదు సేవాదృక్పథాన్ని సొంతం చేసుకున్న రేణుకా జగ్తియాని వ్యాపారంతో పాటు సేవాకార్యక్రమాలకు కూడాప్రాధాన్యత ఇస్తోంది. భర్త అడుగుజాడల్లో నడిచి, వ్యాపారనైపుణ్యాన్నే కాదు సేవాదృక్పథాన్ని సొంతం చేసుకున్న రేణుకా జగ్తియాని వ్యాపారంతోపాటు సేవా కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యత ఇస్తోంది.

# 'నిద్రాయోగం'! శారీరక ఆరోగ్యంపై నిద్ర ముద్ర ఇది..



అనేక యోగ ముద్రలు ఉన్నట్లే, 'యోగ నిద్ర' కూడా ఉంది. నిద్ర కూడా ఒక యోగమే." నిద్ర పట్టడం ఒక యోగం, బాగా నిద్రపోవడం ఒక భోగం, నిద్ర పట్టకపోవడం ఒక రోగం" అని చెప్పవచ్చు. ముఖ్యంగా మారిన పని సంస్కృతి (వర్క్ కల్చర్), వివిధ ఒత్తిళ్ల నేపథ్యంలో నిద్ర కొంతమందికి వరంగా, ఎక్కువమందికి శాపంగా మారి కొత్త కొత్త ఆరోగ్య సమస్యలు పుట్టుకొస్తున్నాయని మానసిక శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కొందరికి నిద్ర ఎక్కువ కావడం, కొందరికి తగ్గిపోవడం ఈ మధ్యకాలంలో వచ్చిన ముఖ్య పరిణామంగా పరిశీలకులు భావిస్తున్నారు. మన జీవన గమనంపై, మానసిక, శారీరక ఆరోగ్యంపై నిద్ర వేసే ముద్ర చాలా గొప్పది. "కంటికి నిద్ర వచ్చునే? సుఖంబగునే రతికేళి?" అంటాడు శ్రీనాథ కవి సార్వభౌముడు ఒక సందర్భంలో. "మత్తు వదలరా నిద్దుర మత్తు వదలరా" అన్నాడు ఆధునిక కవి కొసరాజు రాఘవయ్య చౌదరి. ఇలా నిద్ర చుట్టూ అనేక మాటలు, చర్చలు, సిద్ధాంతాలు పుట్టుకొచ్చాయి. 'నిద్ర' శరీరానికి సంబంధించిన ఒక విశ్రాంత స్థితిగా చెప్పినప్పటికీ, అది మనసుకు, మెదడుకు కూడా వర్తిస్తుందని చెప్పాలి. శరీరానికి విశ్రాంతి ఎంత అవసరమో, మెదడుకు కూడా అంతే అవసరం. అవయవాల అలసట తీర్చి, తిరిగి రెట్టింపు శక్తితో దైనందిన కార్యక్రమాలను చేపట్టడంలో నిద్ర పోషించే పాత్ర చాలా కీలకమైంది. మానవ జీవితంలో నిద్ర ప్రాథమిక అవసరమని, అది పౌరుల ప్రాథమిక హక్కు, అని సుప్రీంకోర్టు కూడా స్పష్టం చేసింది. నిద్ర, నిశ్శబ్దం, విశ్రాంతి ఆరోగ్య రీత్యా మానవులకు తప్పనిసరి అవసరమని, నిశ్శబ్దం బంగారం లాంటిదని న్యాయస్థానాలు సైతం వ్యాఖ్యానించాయి. నిద్రపై అనేక పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి. పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయం జరిపిన పరిశోధనల పరంగా చూస్తే, రోజుకు 8 గంటల కంటే తక్కువ నిద్ర పోయే వారిలో శారీరక సామర్థ్యం తక్కువగా ఉంటుందని అర్థం చేసుకోవాలి. ప్రతి సంవత్సరం మార్చి నెల మూడో శుక్రవారం నాడు 'ప్రపంచ నిద్ర దినోత్సవం' కూడా జరుపుకుంటున్నారు. సాధారణంగా పెద్దవాళ్ల కంటే చిన్నపిల్లలకు ఎక్కువ నిద్ర ఎంతో అవసరం. ఇది వారి శారీరక పెరుగుదలలో ముఖ్య పాత్ర పోషిస్తుంది. నెలబాలుడు నుంచి వృద్ధుడి వరకూ నిద్ర పోవాల్సిన సగటు సమయంపై అనేక పట్టికలు విడుదలయ్యాయి. కానీ, పాటిస్తున్న వారిసంఖ్య పరిమితం మాత్రమే. ముఖ్యంగా, ఆధునిక జీవనశైలి నిద్రపై పెను ప్రభావాలను చూపిస్తోంది. నిద్రకు సంబంధమైన అంశాల్లో ఆహారం పాత్ర ఎంతో కీలకం. మెలటోనిన్ స్థాయిల్ని పెంచే ఆహారం వల్ల గాఢ నిద్ర పడుతుందని ఆస్టిన్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు తాజాగా విడుదల చేసిన నివేదికలో వివరిస్తున్నారు. మన ఆలోచనా విధానంతో పాటు మనం తీసుకొనే ఆహార, పానీయాల బట్టి కూడా నిద్ర ఆధారపడుతుందని కొందరు శాస్త్రవేత్తలు నమ్ముతుంటారు. ఈ అంశం ఇంకా శాస్త్రీయంగా రుజువు కావాల్సిన అవసరం ఉంది. మెలటోనిన్ అనేది ఒక హార్మోన్. మనం తీసుకొనే ఆహారం.. నిద్రకు అత్యంత అవసరమైన మెలటోనిన్‌ను అనుకూలంగా, లేదంటే ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది. దానికి అనుగుణంగా నిద్ర తీరు మారిపోతుంది. అమైనో ఆమ్లం(ట్రిప్టోఫాన్) ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవడం వల్ల మెలటోనిన్ హార్మోన్ స్థాయిలు బాగా పెరుగుతాయి. తద్వారా నిద్ర బాగా పడుతుంది. విటమిన్-డి, మెగ్నీషియం, జింక్ ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలు మంచి నిద్రకు ప్రేరకాలుగా నిలుస్తాయి. చేపలు, కివీ పండు, టార్ట్ చెర్రీలు నిద్ర పట్టడానికి ఎంతో ఉపయోగపడతాయి. పడుకునే ముందు గ్లాసు వేడి పాలు తాగితే మంచి నిద్ర పడుతుంది. ఇలా నిద్రకు - ఆహార, పానీయాలకు ఉండే సంబంధాలను నిపుణులు వివరిస్తున్నారు. నిద్రను - మత్తును వేరు వేరుగా చూడమంటున్నారు. (గుండెలు పిండే విషాదం : మరణానికి ఏర్పాట్లు చేసుకుంటున్న స్టార్ యాక్టర్) మద్యపానం వల్ల మెదడు చైతన్య రహితంగా మారి మత్తుగా అనిపిస్తుంది.అది మత్తే కానీ, నిద్ర కాదని వైద్యులు అంటున్నారు. నిద్ర విషయంలో నిర్దిష్ట సమయాలను పాటించడం కూడా ఎంతో ముఖ్యమని చెబుతున్నారు. నేటి కాలంలో, పెరిగిన వృత్తుల వైవిధ్యం, వేళల నేపథ్యంలో సమయపాలన పాటించడం అందరికీ సాధ్యపడదు. వారి వారి వీలునుబట్టి నిద్ర వేళల విషయంలో క్రమశిక్షణను అనుసరించాల్సి ఉంటుంది. ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్స్ నుంచి వచ్చే వెలుగులు కూడా హానికరం అని అంటున్నారు. నిద్రకు ఉపక్రమించే ముందు, పడక గదులలో వీటికి దూరంగా ఉండమని నిపుణులు చేసే సూచనలను గౌరవిస్తే మంచిది. వ్యాయామం, నడక, శారీరక శ్రమ, యోగాభ్యాసం, ధ్యానం, ప్రాణాయామం నిత్యం సాధన చేయడం వల్ల ఎంతో ప్రయోజనం ఉంటుందని చెబుతున్నారు. సంగీతం వినడం, పుస్తకాలు చదవడం, మెదడుకు మేత వేసే పనులు చేయడం కూడా నిద్రపై మంచి ప్రభావాన్ని చూపిస్తాయని తరచూ మనం వింటున్నాం. రోగ నిరోధక శక్తిని పెంచుకోవడం ఎంత ముఖ్యమో ఈ కరోనా కాలంలో బాగా ప్రచారంలో ఉంది. నిద్ర అందుకు ఎంతో ఉపయోగపడుతుంది. నాడీ వ్యవస్థ సక్రమంగా పనిచేయాలన్నా, మంచి నిద్ర అవసరం. నిద్ర తగ్గితే కాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. 'నిద్ర ఒక చిత్తవృత్తి'గా పతంజలి యోగ సూత్రాలు చెబుతున్నాయి. ఆహారంతో పాటు మనసును అదుపులో ఉంచుకోవడం వల్ల ఆరోగ్యవంతమైన నిద్రకు శరీరం అలవాటు పడుతుందని యోగాచార్యులు సూచిస్తున్నారు. నిద్ర ఎంతసేపు పొయ్యామన్నదాని కంటే? ఎంత బాగా నిద్ర పోయామన్నదే ముఖ్యం. 'నిద్రించడం' ఒక కళగా భావిస్తే అన్నీ సర్దుకుంటాయి. యోగం, భోగం, ఆరోగ్యం అన్నీ కలిసి వస్తాయి.

## ఇలా మాత్రం 'చెవి'ని శుభ్రం చేయకండి..

పెరుగుతున్న కాలుష్యానికి ఆరోగ్య సమస?్యలు కూడా అధికమవుతున్నాయి. మనకు తెలియకుండానే రోగాల బారిన పడుతున్నాం. ఈ కాలుష్యానకి చెవి, ముక?్కు, కంటి సమస్యలు నిత్యం వెంటాడుతున్నాయి. చెవి విషయానికొస్తే, చిన్న పిల?్లల్లోనే కాకుండా పెద్దవారిలోనూ వినికిడి లోపం పెరుగుతంది. వాటికి కారణాలు కూడా చాలా ఉన్నాయి. మరి చెవిని కాపాడడంలో.. చేయాల్సిన జాగ్రత్తలను చూద్దాం.
చెవులను రక్షించుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలివి..
పల్లెటూళ్లలో వేసవి సెలవులు రాగానే ఈత నేర్చుకోవడం కోసం పిల్లలు నీటి కుంటలు, చెరువులకు వెళ్తుంటారు. చెరువుల్లోని మురికి నీరు చెవుల్లోకి చేరి ఇన్ఫెక్షన్లు రావచ్చు. అందువల్ల ఈత నేర్చుకోవాలనుకునే పిల్లలు పరిశుభ్రమైన నీళ్లలోనే దిగాలి. చెవులను శుభ్రం చేయడానికి కొందరు గోరువెచ్చగా కాచిన కొబ్బరి నూనె, ఆముదం చెవుల్లో పోస్తారు. ఇలా ఎట్టిపరిస్థితుల్లోనూ చేయకూడదు. అపరిశుభ్రమైన నీటితో తయారు చేసే ఐస్‌క్రీముల వంటివాటితో గొంతుకు సంబంధించిన ఇన్ఫెక్షన్లు వస్తాయి. అవే ఇన్ఫెక్షన్లు చెవులకూ సోకే ప్రమాదం ఉంది. కాబట్టి చెవి, గొంతు, ముక్కు.. భాగాల్లో ఎక్కడ ఇన్ఫెక్షన్ కనిపించినా నిర్లక్ష్యం చేయకూడదు. ముఖ్యంగా పిల్లల విషయంలో ఈ జాగ్రత్తను మరింతగా పాటించాలి. పై జాగ్రత్తలు పాటించాక కూడా.. గులివి, చీము వంటి సమమస్యలతో పాటు.. చెవిపోటు ఎక్కువగా వస్తున్నా, సరిగా వినిపించకపోయినా.. వీలైనంత త్వరగా ఈఎన్‌టీ వైద్యనిపుణులను సంప్రదించాలి.







## జార్జియాలో యాక్షన్!

కథానాయకుడు మహేశ్‌బాబు.. దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి కలయికలో రూపొందుతోన్న ప్రతిష్టాత్మక చిత్రం 'వారణాసి'. కేఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ నిర్మిస్తున్నారు. ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా హైదరాబాద్ షెడ్యూల్‌ను ముగించి.. తదుపరి షెడ్యూల్ కోసం జార్జియాకు పయనం కానున్నట్లు సమాచారం. ఈ నెలాఖరు నుంచి మొదలు కానున్న ఆ కొత్త షెడ్యూల్‌లో మహేశ్‌తో పాటు మిగిలిన ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలతో పాటు యాక్షన్ ఘట్టాలు తెరకెక్కించనున్నట్లు తెలుస్తోంది. ఈ ఫాంటసీ మైథలాజికల్ సినిమాలో రుద్రగా.. రాముడిగా రెండు భిన్న పాత్రల్లో కనువిందు చేయనున్నారు మహేశ్. ఇప్పటికే ఇందులోని రామాయణం ఎపిసోడ్ చిత్రీకరణ పూర్తయినట్లు రాజమౌళి ప్రకటించారు. ఈ సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ చిత్రానికి కథ: విజయేంద్రప్రసాద్, ఎస్ఎస్ కంచి, మాటలు: దేవ కట్టా, సంగీతం: కీరవాణి, ఛాయాగ్రహణం: పీఎస్ వినోద్.



## టాక్సిక్.. తప్పుగా అంచనా వేయొద్దు!

దాదాపు నాలుగేళ్ల విరామం తీసుకున్న యష్ ఇప్పుడు 'టాక్సిక్' మూవీతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. గీతూ మోహన్దాస్ ఈ మూవీకి డైరెక్టర్. లేడీ సూపర్ స్టార్ నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, రుక్మిణి వసంత్, హ్యుమ ఖురేషీ హీరోయిన్లుగా నటిస్తున్నారు. మలయాళ క్రేజీ హీరో టొవినోథామస్, బాలీవుడ్ యాక్టర్ వివేక్ ఓబెరాయ్ కజిన్, అక్షయ్ ఓబెరాయ్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కన్నడ, ఇంగ్లీష్ భాషల్లో ఏక కాలంలో రూపొందుతున్న ఈ మూవీ కన్నడ, తెలుగు, తమిళ, మలయాళ, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో భారీ స్థాయిలో రిలీజ్ కాబోతోంది. 1940 టు 1970 మధ్య సాగే పీరియాడిక్ గ్యాంగ్ స్టర్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ మూవీ టీజర్ అత్యంత వివాదాస్పదం కావడం తెలిసిందే. ఈ నేపథ్యంలో బుక్కు దాని కవర్ను చూసి అంచనా వేయవద్దన్నట్టుగా టీజర్ని చూసి సినిమాపై ఓ నిర్ణయానికి రావద్దని డాక్టర్ జయమాల ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. 'టీజర్ అంటే ప్రేక్షకుల్ని థియేటర్లకు ఆకర్షించడానికి ఉద్దేశించిన చిన్న దృశ్యం. సెన్సార్ బోర్డ్ సమీక్షకు ముందే సినిమా గురించి ఒక నిర్ణయానికి రావడం అపరిపక్వ నిర్ణయమే అవుతుంది. మేకర్స్ ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి వందల కోట్లు ఖర్చు చేసి సినిమాలు నిర్మిస్తారు.



## కావాల్సిందల్లా ఒక్క రోజు

'నాకు తెలియదు నీ మనసుని గెలుచుకోగలనా లేదా అనేది!' అంటూ ప్రియురాలితో తన సందేహాన్ని ఇటీవలే విడుదలైన టీజర్‌లో వ్యక్తం చేశాడు నటుడు జునైద్ ఖాన్. మరి గెలుచుకున్నాడా లేదా తెలియాలంటే 'ఏక్ దిన్' సినిమా చూడాల్సిందే. 'వన్ లవ్ వన్ ఛాన్స్' అనేది ఉపశీర్షిక. ఆమిర్ ఖాన్ తనయుడు జునైద్ సరసన సాయిపల్లవి కథానాయికగా నటించిన చిత్రమిది. రొమాంటిక్ లవ్ స్టోరీగా ఈ సినిమాని సునీల్ పాండే తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఆమిర్ ఖాన్, మన్సూర్ ఖాన్, అపర్ణ పురోహిత్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. వేసవి కానుకగా ఈ సినిమా మే 1న థియేటర్లలో విడుదల కానుంది. తాజాగా చిత్రబృందం ఇన్‌స్టాలో ఈ సినిమా నుంచి కొత్త పోస్టర్‌ని విడుదల చేసింది. 'దీనికి కావాల్సిందల్లా ఒక్క రోజు'అనే క్యాప్షన్‌ని జోడించింది. ఈ పోస్టర్‌లో సాయిపల్లవి చేతిలో మఫిన్‌పై ఉన్న కొవ్వొత్తి వెలుగులో.. చూపులతోనే తన ప్రియుణ్ని కట్టిపడేస్తూ ఆకట్టుకునేలా ఉంది. ఈ సినిమాలో ఆమె మీరా పాత్రలో ప్రేక్షకుల్ని అలరించనుంది.





## ఏమో ఏమో ఇది...

ప్రేమికుల రోజుని పురస్కరించుకుని ఓ సరికొత్త ప్రేమకథా చిత్రాన్ని అధికారికంగా ప్రకటించాయి నిర్మాణ సంస్థలు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్. 'ఏమో ఏమో ఇది' పేరుతో రూపొందనున్న ఆ చిత్రంలో... ఇటీవల 'ఛాంపియన్' సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చిన రోషన్ మేకా కథానాయకుడిగా నటిస్తున్నారు. ప్రీతి ముకుందన్ కథానాయిక. శైలేశ్ కొలను దర్శకుడు. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. శనివారం ఓ ప్రత్యేకమైన వీడియోతో సినిమాని ప్రకటించింది చిత్రబృందం. ఆధునికమైన ఈ ప్రేమకథలో అభయ్ అనే యువకుడిగా రోషన్... అపూర్వ అనే యువతిగా ప్రీతి ముకుందన్ కనిపించనున్నారు. 'లవ్‌స్టోరీలో కూడా ట్విస్టులు, టర్న్‌లు, మసాలా అన్నీ ఉంటాయి...' అనే సంభాషణతో ఈ సినిమా కథపై స్పష్టతని చ్చాయి చిత్రవర్గాలు. త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లనున్న ఈ చిత్రం దసరా సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. సంగీతం: హేషమ్ అబ్దుల్ వహాబ్, ఛాయాగ్రహణం: వంశీ పచ్చిపులుసు.



## దెబ్బకు దిగొస్తున్న పూజాహెగ్డే

టాలీవుడ్లో స్టార్ హీరోయిన్ల లిస్ట్ లో టాప్లో నిలిచిన పూజా హెగ్డే ఇప్పుడు కొత్త ప్లాన్‌తో తిరిగి రీఎంట్రీకి సిద్ధమవుతున్నారు. వరుస సక్సెస్లతో స్టార్ హీరోల సరసన మెరిసిన ఈ బ్యూటీ, ఆ తర్వాత ఎదురైన వరుస పరాజయాలతో కొంత వెనుకబడ్డారు. అయితే తన కెరీర్లో వచ్చిన ఈ మలుపును ఒక బ్రేక్ లాగా కాకుండా పూజా దాన్నొక రీసెట్ బటన్గా తీసుకున్నట్టుగా కనిపిస్తోంది. టాలీవుడ్లో ఒక దశలో అత్యంత బిజీ హీరోయిన్గా కొనసాగిన పూజా హెగ్డే, భారీ పారితోషికం కారణంగా కూడా కొన్ని ప్రాజెక్టులు చేజార్చుకుందనే టాక్ ఇండస్ట్రీలో వినిపించింది. నిర్మాతలు ఖర్చులను కట్టడి చేయాలనుకున్న సమయంలో ఆమె రెమ్యునరేషన్ అడ్డంకిగా మారిందని అప్పట్లో ప్రచారం జరిగింది. అదే సమయంలో పూజా హీరోయిన్ గా నటించిన కొన్ని సినిమాలు బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచాయి. ఈ పరిణామాలతో పూజాకు టాలీవుడ్లో గ్యాప్ ఏర్పడింది. అయితే ప్రస్తుతం పరిస్థితులు మారుతున్నాయి. తమిళం, హిందీ భాషల్లో సినిమాలు చేస్తూనే మంచి బ్రాండ్ ఎండార్స్మెంట్లతో బిజీగా ఉ న్నప్పటికీ, పూజా హెగ్డే దృష్టి మళ్లీ తెలుగుపైనే ఉందని సమాచారం.

## నన్ను నమ్మినోళ్లకు థ్యాంక్స్: శ్రీలీల

టాలీవుడ్ సెన్సేషనల్ హీరోయిన్ శ్రీలీల తన జీవితంలో ఒక అపురూపమైన మైలురాయిని చేరుకుంది. వెండితెరపై నటిగా అలరిస్తూనే, మరోవైపు వైద్య విద్యను విజయవంతంగా పూర్తి చేసి, ఇప్పుడు అధికారికంగా డాక్టర్ శ్రీలీల'గా మారిపోయింది. షూటింగ్ సెట్స్లో ఖాళీ సమయం దొరికితే చాలు పుస్తకాలతో కుస్తీ పట్టిన ఆమె కష్టానికి ఫలితం దక్కింది. ఈ విషయాన్ని తెలుపుతూ శ్రీలీల తన ఇన్స్టాగ్రామ్లో పెట్టిన ఎమోషనల్ పోస్ట్ ప్రస్తుతం నెట్టింట వైరల్గా మారింది. "ఇది కేవలం ఒక డిగ్రీ మాత్రమే కాదు.. నా ఎదుగుదలకు, నమ్మకానికి, కన్నీళ్లకు, పట్టుదలకు నిదర్శనం. రంగుల ప్రపంచం (సినిమాలు) నుంచి నేను ప్రశాంతంగా తలదాచుకునే నా పవిత్రమైన ప్రదేశమే ఈ వైద్య విద్య. అక్కడ నేను కేవలం ఒక విద్యార్థిగా, నేనేలా ఉండాలనుకున్నానో అలా ఉండగలిగాను" అని శ్రీలీల భావోద్వేగానికి లోనయ్యారు. 'నేను నన్ను నమ్మడం నేర్చుకుంటున్న సమయంలో.. నాకంటే ఎక్కువగా నన్ను నమ్మిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటాను. ప్రతి చిరునవ్వు, ప్రతి ప్రోత్సాహం, మీరు నా కోసం చేసిన ప్రతి నిశ్శబ్ద ప్రార్థన నన్ను ఈ స్థాయికి చేర్చాయి. ఈ అధ్యాయం నన్ను ఎంతో వినయంగా, బలంగా మార్చింది. అందుకే, నన్ను నేను మీకు మళ్ళీ పరిచయం చేసుకుంటున్నాను.. ప్రేమతో మీ డాక్టర్ శ్రీలీల' అని వెల్లడించింది.





## వేసవికి నేను రెడీ

హవీశ్, కావ్య థాపర్ జంటగా తెరకెక్కుతున్న చిత్రం 'నేను రెడీ'. త్రినాదరావు నక్కిన దర్శకుడు. ఈ సినిమాని హార్నిక్స్ ఇండియా ఎల్ఎల్‌పీ పతాకంపై రూపొందిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాల దశలో ఉన్న ఈ చిత్రాన్ని వేసవికి విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. తాజాగా ప్రేమికుల రోజుని పురస్కరించుకుని చిత్రబృందం ఓ పోస్టర్‌ని ఆవిష్కరించింది. ఈ సినిమాలో బ్రహ్మానందం, వెన్నెల కిశోర్, మురళీ శర్మ, రోహిణి, హరితేజ తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. మిక్కీ జే మేయర్ ఈ చిత్రానికి స్వరకర్త. యువతకు స్ఫూర్తినిచ్చే కథాంశంతో హాస్యాన్ని మేళవించి ఈ సినిమాని రూపొందిస్తున్నట్లు చిత్రబృందం తెలిపింది.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Sree Seshasai EnterprisesPlot no. 98/1, Co-operative Industrialp Estate,Gandhi Nagar, near Balanagar Medchel -Malkajgiri Dist.Hyderabad 500037 (T.S). Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, PRGI.REGN.NO. APTEL/2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL: +91 8333068787